
1 గత నెల 10న.. ఒంగోలు సమతానగర్‌లో వైసీపీ నేతలు జనంపై రౌడీయిజం ప్రదర్శించారు. ప్రచారంలో వలంటీర్ ఉందని ప్రశ్నించిన సామాన్య కుటుంబంపై దాడి చేశారు. విషయం తెలుసుకుని అక్కడికి వెళ్లిన టీడీపీ నేతను నడి రోడ్డుపై చితకబాదారు. పోలీసులు అక్కడికి చేరుకున్నా ప్రేక్షకపాత్ర వహించారు.

2 సమతానగర్‌లో గాయపడిన వారిని వెంటబెట్టుకొని టీడీపీ ఒంగోలు అభ్యర్థి దామచర్ల జనార్దన్ ఎస్పీని కలిశారు. అనంతరం వారిని చికిత్స కోసం రిమ్స్‌కు తీసుకెళ్లారు. అక్కడికి వైసీపీ అభ్యర్థి బాలినేని శ్రీనివాసరెడ్డి, ఆయన కుమారుడు ప్రణీత్‌రెడ్డి అనుచరులతో చేరుకొని వీరంగం సృష్టించారు. వైసీపీ మూకలు అక్కడ ముఖద్వారం అద్దాలు పగులగొట్టాయి. ఆసుపత్రిలో భీతావహ వాతావరణాన్ని సృష్టించాయి. అక్కడే ఉన్న పోలీసులు నిస్సహాయంగా ఉండిపోయారే కానీ వారిని వారించలేదు.

3 ఈ రెండింటితోపాటు పోలింగ్ రోజు వెంగముక్కలపాలెంలో చోటుచేసుకున్న ఘటనకు సంబంధించి పోలీసుల తీరు అనేక విమర్శలకు తావిచ్చింది. కేసుల నమోదులో పక్షపాతంగా వ్యవహరించారన్న ఆరోపణలు వచ్చాయి. సమతానగర్‌లో బాధిత కుటుంబ పెద్దను ఉద్యోగం నుంచి సస్పెండ్ చేయడాన్ని పలువురు ఆక్షేపించారు. ఈ ఘటనలకు సంబంధించి పోలీసులు తాజాగా 137 మందిపై రౌడీషీట్లు తెరవడం వివాదాస్పదమైంది. అందులో 75 మంది వైసీపీ, 62 మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. కేవలం ఒక్కకేసు ఆధారంగా పోలీసులు వీటిని తెరవడం విస్మయం కలిగిస్తోంది. వారిలో బాధితులు కూడా ఉండటం విడ్డూరంగా ఉంది. రౌడీషీట్లు తెరిచి తమ చేతగానితనాన్ని కప్పిపుచ్చుకున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అయితే పోలీసులు మాత్రం ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకే రౌడీషీట్లు తెరిచామని చెప్పడం గమనార్హం.



బాధిత కుటుంబ పెద్దపైనా చర్యలు!

సమతానగర్‌లో వైసీపీ నేతలు దాడి చేసిన ఇంటి యజమాని లక్ష్మీనారాయణ ఏఆర్ కానిస్టేబుల్. ఆయన కుమారులపై దాడి జరిగింది. ఆ సమయంలో అక్కడ లక్ష్మీనారాయణ లేరంటున్నారు. కానీ ఘటనకు కారణం ఆయనే అని పేర్కొంటూ ఎస్పీ గరుడ్ సుమిత్ లక్ష్మీనారాయణను సస్పెండ్ చేశారు. ఇది తెలుసుకున్న ప్రజలు విస్తుపోయారు.

ఇవేం షీట్లు..!

ఏకపక్షవైఖరిని కప్పిపుచ్చుకునేందుకు రౌడీషీట్లు · బాధితులనూ ఇరికించారు...

ఒంగోలులో 137 మందిపై తెరిచారు
సమతానగర్, వెంగముక్కలపాలెం ఘటనలే కారణం
వారి కదలికలపై నిఘా
ఇప్పటికే అజ్ఞాతంలోకి కొందరు

ఒంగోలు (క్రైం), మే 31 : బాధితులకు న్యాయం చేయాల్సిన పోలీసులు వారిపైనే రౌడీషీట్లు తెరిచారు. గత నెల 10న ఒంగోలు సమతానగర్‌లోనూ, అనంతరం రిమ్స్ వద్ద వైసీపీ నేతలు వీరంగం సృష్టించగా ఆ ఘటనలకు సంబంధించిన బాధితులు, టీడీపీ నేతలపైనా కేసులు నమోదు చేశారు. అలాగే పోలింగ్ రోజు వెంగముక్కలపాలెంలోని ఒక బూత్‌లో టీడీపీ ఏజెంట్‌పై వైసీపీ నేతలు దాడి చేయడంతోపాటు అదేరోజు రాత్రి ఎస్సీ కాలనీలో ఆమె ఇంటి వద్దకు వెళ్లి బీభత్సం సృష్టించారు. అయితే పోలీసులు బాధితులపైనా కేసులు పెట్టారు. ఇప్పుడు ఈ మూడు ఘటనల్లో ఉన్న 137 మందిపై రౌడీషీట్లు తెరిచారు. ఒకే ఒక్క కేసులో ఉన్న వారిపై ఇలా రౌడీషీట్లు తెరవడం ఇదే మొదటిసారి కావడంతో దీనిపై చర్చ జరుగుతోంది.

సమతానగర్‌లో ఏం జరిగిందంటే..

నగరంలోని సమతానగర్‌లో గతనెల 10వతేదీ రాత్రి వైసీపీ శ్రేణులు ఎన్నికల ప్రచారం నిర్వహించాయి. ఈ సందర్భంగా సమతానగర్ మొదటి లైనులో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి కోడలు ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించడం ప్రారంభించారు. అందులో భాగంగా హిమశ్రీ అపార్ట్‌మెంట్‌లోని 2వ అంతస్తులో నివాసం ఉంటున్న చప్పిడి ప్రభావతి ఇంటికెళ్లిన వైసీపీ శ్రేణులు ఓట్లు అభ్యర్థించారు. ప్రచారంలో వలంటీర్ పాల్గొనడంతో ప్రభావతి కుటుంబసభ్యులు ప్రశ్నించారు. దీంతో అవమానంగా భావించిన వైసీపీ నాయకులు ప్రభావతి కుటుంబసభ్యులపై దాడిచేశారు. అనంతరం కిందకు వచ్చి మిగతా ఇళ్లలో ప్రచారానికి వెళ్లారు. దాడి విషయం తెలుసుకున్న స్థానిక టీడీపీ నాయకుడు మేడికొండ మోహన్‌రావు అపార్ట్‌మెంట్ వద్దకు చేరుకోగా, వైసీపీ శ్రేణులు ముప్పై మంది ఒక్కసారిగా ఆయనపై దాడిచేశారు. నడిరోడ్డుపై పడేసి కొట్టారు. స్థానికులు సర్దిచెప్పబోయినా వినిపించుకోకుండా వారిపైనా దాడికి దిగారు. ఆ వీధిలో ఒక్కసారిగా ఉద్రిక్తత నెలకొంది. విషయం తెలుసుకున్న టీడీపీ శ్రేణులు ఒక్కొక్కరుగా అక్కడకు చేరుకున్నారు. దాడి జరిగిన విషయాన్ని తెలుసుకునే ప్రయత్నం చేశారు. ఆ సమయంలో అక్కడే ఉన్న వైసీపీ మూకలు పెద్దపెద్దగా అరుస్తూ రెచ్చగొడుతూ వీరంగం సృష్టించాయి. డీఎస్పీ ఆధ్వర్యంలో భారీగా పోలీసులు అక్కడ మోహరించారు. వారి అండతో వైసీపీ శ్రేణులు మరింత రెచ్చిపోయాయి. తొడలు కొడుతూ, మీసాలు మెలేస్తూ, ఇష్టమొచ్చినట్లుగా మాట్లాడుతుండడంతో స్థానికులు భయంతో తలుపులు వేసుకున్నారు.


టీడీపీ నేత మోహన్‌పై మూకుమ్మడిగా దాడి చేస్తున్న వైసీపీ శ్రేణులు(ఫైల్)

రిమ్స్ వద్ద వైసీపీ నేతల వీరంగం

టీడీపీ అభ్యర్థి దామచర్ల జనార్దన్ సమతానగర్‌కు చేరుకొని క్షతగాత్రులను వెంటబెట్టుకొని ఎస్పీ గరుడ్ సుమిత్‌ని కలిశారు. అనంతరం వారిని చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తీసుకెళ్లారు. వైసీపీ అభ్యర్థి బాలినేని శ్రీనివాసరెడ్డి, ఆయన తనయుడు ప్రణీత్‌రెడ్డి తమ అనుచరులతో రిమ్స్ వద్దకు చేరుకొని వీరంగం సృష్టించారు. వైసీపీ మూకలు ఆసుపత్రి ముఖద్వారం అద్దాలు పగులగొట్టాయి. దీంతో రోగులు సైతం భీతిల్లిపోయారు. అక్కడ ఆ సమయంలో పోలీసు అధికారులు ఉండి కూడా ఏమీ చేయలేదు. ఘటనపై రిమ్స్ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అటు వైసీపీ, ఇటు టీడీపీ వర్గీయులైన 94 మందిపై ఒంగోలు ఒన్‌టౌన్, తాలూకా పోలీసు స్టేషన్‌లో కేసులు నమోదు చేశారు. వీరిలో 82 మందిపై ఒన్‌టౌన్‌లో, మరో ఏడుగురిపై తాలూకాస్టేషన్‌లో రౌడీషీట్లు తెరిచారు. అయితే కేసుల్లో ఉన్న బాలినేని, దామచర్లపై మాత్రం రౌడీషీట్లు తెరవలేదు. అలాగే రిమ్స్‌లో ఘటన జరిగినప్పుడు అక్కడే ఉన్న ప్రణీత్‌రెడ్డిపై అసలు కేసు కూడా నమోదు చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఇదిలా ఉండగా సమతానగర్, వెంగముక్కలపాలెంలో జరిగిన ఘటనలకు సంబంధించి 55 మందిపై తాలూకా పోలీసు స్టేషన్‌లో రౌడీషీట్లు తెరిచారు.

షీట్లు తెరిచిన వారి కదలికలపై నిఘా

రౌడీషీట్లు తెరిచిన వారి కదలికలపై పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు. అదేసమయంలో పోలీసు స్టేషన్‌కు రావాలని కొంత మందికి ఫోన్లు చేస్తున్నారు. దీంతో అనేక మంది ఇప్పటికే అజ్ఞాతంలోకి వెళ్లినట్లు సమాచారం. కోర్టు నుంచి ఏదైనా ఊరట లభించే వరకు అజ్ఞాతం తప్పదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకే..

పల్నాడు ఘటన అనంతరం రైటింగ్ సెక్షన్‌లపై కేసు నమోదైన వారందరిపై రౌడీషీట్లు తెరవాలని ఎన్నికల కమిషన్ ఆదేశించింది. దీంతో ఒంగోలులో 137 మందిపై రౌడీషీట్లు తెరిచాం. ఈసీ ఆదేశాల మేరకు వీరిపై తదుపరి చర్యలు ఉంటాయి.

- కిషోర్‌బాబు, ఒంగోలు డీఎస్పీ

నగరంలో విస్తృత చర్చ

రౌడీషీట్లు ఏకపక్షంగా తెరిచారంటూ రెండు పార్టీల నాయకులు విమర్శిస్తున్నారు. గతంలో తీవ్రనేరాలకు పాల్పడిన వారు, ఎక్కువ కేసులు నమోదైన వారిపై పోలీసులు రౌడీషీట్లు తెరిచేవారు. కానీ ఎన్నికల కోడ్ అములులో ఉన్నప్పుడు జరిగిన ఒక్క సంఘటన ఆధారంగా రౌడీషీట్లు తెరవడాన్ని నాయకులు ఆక్షేపిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పోలీసుల తీరు ఉందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బ్యాంకు ఖాతాలకే పింఛన్ సొమ్ము!

ఈనెలలో కూడా లబ్ధిదారులకు తప్పనిపాట్లు
గత నెల సొమ్మునే డ్రా చేసుకోలేకపోయిన వృద్ధులు
నడవలేని, వ్యాధులతో బాధపడుతున్న 70 వేల మందికే ఇంటింటికీ పంపిణీ



ఒంగోలు నగరం, మే 31 : పింఛన్‌దారులకు ఈనెలలోనూ పాట్లు తప్పని పరిస్థితి నెలకొంది. జూన్‌లో పింఛన్‌ను కూడా ప్రభుత్వం బ్యాంకు ఖాతాల్లోనే జమచేయనుంది. మంచంలో ఉన్న, వివిధ వ్యాధులతో బాధపడుతున్న 70వేల మందికి మాత్రమే ఇంటింటికీ పంపిణీ చేయనుంది. గతంలో వలంటీర్ల ద్వారా ఇంటింటికీ పింఛన్లను పంపిణీ చేసిన ప్రభుత్వం ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఆ విధానాన్ని నిలిపివేసింది. ఏప్రిల్ పింఛన్‌ను సచివాలయాల ద్వారా ఇచ్చింది. మేలో లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు జమ చేసింది. ఈ సొమ్మును తీసుకునేందుకు పింఛన్‌దారులు అనేక అగచాట్లు పడ్డారు. ఎండలో వృద్ధులు, వితంతువులు బ్యాంకుల వద్ద క్యూ కట్టారు. వడదెబ్బ తగిలి కొందరు సొమ్మసిల్లిపోయారు. చాలామంది పింఛన్ సొమ్మును బ్యాంకు నుంచి తీసుకోలేకపోయారు. కానీ వీటి గురించి పట్టించుకోని ప్రభుత్వం ఈనెల పింఛన్‌ను కూడా బ్యాంకు ఖాతాలకే జమచేయాలని నిర్ణయించింది. దీంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వచ్చి కానీ, తాము సచివాలయానికి వెళ్లి కానీ పింఛన్ తీసుకోవడం సులభంగా ఉంటుందని వారు అంటున్నారు. జిల్లాలో మొత్తం 2,92,522 పింఛన్‌దారులు ఉండగా వారిలో 70 వేల మందికి మాత్రమే ఇంటింటికీ సచివాలయ సిబ్బంది పింఛన్లను అందజేయనున్నారు. మిగిలిన 2,22,522 మందికి వారి బ్యాంకు ఖాతాలకు జమ చేయనున్నారు. నడవలేనిస్థితిలో ఉన్న వృద్ధులు, వ్యాధులతో మంచానికి పరిమితమైన వారు, దివ్యాంగులతోపాటు బ్యాంకు ఖాతాలకు ఆధార్ కార్డులు లింకు కాని వారి ఇళ్లకు మాత్రమే సచివాలయ సిబ్బంది వెళ్లి పింఛన్ సొమ్మును అందజేయనున్నారు.

త్రిసభ్య కమిటీ విచారణ

మార్కాపురం డీఎల్‌పీవో కార్యాలయంలో వేధింపుల వ్యవహారం
నాలుగు రోజుల్లో కలెక్టర్‌కు నివేదిక

మార్కాపురం, మే 31 : మార్కాపురం డివిజనల్ పంచాయతీ కార్యాలయంలో మహిళా ఉద్యోగినిని వేధించిన వ్యవహారంపై త్రిసభ్య కమిటీ శుక్రవారం విచారణ ప్రారంభించింది. కమిటీ సభ్యులైన ఎంపీడీవో తోట చందన, సీడీపీవో సుశీలాదేవి, ఏపీడీ నిర్మలాదేవిలు డీఎల్‌పీవో కార్యాలయానికి వచ్చి విచారించారు. డీఎల్‌పీవో నాగేశ్వరరావు, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు తనను లైంగికంగా వేధిస్తున్నట్లు కార్యాలయంలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ప్రాథమిక విచారణ అనంతరం సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులును కలెక్టర్ దినేష్‌కుమార్ సస్పెండ్ చేశారు. సమగ్ర విచారణ కోసం త్రిసభ్య కమిటీని నియమించారు. కమిటీ సభ్యులు శుక్రవారం బాధితురాలిని, ఆమెను వేధిస్తున్న సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులును విచారించారు. మరో రెండు, మూడు రోజులు డీఎల్‌పీవోతో సహా కార్యాలయంలో పనిచేసే ఇతర సిబ్బందిని విచారించనున్నారు. అనంతరం నివేదికను కలెక్టర్‌కు అందజేయనున్నారు.

ఎండప్రచండం

కొనసాగుతున్న సూర్యప్రతాపం
ఎర్రగొండపాలెం, పుల్లలచెరువుల్లో 45.4 డిగ్రీల ఉష్ణోగ్రత
ఒంగోలులో 45 డిగ్రీలు నమోదు
ఇతర ప్రాంతాల్లోనూ భగభగలు
వేడిగాలులు, ఉక్కపోతతో జనం విలవిల



ఒంగోలు (కలెక్టరేట్), మే 31 : నిప్పుల కుంపటి నెత్తిన పెట్టినట్టు.. మలమల మాడ్చేస్తున్న ఎండ! మాడు పగిలే వేడి! సెగలు కక్కుతున్న సూర్యుడి ప్రతాపానికి తోడు జోరుగా వీస్తున్న వడగాడ్పుల తాకిడికి జనం విలవిల్లాడుతున్నారు. ఉదయం 8 గంటలకే భగభగలు మొదలవుతున్నాయి. దీంతో ఇంటి నుంచి బయటకు వెళ్లేందుకు ప్రజలు భయపడిపోతున్నారు. రాత్రి ఆరు గంటలకు కూడా 'కాక' తగ్గడం లేదు. రోహిణి ఆరంభం నుంచి మొదలైన సూర్యప్రతాపం కొనసాగుతోంది. శుక్రవారం ఎర్రగొండపాలెం, పుల్లలచెరువు మండలాల్లో అత్యధికంగా 45.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. అది ఒంగోలులో 45 డిగ్రీలుగా ఉంది. సింగరాయకొండ మండలంలో 44.9, పామూరులో 44.9, పీసీపల్లిలో 44.9, తాళ్లూరులో 44.8, టంగుటూరులో 44.8, ముండ్లమూరులో 44.8, దర్శిలో 44.8, చీమకుర్తిలో 44.8, పొన్నలూరులో 44.5 డిగ్రీల ఎండ కాచింది. పొదిలి మండలంలో 44.3, సంతనూతలపాడులో 44.1, దోర్నాలలో 44.2, కొండపి 44.2, మద్దిపాడులో 43.5, దొనకొండలో 43.9, కొత్తపట్నంలో 43.5, నాగులుప్పలపాడులో 43.5, మర్రిపూడిలో 43.4డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మిగిలిన ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలపైనే ఉన్నాయి. దీంతో జనం ఉడికిపోయారు. నిరంతరం పనులు చేసుకొని జీవనం సాగించే వారు, తోపుడు బండ్లపై చిరువ్యాపారాలు చేసుకొనే వారు ఇబ్బంది పడ్డారు. వృద్ధులు, చిన్నారులు విలవిల్లాడారు.

ఒంగోలు వద్ద హైవేపై ఎండమావులు




నేటి నుంచి జూనియర్ కళాశాలలు పునఃప్రారంభం

ఒంగోలు (విద్య), మే 31 : జిల్లాలోని అన్ని యాజమాన్యాల ఆధ్వర్యంలో నడుస్తున్న జూనియర్ కళాశాలలు శనివారం నుంచి పునఃప్రారంభమవుతున్నట్లు బోర్డు ఆర్‌ఐవో సైమన్‌విక్టర్ తెలిపారు. ఇంటర్ రెండో సంవత్సరం విద్యార్థులకు శనివారం నుంచే తరగతులు జరుగుతాయన్నారు. మొదటి సంవత్సరం విద్యార్థుల అడ్మిషన్లు మొదలవుతాయని చెప్పారు.

పొగాకు కిలో రూ.338

ఒంగోలు-2 వేలం కేంద్రంలో లభించిన ధర
ఒక్కరోజులోనే రూ.12 పెరుగుదల



ఒంగోలు, మే 31 (ఆంధ్రజ్యోతి) : దక్షిణాది పొగాకు మార్కెట్లో శుక్రవారం మరింత జోరు కొనసాగింది. ఒక్క రోజులో ఏకంగా కిలోకు రూ.12 మేర ధర పెరిగింది. గురువారం మార్కెట్‌లో మేలు రకం గరిష్ఠ ధర కిలోకు రూ.326 లభించగా.. శుక్రవారం రూ.338 పలికింది. ఒంగోలు-2 వేలం కేంద్రంలో ఇది లభించింది. ఆ కేంద్ర పరిధిలోని మద్దిరాలపాడు, అగ్రహారం గ్రామాలకు చెందిన బేళ్లు శుక్రవారం అమ్మకాలకు వచ్చాయి. సాధారణంగా ఆ ప్రాంత పొగాకు నాణ్యత బాగానే ఉంటుంది. దీంతో ఆ బేళ్ల కోసం పలు కంపెనీల బయ్యర్లు పోటీపడ్డారు. ఇతర వేలం కేంద్రాల్లో కూడా గరిష్ఠ ధరలు కిలో రూ.330పైనే ఉన్నాయి.

పటిష్ట బందోబస్తు : ఎస్పీ



కౌంటింగ్ కోసం పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ గరుడ్ సుమిత్ తెలిపారు. రైజ్ ఇంజనీరింగ్ కళాశాల ఎదురు జాతీయ రహదారిలో ట్రాఫిక్‌ను ఒకవైపునకు మళ్లిస్తున్నట్లు చెప్పారు. ఆ ప్రాంతాన్ని నో ఆల్కహాల్ జోన్‌గా ప్రకటించామన్నారు. జిల్లావ్యాప్తంగా 156 సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. 18 మంది ముఖ్యనాయకుల ఇళ్ల, 16 పార్టీ కార్యాలయాల వద్ద కూడా భారీ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల సందర్భంగా జిల్లాలో ఘర్షణలకు పాల్పడిన 265 మందిపై రౌడీషీట్లు తెరిచామన్నారు. 185 సమస్యాత్మక ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బెట్టింగ్‌లపై కూడా నిరంతర పర్యవేక్షణ చేస్తున్నామని ఎస్పీ తెలిపారు.

నిఘా నీడలో ఓట్ల లెక్కింపు

కౌంటింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత
200 సీసీ కెమెరాలు ఏర్పాటు
పరిశీలనకు ప్రత్యేక బృందాలు
ఈనెల 3 నుంచి జిల్లావ్యాప్తంగా 144 సెక్షన్ అమలు
4వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు అన్ని నియోజకవర్గాల ఫలితాలు
జిల్లా ఎన్నికల అధికారి దినేష్‌కుమార్ వెల్లడి

ఒంగోలు (కలెక్టరేట్), మే 31 : సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారైన కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. ఒంగోలు సమీపంలోని రైజ్ ఇంజనీరింగ్ కళాశాలలో కట్టుదిట్టమైన భద్రత మధ్య, సీసీ కెమెరాల నిఘా నీడలో ఈనెల 4న కౌంటింగ్ జరుగుతుందని చెప్పారు. స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 14 టేబుళ్లు, ఒంగోలు పార్లమెంట్‌కు 40 టేబుళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈవీఎం కౌంటింగ్ కోసం ప్రతి టేబుల్ వద్ద ఒక సూపర్‌వైజర్, ఒక కౌంటింగ్ అసిస్టెంట్, ఒక మైక్రో అబ్జర్వర్ ఉంటారన్నారు. పోస్టల్ బ్యాలెట్ కోసం ప్రతి టేబుల్ వద్ద ఒక కౌంటింగ్ సూపర్ వైజర్, ఇద్దరు కౌంటింగ్ అధికారులు, ఒక మైక్రో అబ్జర్వర్, ఒక అసిస్టెంట్, ఒక ఏఆర్వోను నియమించినట్లు చెప్పారు. ఈవీఎంలు, పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు కేంద్రాలకు వెళ్లేందుకు సిబ్బందికి, ఏజెంట్లకు ప్రత్యేక మార్గాలను కూడా ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు సంబంధించి 2,400 మంది ఏజెంట్లు, 1,500 మంది సిబ్బంది, వెయ్యి మంది పోలీసులు ఉంటారని తెలిపారు. కౌంటింగ్ సిబ్బందిని ర్యాండమైజేషన్ పద్ధతిలో కేటాయించడం జరుగుతుందన్నారు. అభ్యర్థులకు సంబంధించిన ఏజెంట్లు తమ దరఖాస్తులను శనివారం లోపు అందించాలని కోరారు. కౌంటింగ్ సమయంలో అవాంతరాలు కల్పించాలని చూస్తే కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. అభ్యర్థులు కూడా కేవలం మూడుసార్లు మాత్రమే కౌంటింగ్ కేంద్రం నుంచి బయటకు వెళ్లి వచ్చేందుకు అవకాశం ఉందన్నారు. ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో 200 సీసీ కెమెరాలను వినియోగిస్తున్నట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా జూన్ 3 నుంచి 5వతేదీ వరకు 144 సెక్షన్ అమలు చేస్తూ కలెక్టర్ దినేష్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్, పక్కన ఎస్పీ సునీల్, ఓట్ల లెక్కింపు కోసం సిద్ధం చేసిన టేబుళ్లు

శీనారెడ్డిపై ఫిర్యాదును స్వీకరించిన సీవీసీ

నంబర్‌ను కేటాయించి ఫిర్యాదుదారునికి సమాచారం
కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని పురందేశ్వరిని కోరిన మోహన్

ఒంగోలు, మే 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్‌గా కె.శీనారెడ్డి పనిచేసిన కాలంలో భారీగా అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని డీసీసీబీ మాజీ ఛైర్మన్ ఈదర మోహన్ చేసిన ఫిర్యాదుపై కేంద్ర విజిలెన్స్ కమిషన్ స్పందించింది. ఈనెల 25న ఫిర్యాదును మోహన్ కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ, సీవీసీలకు పంపించారు. దాన్ని స్వీకరించి 59417/2024 నంబరును కూడా కేటాయించినట్లు ఫిర్యాదుదారు అయిన మోహన్‌కు శుక్రవారం సీవీసీ నుంచి సమాచారం వచ్చింది. త్వరలో విచారణ చేయనున్నట్లు పేర్కొంది. ఇదిలా ఉండగా శీనారెడ్డి అవినీతి, అక్రమాలను శుక్రవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, కేంద్ర మాజీ మంత్రి దగ్గుబాటి పురందేశ్వరి దృష్టికి మోహన్ తీసుకెళ్లారు. కేంద్రానికి లేఖ రాసి విచారణ చేయించాలని కోరారు. దీనిపై పురందేశ్వరి సానుకూలంగా స్పందించినట్లు సమాచారం.


పురందేశ్వరికి శీనారెడ్డి అవినీతిని వివరిస్తున్న ఈదర మోహన్

కౌంటింగ్ ఏర్పాట్ల పరిశీలన



కౌంటింగ్ ఏర్పాట్లపై సూచనలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు(కలెక్టరేట్), మే 31 : ఒంగోలు సమీపంలోని రైజ్ ఇంజనీరింగ్ కాలేజీలో శుక్రవారం సాయంత్రం జిల్లా ఎన్నికల అధికారైన కలెక్టర్ దినేష్‌కుమార్ కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. కౌంటింగ్ హాల్స్‌తో పాటు భద్రతపై సంబంధిత అధికారులకు పలుసూచనలు చేశారు. కౌంటింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేసే విధంగా చర్యలుతీసుకోవాలని ఆదేశించారు. అనంతరం పలు అంశాలపై సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేశారు. అదే విధంగా స్ట్రాంగ్ రూమును పరిశీలించారు.

రైతులకు సాగునీరు అందించాలి



ప్రాజెక్టు గేట్లను పరిశీలిస్తున్న నాయకులు

మద్దిపాడు, మే 31: గుండ్లకమ్మ ప్రాజెక్టులో గేట్లకు మరమ్మతులు పూర్తి చేసి రైతులకు సాగునీరు సత్వరం అందించాలని సీపీఐ జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి వడ్డే హనుమారెడ్డి కోరారు. శుక్రవారం గుండ్లకమ్మ ప్రాజెక్టును రైతు సంఘం నాయకులు సందర్శించి గేట్ల మరమ్మతు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుండ్లకమ్మ ప్రాజెక్టు కాలువల్లో జంగిల్ క్లియరెన్స్ చేయాలని, పెండింగ్ కాలువ పనులు సత్వరం పూర్తి చేయాలన్నారు. చివరి ఆయకట్టు రైతులకు సాగునీరు అందేవిధంగా చూడాలని డివిజనల్ ఇంజనీర్‌తో మాట్లాడగా ఆగస్టు నెల తర్వాత అన్ని గేట్ల మరమ్మతులు పూర్తి అవుతాయని తెలిపారని ఆయకట్టు రైతు సంఘం అధ్యక్షుడు నారిపెద్ది వరహాలచౌదరి తెలిపారు. గేట్లు పనులు పూర్తయితే 80వేల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యం నెరవేరుతుందన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షుడు తొట్టెంపూడి వెంకటశేషయ్య, చెరుకూరి వాసుబాబు, పి.కోటేశ్వరరావు, నాగండ్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



స్వామివారికి హారతి ఇస్తున్న అర్చకులు

మద్దిపాడు, మే 31: సీతారాంపురం కొష్టాల్‌లోని ఆంజనేయస్వామి దేవస్థానంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం స్వామివారికి ఆలయ అర్చకులు మద్దిపాటి వెంకటశేషాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వందలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయానికి చేసిన విద్యుద్దీపాలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

ఉష్ణతాపంతో జనం ఉక్కిరిబిక్కిరి

నాగులుప్పలపాడు, మే 31: వేసవికాలం ఎండల ప్రభావంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయం 8 గంటల నుంచే భానుడి ప్రతాపంతో జనం ఇల్లు విడిచి బయటకు వెళ్ళాలంటేనే భయపడుతున్నారు. రోహిణీ కార్తె రాకతో ఎండలకు తోడు వడగాలుల వీస్తుండడంతో జనం ఠారెత్తుతున్నారు. వృద్ధులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని గడుపుతున్నారు. చిన్నారులు ఎండ వేడిమి ధాటికి తట్టుకోలేకపోతున్నారు. రాత్రి వేళల్లో సైతం వేడి వాతావరణం ఉంటోంది. నాగులుప్పలపాడు మండలంలో శుక్రవారం 42-44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావడంతో రోడ్లపై జన సంచారం లేక నిర్మానుష్యయంగా మారాయి.

రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ దుర్గాప్రసాద్

చీమకుర్తి, మే31 : చీమకుర్తి మండలం రెడ్డినగర్ సమీపాన గల కర్నూల్‌రోడ్‌పై శుక్రవారం వేకువజామున వాహనం ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. సమాచారం అందుకున్న సీఐ దుర్గాప్రసాద్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

పనుల్లో అవకతవకలు లేకుండా చేయాలి

● పీడీ అర్జునరావు

కొండపి, మే 31 : ఉపాధి పనుల్లో అక్రమాలు జరగకుండా చూడాలని అధికారులను పీడీ బి.అర్జునరావు ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కొండపిలోని మండల పరిషత్ సమావేశం హాలులో కొండపి, టంగుటూరు, జరుగుమల్లి, సింగరాయకొండ మండలాలకు చెందిన ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవోలు, ఈసీలు, టీఏలు, క్షేత్ర సహాయకులతో ఆయన సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల్లో అక్రమాలకు పాల్పడితే సహించేది లేదన్నారు. సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. పని ప్రదేశంలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, తాగునీరు, మజ్జిగ, టెంటు సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో ఏపీడీ వెంకటస్వామి, ఎంపీడీవో నాగమణి పాల్గొన్నారు.

వేసవిలో మాంసాహారాన్ని తగ్గించాలి



ఓఆర్‌ఎస్ ప్యాకెట్స్‌ను అందజేస్తున్న వైద్య సిబ్బంది

సింగరాయకొండ, మే 31 : వేసవిలో మాంసాహారాన్ని తగ్గించాలని ఆరోగ్యపర్యవేక్షకుడు సయ్యద్‌వసూద్ అలి చెప్పారు. సింగరాయకొండ పంచాయతీ పరిధిలోని సుబ్బరామిరెడ్డినగర్, రైల్వేస్టేషన్‌రోడ్డులో శుక్రవారం స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఆరోగ్య, వైద్య సిబ్బంది వడదెబ్బపై ప్రజలకు ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వసూద్‌అలి మాట్లాడుతూ వేసవికాలంలో అధిక ఉష్ణోగ్రత, వేడిగాలుల కారణంగా వడదెబ్బ వలన వచ్చే వ్యాధులకు సరైన సమయంలో చికిత్స తీసుకోవాలని సూచించారు. అధికంగా నీరు, పళ్లరసాలు, కొబ్బరి నీళ్లు ఎక్కువగా తీసుకోవాలని చెప్పారు. వడదెబ్బ తగిలిన వారిని నీడ ప్రదేశానికి చేర్చాలని, చల్లని నీటిలో ముంచిన వస్త్రంతో శరీరాన్ని తుడవాలన్నారు. ఉప్పు కలిపిన మజ్జిగా లేదా గ్లూకోజ్, ఓఆర్‌ఆస్ తాగించాలని సూచించారు. అపస్మారక స్థితిలో ఉన్న రోగికి నీరును తాగించకూడదన్నారు. అనంతరం స్థానికులకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్స్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు నాగమణి, నసీమున్ పాల్గొన్నారు.

రూ.5లక్షల బీమా కల్పించాలి

మర్లపాడు(టంగుటూరు) మే 31 : ఉపాధి హామీ కూలీల రక్షణకు రూ.5లక్షల బీమా పరిహారం ప్రభుత్వం కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల అంజనేయులు డిమాండ్ చేశారు. మండలంలోని మర్లపాడు పరిసరాల్లో పని చేస్తున్న ఉపాధి కూలీలను వ్యవసాయ కార్మిక సంఘం ప్రతినిధులు శుక్రవారం కలిశారు. కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మోజెస్ మాట్లాడుతూ పని ప్రదేశంలో టెంట్లు, మంచినీళ్ల, మజ్జిగ, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు ఎక్కడా కనిపించడం లేదని, తక్షణమే పని ప్రదేశంలో వీటన్నిటినీ కల్పించాలని కోరారు. రోజు వేతనం రూ.300 వచ్చేలా ప్రయత్నించాలని కూలీలకు సూచించారు.



మాట్లాడుతున్న కంకణాల అంజనేయులు

స్వామిభక్తికి ప్రతీక ఆంజనేయుడు

నేడు హనుమాన్ జయంతి

శనివారం రావడం మరింత విశేషం..

వేడుకలకు పలు ఆలయాల్లో విస్తృత ఏర్పాట్లు

ఒంగోలు(కల్చరల్), మే 31: అపార స్వామి భక్తికి, అంతులేని వినయ విధేయతలకు ప్రతీక ఆంజనేయస్వామి. తాను ఎంతటి ధీశాలి అయినప్పటికీ ఎటువంటి గర్వం లేకుండా, తాను దైవంగా భావించే రాముని మాటే శిరోధార్యంగా, ఆయన ఆజ్ఞ తనకు వేదంగా భావిస్తూ అచంచలమైన స్వామిభక్తి పరాయణుడిగా ఆంజనేయుడు మనకు రామాయణంలో దర్శనమిస్తాడు. అంతేకాకుండా ఏ పనినైనా ఎంతో యుక్తిగా చేయటంలో హనుమంతుని మించిన వారు లేరు. అందుకే హనుమాన్ చాలీసాలో ఆయనను కీర్తిస్తూ బుద్ధిమతాం వరిష్టం అంటారు. ఇక హనుమంతుడు వేదవేదాంగాలను చదివిన గొప్ప పండితునిగా కూడా పురాణాలు చెబుతున్నాయి. ఆయనను భక్తితో కొలిచేవారిని సైతం ఎప్పుడూ వెన్నంటి ఉండి కాపాడతాడని ప్రతీతి. అందుకే దేశంలో ఊరూరా ఆంజనేయస్వామి దేవాలయాలు మనకు దర్శనమిస్తాయి. ఇక హనుమాన్ జయంతి వస్తుందంటే అనేక ప్రదేశాల్లో 41 రోజుల ముందు నుంచే ఉత్సవాలు ప్రారంభిస్తారు. దీనిని ఒక దీక్షగా భావించి భక్తులు నిత్యం హనుమంతుని సేవలో తరిస్తారు. ఈ సంవత్సరం ఏప్రిల్ 23న దేశవ్యాప్తంగా హనుమాన్ దీక్ష ప్రారంభమైంది. 41వ రోజు జూన్ 1వ తేదీన హనుమాన్ జయంతితో ఈ దీక్ష ముగుస్తుంది.

ఇక మన జిల్లాలోను ప్రతి సంవత్సరం హనుమాన్ జయంతి ఉత్సవాలను ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. గ్రామాల మొదలు నగరాల వరకు అనేక ఆంజనేయ స్వామి దేవస్థానాలలో ఈ ఉత్సవాలు జరుగుతాయి. ఈ సందర్భంగా స్వామివారికి ఎంతో ఇష్టమైన సిందూరం, తమలపాకులతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని సింగరకొండ ఆంజనేయస్వామి దేవస్థానం ఎంతో ప్రసిద్ధి పొందిన క్షేత్రం. ఇక్కడ హనుమాన్ జయంతి సందర్భంగా ఉత్సవాలు పెద్దఎత్తున ఘనంగా నిర్వహిస్తారు. ఇక జిల్లా కేంద్రమైన ఒంగోలు నగరంలో సైతం గత వారం రోజులుగా హనుమజ్జయంతి ఉత్సవాలు పలు దేవాలయాలలో వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, విశేష అలంకరణలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఈ ఏడాది హనుమజ్జయంతి ఆంజనేయస్వామి పూజకు ఎంతో విశేషమైన శనివారం రోజు రావటంతో మరింత ప్రాముఖ్యతను సంతరించుకుంది. హనుమజ్జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఆయా దేవాలయాల నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణ, సుందరకాండ పారాయణ, లక్ష తమలపాకులతో అర్చన, సిందూరాభిషేకం వంటి ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటయ్యాయి. నగరంలోని కేశవస్వామిపేట శ్రీవీరాంజనేయ స్వామి దేవస్థానం, రాజాపానగల్‌రోడ్డు శ్రీప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం, బృందావననగర్ శ్రీపంచముఖ నవావతార క్షేత్రం, సంతపేట శ్రీవీరాంజనేయ స్వామి దేవస్థానంలతో పాటు పలు రామాలయాల్లో సైతం హనుమజ్జయంతి వేడుకలు శనివారం ఘనంగా జరుగనున్నాయి. ఇక హనుమజ్జయంతి సందర్భంగా విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో ఆదివారం ఒంగోలు నగరంలో వేలాదిమందితో భారీ హనుమాన్ ర్యాలీని సైతం నిర్వహించనున్నారు.



ఒంగోలు నగరం లాయర్‌పేటలోని చిట్టి ఆంజనేయస్వామికి గారెలతో అలంకరణ

ఉన్నంవారికుంట వద్ద..

టంగుటూరు: టంగుటూరులోని గ్రామ చావడిలో ఉన్న శ్రీపంచముఖ ఆంజనేయస్వామి విగ్రహం వద్ద, టంగుటూరు-అనంతవరం మార్గంలోని ఉన్నంవారికుంట వద్దనున్న శ్రీఆంజనేయస్వామి గుడివద్ద శనివారం హనుమ జయంతి వేడుకను ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 7గంటల నుంచే పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయని, 11గంటల నుంచి అన్నదానం ప్రారంభమవుతుందని, రెండు చోట్ల ఇలాగే కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

విద్యుత్ పరికరాల నిల్వలపై దుష్ప్రచారం

రంగంలోకి దిగిన అధికారులు

కాంట్రాక్టరుకు అప్పగించామని ఏఈ వివరణ

కొండపి, మే 31 : వ్యవసాయ విద్యుత్ లైన్ల నిర్మాణ పనులకు అప్పగించిన పరికరాలు, సామగ్రి అక్రమంగా పెట్లూరులో నిల్వ ఉంచారన్న సమాచారం ఫిర్యాదుల మేరకు శుక్రవారం సాయంత్రం జిల్లా అధికారులు స్పందించారు. సామగ్రి దాచిన ఇంటి వద్దకు జిల్లా అధికారులు చేరుకుంటూనే కొండపి విద్యుత్ ఏఈ కుంచాల కోటయ్యకు సమాచారం ఇచ్చారు. దీంతో అధికారులు, మీడియా సామగ్రి దాచిన ఇంటి వద్దకు చేరుకుని పరిశీలించారు. ఈసందర్భంగా విద్యుత్ ఏఈ కోటయ్య ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ మండలంలో వ్యవసాయ విద్యుత్ లైన్ల పనులు నాలుగు నెలలుగా ముమ్మరంగా జరుగుతున్నాయని తెలిపారు. కాంట్రాక్టరు తనకు అనుమతి ఉన్న మేరకు సామగ్రిని పెట్లూరులోని కూలీలు నివాసం ఉండే చోటికి తరలించారని, పనులు కూడా ఆ గ్రామాల్లోనే జరుగుతున్నాయని, ఎన్నికల కారణంగా పను లు ఆపేశారని చెప్పారు. తాను ఇచ్చిన సామానుకు రిజిస్టరులో నమోదు చేసుకున్నానని, మిగిలిన సామాను కాంట్రాక్టరు అప్పగిస్తాడని ఆయన వివరించారు. ఇటీవల జాళ్లపాలెంలో అక్రమంగా విద్యుత్ వాడుకుంటున్న వ్యక్తి ఇంటిని విజిలెన్స్ అధికారులు గుర్తించి తొలగించారని, ఆ వ్యక్తి వారిని దూషించడంతో సిబ్బంది కేసు పెట్టారని, అతనే ఈ విధంగా విద్యుత్ సామగ్రి అక్రమంగా నిల్వ చేశారన్న దుష్ప్రచారం చేశాడని ఆయన తెలిపారు.

కొండపి వేలం కేంద్రంలో పొగాకు కేజీ రూ.336

కొండపి/టంగుటూరు, మే 31 : కొండపి పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం ఎఫ్-1 రకం కేజీ పొగాకు 336 రూపాయలు పలికింది. మండలంలోని వెన్నూరు, చినవెంకన్నపాలెం గ్రామాలకు చెందిన రైతులు 965బేళ్లు తీసుకురాగా, 900 బేళ్లు వ్యాపారులు కొనుగోలు చేశారని వేలం నిర్వహణాధికారి జి. సునీల్‌కుమార్ తెలిపారు.

టంగుటూరులో రూ.335

టంగుటూరు పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం జరిగిన కొనుగోళ్లలో గరిష్ఠ ధర రూ.335 పడింది. వేలం కేంద్రానికి కట్టుబడివారిపాలెం రైతులు 644 పొగాకు బేళ్లను తీసుకొచ్చారు. ఇందులో 566 కొనుగోలు కాగా మిగిలిన వాటిని వివిధ కారణాలతో వ్యాపారులు తిరస్కరించారు. కొనుగోళ్లలో మొత్తం 19 కంపెనీల బయ్యర్లు పాల్గొన్నారు. సరాసరి ధర రూ.278.82 పలికింది. కాగా టంగుటూరు పొగాకు వేలం కేంద్రాన్ని శుక్రవారం ఒంగోలు టుబాకో బోర్డు ప్రాంతీయ అధికారి ఎం లక్ష్మణరావు సందర్శించారు. ముందుగా ఆయన వేలం సరళిని, వివిధ పొగాకు గ్రేడ్లకు వ్యాపారులు చెల్లిస్తున్న ధరలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ వేలం కేంద్రానికి అన్ని రకాల పొగాకు గ్రేడ్లు తెచ్చుకోవాలని సూచించారు. అలాగే అన్యపదార్థాలు లేకుండా చూసుకోవాలన్నారు. శీతల గిడ్డంగుల్లో ఉన్న పొగాకు బేళ్ల వివరాలు, అక్కడ నుంచి బయటకు తీసి అమ్మకానికి వేలం కేంద్రంలో ఉంచిన బేళ్ల వివరాలను వేలం కేంద్రం అధికారికి తెలియజేయాలన్నారు.



టంగుటూరులో కొనసాగుతున్న పొగాకు వేలం

ముగిసిన కొప్పోలు కళాపరిషత్ నాటిక పోటీలు



హెచ్చరిక నాటికలోని ఓ సన్నివేశం



ఆకట్టుకున్న నాన్న నేనొచ్చేస్తా నాటిక

● విజేతలకు బహుమతుల ప్రదానం

ఒంగోలు(కల్చరల్), మే 31: కొప్పోలు కళాపరిషత్ ఆధ్వర్యంలో గత నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి నాటిక పోటీలు శుక్రవారం రాత్రి ముగిశాయి. ఈ సందర్భంగా కొప్పోలులో ఏర్పాటు చేసిన ముగింపు సభ ఘనంగా జరిగింది. కళాపరిషత్ అధ్యక్షుడు కాట్రగడ్డ రఘుపతి అధ్యక్షతన జరిగిన సభలో ప్రజానాట్య మండలి రాష్ట్ర గౌరవాధ్యక్షులు నల్లూరి వెంకటేశ్వర్లు(అన్న), ఎన్టీఆర్ కళాపరిషత్ అధ్యక్షుడు ఈదర హరిబాబు, ప్రతిభ కళాశాలల అధినేత నల్లూరి వెంకటేశ్వర్లు తదితరులు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. తెలుగువారి నటనాచాతుర్యాన్ని, పౌరుషాన్ని జాతీయస్థాయిలో చాటిచెప్పిన మహనీయుడు డాక్టర్ నందమూరి తారక రామారావు అని, ఆయన జయంతి సందర్భంగా ప్రతి సంవత్సరం కొప్పోలు కళాపరిషత్ ఆధ్వర్యంలో నాటిక పోటీలు నిర్వహించటం అభినందనీయమని చెప్పారు. ప్రస్తుతం నాటకాలకు ఆదరణ తగ్గిపోతున్నదని ప్రభుత్వాలు నాటకాలను, నటీనటులను పోషించటానికి నిర్దిష్ట విధానాన్ని తీసుకురావాలని కోరారు. ఆదేవిధంగా ఎంతోమంది రంగస్థల నటీనటులు ప్రస్తుతం కడు పేదరికంతో బాధపడుతున్నారని, అటువంటివారికి ప్రభుత్వం ఆర్థిక సహాయాన్ని అందజేసి ఆదుకోవాలని కోరారు. అదేవిధంగా దాతలు, ప్రజలు నాటకాలను పోషించి నాటక సమాజాలకు సహకారాన్ని అందజేయాలన్నారు. కాట్రగడ్డ రఘుపతి మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల నుంచి మొత్తం ఆరు నాటికలు పోటీలలో పాల్గొన్నాయని తెలిపారు. నాటక పోటీలను, కళాపరిషత్ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించటానికి సహకరించిన దాతలు, ప్రేక్షకులు అదేవిధంగా పరిషత్ కార్యవర్గం, నటీనటులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతుల ప్రదానం జరిగింది.



కళాపరిషత్ నిర్వాహకులను సత్కరిస్తున్న అతిథులు

అలరించిన నాటికలు

ఇక శుక్రవారం రాత్రి గుంటూరు అమృత లహరి ఆర్ట్స్ థియేటర్ కళాకారులు ప్రదర్శించిన నాన్న నేనొచ్చేస్తా నాటిక ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. తాళాబత్తుల వెంకటేశ్వర్లు రచించిన ఈ నాటికకు అమృత, లహరిలు దర్శకత్వం వహించారు. ఆదేవిధంగా ప్రత్యేక ప్రదర్శనగా ఒంగోలు ఎన్టీఆర్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రదర్శించిన హెచ్చరిక నాటిక సైతం ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. సూదనగుంట వెంకటేశ్వర్లు రచించి దర్శకత్వం వహించిన నాటికలో నటులు చక్కటి హావభావాలను ప్రదర్శించారు.

విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించాలి

టంగుటూరు, మే 31 : విద్యార్థులకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని రుచిగా, శుచిగా అందించాలని ఎంఈవో-2 తన్నీరు బాలాజీ కోరారు. ప్రభుత్వ పాఠశాలల మధ్యాహ్న భోజన నిర్వాహకులకు మండల విద్యాశాఖ కార్యాలయంలో శుక్రవారం ఒక్కరోజు శిక్షణాకార్యక్రమం జరిగింది. సమతుల్య ఆహారం ఎలా తయారు చేయాలి అనే సాంకేతిక అంశాలపై మాస్టర్ ట్రైనర్లు సంతనూతలపాడు ఎంఈవో వెంకారెడ్డి, జిల్లా ఎండీఎం కోఆర్డినేటర్ శ్రీవిశ్వేశ్వరశర్మ వంట ఏజెన్సీల వారికి వివరించారు. ఈసందర్భంగా కుక్ కం హెల్పర్ తయారు చేసిన పలు రకాల వంటకాలను ప్రదర్శించారు. అందులో రుచి, శుచి, పరిశుభ్రత పాటించిన వంటకాలను ఎంపికచేసి బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంఈవో చెంచుపున్నయ్య, వంట రీసోర్స్ పర్సన్స్ రేవతి, సుమతి, సీఆర్‌పీలు దేవరపల్లి జోషి, సుబ్బులు, శ్రీహరి టెక్నికల్ సిబ్బంది వేణు, బాలక్రిష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈవో-2 బాలాజీ

అవీ..ఇవీ..

డీఎస్సీ-1998, 2008 టీచర్ల రెన్యువల్ ఉత్తర్వులు జారీ

ఒంగోలు(విద్య), మే 31 : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో మినిమం టైమ్ స్కేలుతో కాంట్రాక్టు టీచర్లుగా పనిచేస్తున్న డీఎస్సీ-1998, 2008 టీచర్ల సర్వీసులు కొనసాగించేందుకు వీలు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. జూన్ 1నుంచి వీరి సర్వీసులు కొనసాగిస్తారు. 2025 ఏప్రిల్ 30 వరకు వీరు ఉద్యోగంలో కొనసాగుతారు. కాంట్రాక్టు టీచర్లుగా మినిమం టైం స్కేలుతో వీరు పనిచేస్తున్నందున ఏడాదిలో ఒక నెల సర్వీసుకు బ్రేకు ఇస్తారు. ఈ మేరకు విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్‌ప్రకాష్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో క్లాస్ వర్క్, అడ్మినిస్ట్రేషన్ వర్క్ సజావుగా నడిపించేందుకు వీరి సేవలను వినియోగించుకోవాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

జిల్లాకు చేరిన 1,871 సర్వీసు ఓట్లు

ఒంగోలు(కలెక్టరేట్), మే 31: సాయుధ దళాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల నుంచి జిల్లాకు 1,871 సర్వీసు ఓట్లు వచ్చాయని జిల్లా పోస్టల్ ఓటింగ్ పార్లమెంట్ స్పెషల్ ఆఫీసర్ కె.ఝాన్సీలక్ష్మి తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని ఆమె చాంబర్‌లో రాజకీయ పార్టీలతో కలిసి శుక్రవారం జిల్లాకు వచ్చిన సర్వీసు ఓట్లను బ్యాలెట్ బాక్సులో వేసి సీల్ వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. జిల్లాలో 6,693 సర్వీసు ఓట్లు ఉండగా శుక్రవారం వరకు 1,871 ఓట్లు వచ్చాయని తెలిపారు. సర్వీసు ఓట్లు జూన్ 4వతేదీ ఉదయం 8గంటల లోపు వచ్చే ఓటలన్నింటినీ లెక్కింపు చేస్తామని, ఆ తర్వాత వచ్చే ఓట్లను పరిగణలోకి తీసుకోవడం జరగదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు క్రాంతికుమార్, రసూల్, స్వరూప్, గుర్రం సత్యనారాయణ, కొండారెడ్డి, సూర్య, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు

ఒంగోలు(విద్య),మే 31 : జిల్లాలో ఏపీ ఓపెన్ స్కూలు సొసైటీ పదో తరగతి, ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. పరీక్షలు మధ్యాహ్నం 2.30నుంచి 5.30 గంటల వరకు జరుగుతాయి. పదో తరగతి పరీక్షలకు 898 మంది, ఇంటర్మీడియట్ పరీక్షలకు 2,612 మంది హాజరవుతున్నారు. విద్యార్థులకు అందుబాటులో ఉండేలా ఇంటర్ విద్యార్థులకు పది కేంద్రాలు, టెన్త్ విద్యార్థులకు ఆరు కేంద్రాలను ఏర్పాటు చేశారు. టెన్త్ విద్యార్థులకు ఒంగోలులో రెండు, దర్శి, పొదిలి, రాయవరం, మార్కాపురంలలో ఒక్కొక్క సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఇంటర్ విద్యార్థులకు ఒంగోలులో రెండు, దర్శి, తూర్పు వెంకటాపురం, తూర్పుచౌటపాలెం, పొదిలి, కనిగిరిలో ఒక్కొక్కటి, మార్కాపురంలో మూడుపరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షల్లో కాపీయింగ్‌ను నిరోధించేందుకు నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేశారు. ప్రతి పరీక్షా కేంద్రానికి సిట్టింగ్ స్క్వాడ్‌ను నియమించారు. ఒంగోలులోని జిల్లా జైలులో రిమాండ్ ఖైదీల కోసం ప్రత్యేకంగా టెన్త్ పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పరీక్షలు జూన్ 1 నుంచి 8వతేదీ వరకు జరుగుతాయి. ఈ పరీక్షల పరిశీలన కోసం విద్యాశాఖలో డైరెక్టర్ హోదాలో పనిచేస్తున్న ఎ.సుబ్బారెడ్డిని నియమించారు.

బాలకార్మికుల కోసం నేటి నుంచి ప్రత్యేక తనిఖీలు

ఒంగోలు(కలెక్టరేట్), మే 31 : బాల కార్మికులను గుర్తించేందుకు ఈనెల 1 నుంచి 30వతేదీ వరకు జిల్లాలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించనున్నట్లు కార్మికశాఖ ఉప కార్మిక కమిషనర్ ఎస్.శ్రీనివాసకుమార్ తెలిపారు. ఒంగోలులోని కార్మిక శాఖ కార్యాలయంలో గురువారం జరిగిన జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అలాగే కార్మిక కమిషనర్ ఎం.కోటేశ్వరరావు మాట్లాడుతూ దుకాణాలు, వాణిజ్య సంస్థలు, హోటల్స్, సినిమా థియేటర్స్ మోకానిక్ షాప్స్, వెల్డింగ్ షాప్స్, ఇటుక బట్టీలు, పరిశ్రమలు, భవన నిర్మాణ పనులలో బాలలను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమన్నారు. తనిఖీ అధికారులు గుర్తిస్తే ఆయా యాజమాన్యాలపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. బాల కార్మికరహిత జిల్లాగా ఉంచేందుకు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

ఒంగోలు(విద్య), మే 31: జిల్లాలో జరుగుతున్న పదో తరగతి అడ్వాన్సుడ్ సప్లిమెంటరీ పరీక్షల కోసం సంబంధించి ప్రధాన సబ్జెక్టుల పరీక్షలు ముగిశాయి. శుక్రవారం జరిగిన సోషల్ స్టడీస్ పరీక్షకు 777 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష జరిగిన 22 కేంద్రాల్లో పరీక్షకు 1,553 మంది హాజరు కావాల్సి ఉండగా 776 మంది హాజరయ్యారు. 50శాతం మంది పరీక్ష రాశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ కె.శివకుమార్ తెలిపారు.

హెల్త్ కార్డుల పంపిణీ



హెల్త్‌కార్డులను అందజేసిన నిర్వాహకులు

ఒంగోలు(కార్పొరేషన్), మే 31: డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రైవేటు హాస్పిటల్స్‌లో పేదలకు ఉచిత వైద్యం కోసం హెల్త్ కార్డులను ఉచితంగా పంపిణీ చేశారు. శుక్రవారం నగరంలోని గోపాలనగరం లో గల సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు ఎస్ఎం.సుభానీ వీటిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని పలు ప్రైవేటు హాస్పిటల్స్‌లో తమ సంస్థ తరుపున అందించే హెల్త్ కార్డుల ద్వారా ఉచిత ఓపీ, వైద్య సేవల్లో రాయితీ ఇవ్వనున్నారని తెలిపారు. కార్డు కలిగిన వారికి ఏడాది పాటు ఈ సేవలు లభిస్తాయని వెల్లడించారు. పేదలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, బలగాని ఆంజనేయులు, మోతె భాస్కర్, పాస్టర్ డేవిడ్, నజిరుద్దీన్, సంధాని, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన చిత్ర కళాశిబిరం

ఒంగోలు (కల్చరల్), మే 31 : ఒంగోలులోని సృష్టి ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో గత 35రోజులుగా నిర్వహిస్తున్న డ్రాయింగ్, పెయింటింగ్ శిక్షణా శిబిరం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా సంస్థ కార్యదర్శి డాక్టర్ తిమ్మిరి రవీంద్ర మాట్లాడుతూ విద్యార్థులలో సృజనాత్మకత పెంపొందటానికి చిత్రలేఖనం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. పెన్సిల్ డ్రాయింగ్, పెయింటింగ్, వాటర్ కలర్స్, ఆక్రిలిక్ కలర్స్, ఆయిల్ కలర్స్ పెన్సిల్ షేడింగ్, తంబ్ పెయింటింగ్, కోలాజ్, విజిటబుల్ గ్రాఫిక్స్ మొదలైన విభాగాలలో శిక్షణనిచ్చినట్లు ఆయన తెలిపారు. మొత్తం నాలుగు గ్రూపులలో పాల్గొన్న 80మంది విద్యార్థులకు ప్రశంసా పత్రాలను తూనుగుంట నాగమణి, శిరీష అందజేశారు. చిత్రలేఖన శిబిరంలో పాల్గొనే విధంగా పిల్లలను ప్రోత్సహించిన తల్లిదండ్రులకు వారు అభినందనలు తెలిపారు.

నిస్సహాయులకు ఆర్థిక సహాయం



నగదును అందజేస్తున్న దాతలు

ఒంగోలు(కల్చరల్), మే 31 : మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, లక్ష్మీపద్మావతి దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక సంతపేట శివం శరణాలయంలో నిస్సహాయులకు రూ.30వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గొల్లపూడి శ్రీహరి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గోల్డెన్ గ్రానైట్ మేనేజర్ ఎ.గిరిబాబు, కాంట్రాక్టర్ కాట్రగడ్డ రమణయ్య ఆధ్వర్యంలో ఐదుగురికి ఒక్కొక్కరికి రూ.6వేల చొప్పున వైద్యఖర్చులు, జీవ నోపాధికి నగదును అందజేశారు. ముందుగా వారు కేక్ కట్ చేసి రాఘవరావు దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వృద్ధులకు పండ్లు పంపిణీ చేసి అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు, బొమ్మిశెట్టి కిరణ్‌కుమార్, మండవ గోపి, చల్లగండ్ల హనుమంతరావు, బీపీఎల్.వెంకట్రావు, నల్లూరి సత్యనారాయణ, శ్రీనివాసరెడ్డి, వెలుగు సుబ్బారావు, మండవ శ్రీనివాసరావు, సురేంద్ర, గ్రంధి శ్రీహరి పాల్గొన్నారు.

కోడ్ నిబంధనలు పాటించాలి

మద్దిపాడు, మే 31: ఎన్నికల కౌంటింగ్ సమయంలో కోడ్ నిబంధనలు పాటించాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ వెలగా మహేష్ హెచ్చరించారు. శుక్రవారం మద్దిపాడు పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కౌంటింగ్ సందర్భంగా ఎన్నికల నియమాల్ని అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. విజయోత్సవ ర్యాలీలు పేరుతో రోడ్లపైకి వచ్చినవారు రెచ్చగొడితే పోలీస్ యాక్ట్ ప్రకారం శిక్షలు కఠినంగా ఉంటాయన్నారు. మండలంలో 144 సెక్షన్ అమల్లో ఉందని ఆయన తెలిపారు.

భర్తపై వేధింపుల కేసు

నాగులుప్పలపాడు, మే 31 : భార్యను వేధిస్తున్న భర్తపై పోలీసులు కేసు నమోదు చేశారు. హెడ్‌కానిస్టేబుల్ పరమేశ్వరి తెలిపిన వివరాల మేరకు.. ఒమ్మెవరం గ్రామానికి చెందిన అత్తంటి హెప్సి భవాని, బాపట్ల జిల్లా పంగులూరు మండలం చందలూరుకు చెందిన నాయిపాముల సతీష్‌కు రెండేళ్ళ క్రితం వివాహం జరిగింది. కాగా సతీష్ తనను వేధిస్తున్నట్లు హెప్సి భవాని నాగులుప్పలపాడు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సతీష్‌పై గృహహింస చట్టం మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

పలకల పరిశ్రమ కుదేలు!

పెరిగిన డెడ్ రెంట్ • నిలిచిన ముడిరాయి వెలికితీత • ఫ్యాక్టరీల మూసివేత • వలసపోతున్న కూలీలు



ఎగుమతి చేసేందుకు సిద్ధం చేసిన డిజైన్ స్లేట్స్

మార్కాపురం, మే 31: పిల్లలకు ఓనమాలు నేర్పాలంటే ఇదివరకు గుర్తొచ్చేది రాతి పలకే. రాతి పలకల తయారీకి, దేశవిదేశాల్లో పంపిణీకి కేంద్రబిందువు జిల్లాలోని మార్కాపురం. శతాబ్దకాలం నుంచి పలకల తయారీకి దేశవ్యాప్తంగా మార్కాపురం ప్రసిద్ధిగాంచింది. అందుకే మార్కాపురం మట్టిపలకకి మారు పేరయ్యింది. కానీ మట్టి పలక ఇప్పుడు తన ప్రాభవాన్ని కోల్పోతోంది. పలకల తయారీ మొదట కుటీర పరిశ్రమగా ప్రారంభమైంది. రాసే పలకలకి గిరాకీ పెరగడంతో బడా వ్యాపారవేత్తలు కూడా రంగప్రవేశం చేశారు. తదనంతర అతిపెద్ద పరిశ్రమలు వెలశాయి. ఈ పలకల్ని విదేశాలకు కూడా ఎగుమతి చేసేవారు. సుమారు 200ల ఫ్యాక్టరీలు నెలకొల్పారు. ఈ పరిశ్రమపై ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 20 వేల మంది కూలీలు ఆధారపడి జీవించే వారు.

ఎనామిల్ పలకల తయారీ...

పలకల పరిశ్రమ దినదినాభివృద్ధి చెందుతున్న కాలంలో ఎనామిల్, హార్డ్‌బోర్డు పలకలు మార్కెట్‌లో రంగప్రవేశం చేశాయి. ఇక్కడ కూడా కొందరు ఎనామెల్ పలకల తయారీ మొదలుపెట్టారు. కాని వాటి తయారీకి అవసరమైన ముడిసరుకును దిగుమతి చేసుకోవాల్సి వచ్చేది. దానివల్ల ఆ వ్యాపారం లాభసాటిగా లేకపోవటంతో తయారీ ఆగిపోయింది.

కుటీర పరిశ్రమ నుంచి పారిశ్రామికవాడ వరకు..

మార్కాపురంలో వ్యాపారం ఊపందుకోవడంతో పరిసర ప్రాంతాలలో కూడా రాతిగనుల కోసం అన్వేషణ మొదలైంది. ఆ పట్టణ పరిసరప్రాంతాల్లోని మండలాల్లోనే కాకుండా గుంటూరు, నల్గొండ జి ల్లాలలో కూడా ఈ రాతి నిక్షేపాలను గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో కూడా డిజైన్ స్లేట్ పరిశ్రమల్ని నెలకొల్పారు. ప్రస్తుతం ప్రకాశం జిల్లాలో బేస్తవారపేట, తర్లుపాడు, త్రిపురాంతకం, దొనకొండ, దర్శి, గుంటూరు జిల్లాలో రేమిడిచర్ల, మాచర్ల, నల్గొండ జిల్లాలో మిర్యాలగూడలో ఈ పరిశ్రమలున్నాయి. 3 జిల్లాల్లో కలిపి 3వేల ఎకరాల్లో పలకల గనులు విస్తరించి ఉన్నాయి.

ఆర్థిక మాద్యంతో కుదేలైన పరిశ్రమ

2010లో అమెరికాలో ఏర్పడ్డ ఆర్థికమాద్యంతో పలకల పరిశ్రమ మొట్టమొదటిసారిగా కుదేలైంది. అప్పటి వరకు రోజుకు సుమారు 50 లారీల పలకలను ఎగుమతి చేస్తున్న వ్యాపారవేత్తలు నెలకు 50 లారీలు కూడా ఎగుమతి చేయలేని పరిస్థితికి పడిపోయారు. దీంతో గనుల నుంచి ముడిరాయిని వెలికి తీసేందుకు వ్యాపారవేత్తలు ఆసక్తి చూపలేదు. దీంతో గనులలో పనిచేసే కూలీలు ఉపాధి కోల్పోయారు. పనుల కోసం వలసలు వెళ్లారు. ముడిసరుకు లేని కారణంగా చాలా ఫ్యాక్టరీలు మూతపడ్డాయి. దీంతో పలక ఫ్యాక్టరీలలో పని చేసే వారి పరిస్థితి కూడా అదేవిధంగా తయారైంది. దీనికి తోడు అనుబంధ పారిశ్రామికవేత్తలైన చెక్కపెట్టెల తయారీదారులు కూడా తమ ఫ్యాక్టరీలను మూసివేశారు.

పడి లేచిన తీరు...

కనుమరుగవుతున్న మార్కాపురం పలకల పరిశ్రమ లోకి ప్రవేశించి ఈ పలకలను రాసే పలకల్నించి రంగు రంగుల హరివిల్లులు తయారు చేయవచ్చని గుర్తించిన మొట్టమొదటి వ్యక్తి రాష్ట్ర మాజీ మంత్రి ఎం.మాణిక్యరావు. డిజైన్ స్లేట్ వ్యాపారం లాభాలను గడిస్తుండడంతో అప్పటి వరకూ రాసే పలకల వ్యాపారంలో ఆరితేరిన నలుగురు పారిశ్రామికవేత్తలు కూడా డిజైన్‌స్లేట్ రంగంలోకి మారారు. పలువురు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు కూడా డిజైన్ స్లేట్ వ్యాపారంలోకి ప్రవేశించారు. ఫ్యాక్టరీలు మూతపడటం వల్ల ఉపాధి కోల్పోయిన వారంతా తిరిగి డిజైన్ స్లేట్ పరిశ్రమలోకి ప్రవేశించారు.



కట్ చేసేందుకు సిద్ధంగా ఉన్న ముడిరాయి

నాలుగు రెట్లు పెరిగిన డెడ్ రెంట్

మార్కాపురం పారిశ్రామిక వాడలో ప్రస్తుతం సుమారు 60 ఫ్యాక్టరీలలో డిజైన్ పలకల ఉత్పత్తి జరుగుతోంది. పలకల గనులలో వచ్చే ముడి సరుకుపై వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డెడ్‌రెంట్ విపరీతంగా పెంచింది. టీడీపీ ప్రభుత్వ హయాంలో హెక్టారుకు ఏడాదికి రూ.15 వేలుగా ఉన్న డెడ్‌రెంట్ ప్రస్తుతం రూ.65 వేలకు పెంచింది. క్వారీల యజమానులకు టీడీపీ హయాంలో టన్నుకు చెల్లిస్తున్న రాయల్టీ రూ.6500 నుంచి రూ.13000లకు చేరింది.



రాయిని కటింగ్ చేస్తున్న కార్మికులు

పెరిగిన రవాణా చార్జీలు

డీజిల్ రేటు రోజురోజుకూ మారుతుండటంతో రవాణా చార్జీలు సైతం పెరిగిపోయాయి. మార్కాపురం నుంచి చెన్నై ఎయిర్ పోర్టుకు చేరేందుకు ఒక టన్నుకు రూ.1450లు వసూలు చేస్తున్నారు. ఒక కంటైనర్‌ను నింపాలంటే 24 టన్నులు ఉత్పత్తి చేయాల్సి ఉంది. విదేశాలకు రవాణా చార్జీలు సైతం ఆకాశాన్ని అంటాయి. ఒక కంటైనర్ అమెరికాకు పంపించడానికి గతంలో 1200 డాలర్లు చెల్లించాల్సి ఉండగా ప్రస్తుతం 7500 డాలర్లు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. అదే బ్రిటన్‌కు గతంలో 800 డాలర్లు చెల్లిస్తుండగా ప్రస్తుతం 6000 డాలర్లు చెల్లించాల్సి వస్తుంది.

ముందుకు రాని బయ్యర్లు

పలకల ఉత్పత్తి వ్యయాలు, రవాణా చార్జీలు, కూలీ చార్జీలు పెరిగిన నేపథ్యంలో ఉత్పత్తిదారులు ఒక చదరపు అడుగుకు రూ.150లు పెంచాల్సిన పరిస్థితి నెలకొంది. కేవలం రూ.10లు పెంచితేనే పలకల కొనుగోలుకు విముఖత చూపే బయ్యర్లు ప్రస్తుతం పలకలకు యజమానులు సూచించే ధరలకు కొనగోలు చేసేందుకు ముందుకు రాని పరిస్థితి నెలకొంది.

ఉద్యోగ విరమణ చేసిన వారికి ఆత్మీయ వీడ్కోలు

ఒంగోలు(క్రైం), మే31: పోలీసుశాఖలో సుదీర్ఘ కాలం విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన వారిని ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ ఘనంగా సత్కరించారు. శుక్రవారం ఒంగోలులోని పోలీసు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఉద్యోగ విరమణ చేస్తున్న ఎస్‌ఐ టీసీ.కృష్ణయ్య, ఏఎస్‌ఐ ఎస్‌కే.చాంద్‌బాషా, ఏఆర్ ఎస్‌ఐ యస్.రాఘవరావు, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ గంగాధర్‌రావులకు ఎస్పీ శాలువాలు కప్పి బొకేలు అందజేశారు. కార్యక్రమంలో ఏవో సులోచన, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్రరావు, ఎలక్షన్ సెల్ సీఐ సూర్యనారాయణ, పీసీఆర్ సీఐ వెంకటేశ్వరావు, ఆర్‌ఐ రమేష్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బకు వృద్ధుడు మృతి

దొనకొండ, మే 31: వడదెబ్బకు వృద్ధుడు మృతిచెందిన సంఘటన మండలంలోని తెల్లబాడులో శుక్రవారం చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన అంకాల సిద్ధయ్య(62) గొర్రెలను పొలాల్లో మేపుకునేందుకు తోలుకెళ్లాడు. వేడిగాలులతో ఎండ తీవ్రత విపరీతంగా ఉండటంతో వడదెబ్బకు గురై పొలంలోనే సొమ్మసిల్లి పడిపోయాడు. సమీప పొలంలో ఉన్న కొందరు గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. వారు హుటాహుటీన వెళ్లి పొలంలో పడిపోయిన సిద్ధయ్యను ఆటోలో ఆస్పత్రికి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తుండగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడి భార్య కొన్ని సంవత్సరాల క్రితం మృతి చెందారు. ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుటుంబం పెద్దదిక్కు మృతి చెందటంతో కుటుంబసభ్యులు, బంధువులు కన్నీటిపర్యంతమయ్యారు.

108 మద్యం బాటిళ్లు స్వాధీనం

దొనకొండ, మే 31: మండలంలోని రెండు ప్రాంతాల్లో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా నిల్వ ఉంచిన 108 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సంపత్‌కుమార్ తెలిపారు. దొనకొండలో మల్లంపేట గ్రామానికి చెందిన వడ్లమూడి రమణయ్య వద్ద ఉన్న 43 మద్యం బాటిళ్లు, చందవరం గ్రామంలో శెట్టిబత్తిన కాశయ్య వద్ద ఉన్న 65 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఇరువురిపై కేసులు నమోదు చేసి పూర్తిస్థాయిలో దర్యాప్తు చేప డుతున్నట్లు ఎస్సై తెలిపారు. ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా అన్నీ గ్రామాల్లో విస్తృతంగా తనిఖీలు చేస్తున్నట్లు చెప్పారు.

ట్రాన్స్‌ఫార్మర్లలోని రాగి తీగ చోరీ

ముండ్లమూరు, మే 31: మండలంలోని మారెళ్ల సమీపంలోని గుండ్లకమ్మ నదిపై నిర్మించిన మారెళ్ల - 4 ఎత్తి పోతల పథకానికి సంబంధించి నాలుగు ట్రాన్స్‌ఫార్మర్ల రాగి తీగను అపహరించుకు పోయిన సంఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. కొంత మంది రైతులు ఎత్తిపోతల పథకం వద్దకు వెళ్ళి చూడగా తాళాలు పగులగొట్టి ఉండటంతో అనుమానం వచ్చి లోపలకి వెళ్లిచూడగా, ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసంచేసి అందులోని రాగి తీగను అపహరించుకు పోయారు. రూ.20 లక్షల మేర నష్టం జరిగి ఉంటుందని రైతులు తెలిపారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి

దర్శి, మే 31: శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని ఎస్సై సుమన్ కోరారు.ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా జూన్ 4న దర్శి పట్టణంతో పాటు అన్నీ గ్రామాల్లో 144 సెక్షన్ విధిస్తున్నట్లు తెలిపారు. ఫలితాల అనంతరం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకు న్నట్లు తెలిపారు. గెలుపొందిన అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ఊరేగింపులు, బాణసంచా కాల్చటం వంటి కార్యక్రమాలు నిర్వహించ రాదని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టింగ్‌లు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గ్రంథాలయాలకు పూర్వవైభవం తీసుకువస్తాం

• జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆదిలక్ష్మి



రికార్డులను తనిఖీ చేస్తున్న ఆదిలక్ష్మి

బల్లికురవ. మే 31 : గ్రంథాలయాలకు పూర్వ వైభవం తీసుకు వచ్చేలా కృషి చేస్తున్నామని ఉమ్మడి ప్రకాశం జిల్లా గ్రంథాలయ సంస్థ సెక్రటరీ కాసు ఆదిలక్ష్మి తెలిపారు. బల్లికురవ వచ్చిన ఆమె గ్రంథాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో 70 గ్రంథాలయాలు ప్రభుత్వం ద్వారా పనిచేస్తున్నాయని, వాటిల్లో 37 మంది రెగ్యులర్ ఉద్యోగులు, 11 మంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారన్నారు. త్వరలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేందుకు కలెక్టర్‌కు నివేదిక అందిస్తామున్నారు. ఈ తనిఖీలో రమేష్, సుగుణరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

బోడవాడ(పర్చూరు), మే31: ద్విచక్రవాహనానికి గేదె అడ్డురావటంతో జరిగిన ప్రమాదంలో ఓ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన పర్చూరు మండలం బోడవాడ సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. బోడవాడ గ్రామానికి చెందిన ఇరువురు ద్విచక్ర వాహనంపై పర్చూరు వస్తుండగా ఎదురుగా గేదె రావటంతో వాహనం అదుపు తప్పి ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో జి.దుర్గాదేవి తలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను పర్చూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

చికిత్స పొందుతూ తహసీల్దార్ మృతి

యర్రంవారిపాలెం(పర్చూరు), మే 31: బ్రెయిన్ స్ట్రోక్‌తో చికిత్స పొందుతూ బాపట్ల జిల్లా యద్దనపూడి మండల తహసీల్దార్ బత్తుల వెంకటరెడ్డి(60) శుక్రవారం మృతిచెందారు. కారంచేడు మండలం యర్రంవారిపాలెం గ్రామానికి చెందిన వెంకటరెడ్డి బాపట్ల జిల్లా, యద్దనపూడి మండల తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తూ బ్రెయిన్ స్ట్రోక్‌కు గురయ్యారు. హైదరాబాదులోని అపోలో ఆసుపత్రిలో చికిత్స పొదుతూ శుక్రవారం రాత్రి మృతి చెందారు. మృతదేహాన్ని స్వగ్రామం యర్రంవారిపాలెం తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

వైభవంగా హనుమాన్ శోభాయాత్ర



శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

దర్శి, మే 31: హనుమాన్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని దర్శిలో శుక్రవారం శోభాయాత్ర నిర్వహించారు. పట్టణంలోని పొదిలిరోడ్డులో నుంచి ఆరంభమైన ఈ యాత్ర పట్టణ ప్రధాన వీధుల్లో వైభవంగా సాగింది. భక్తులు హనుమాన్ జెండాలు ధరించి మోటార్ సైకిళ్లపై ఈయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ దర్శి నియోజ కవర్గ ఇన్‌చార్జ్ మాడపాకుల శ్రీనివాసులు, సంగు ఏడుకొండలు, అధిక సంఖ్యలో హనుమాన్ భక్తులు పాల్గొన్నారు.

సరదా ఆటలు ప్రాణాల మీదకు తెచ్చాయి..

» స్నేహితుల మధ్య వివాదంలో ఒకరికి తీవ్రగాయాలు

కురిచేడు, మే 31: గ్రామాలలో వేసవిలో సరదాగా ఆడుకునే ఆటలు ప్రాణాల మీదకు తీసుకు వస్తున్న సంఘటనలు అరుదుగా జరుగుతున్నాయి. మండలంలోని బోదనంపాడు గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం ఇద్దరు స్నేహితులు ఆంజనేయ స్వామి గుడి వద్ద సరదాగా చింత పిక్కెలతో ఆటలాడుకుంటున్నారు. ఆట మధ్యలో చిన్న వివాదం వచ్చి ఇరువురు గొడవ పడి చివరకు సీసాలతో పొడుచుకోగా ఒకరి పరిస్థితి విషమంగా మారింది. బోదనంపాడు గ్రామంలోని ఆంజనేయ స్వామి గుడి దగ్గర బస్ షెల్టర్ ఎదురుగా గ్రామస్థులు సరదాగా కూర్చొని ఆటలు ఆడుకుంటుంటూ ఉంటారు. శుక్రవారం కూడా అలాగే 108లో పనిచేసే అబుదావలి, అదే గ్రామానికి చెందిన వేమా గోవింద రమేష్‌లు చింతపిక్కెలతో ఆడుకుంటున్నారు. ఆట మధ్యలో సరదా సంభాషణ కాస్తా పక్కదారి పట్టి వివాదం చెలరేగింది. అబుదావలి గోవింద రమేష్‌ను కొట్టబోయి పక్కనే ఉన్న సీసాతో కొట్టాడు. దీంతో రమేష్ ఆగ్రహంతో పక్కనే బీరు బాటిల్‌తో అబుదావలి తలపై బాదాడు. సీసా పగిలి అబుదావలి గాయపడ్డాడు. అదే సమయంలో గోవింద రమేష్ అబుదావలి గొంతు మీద కాలేసి తొక్కి. పట్టి ఇష్టం వచ్చినట్లు పగిలిన సీసాతో పొడిచాడు. దీంతో తీవ్రగాయాలపాలైన అబుదావలి అపస్మారక స్థితిలోకి వెళ్ళాడు. వెంటనే అతడిని దర్శి ప్రభుత్వ వైద్యశాలకు చికిత్స కోసం తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం అబుదావలిని ఒంగోలు రిమ్స్ వైద్యశాలకు తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలియజేస్తున్నారు. సరదాగా ఆడుకునే ఆటలు చివరకు ప్రాణాల మీదకు తెచ్చాయని స్థానికులు అంటున్నారు.



గాయపడిన అబుదావలి



గోవింద రమేష్

వృత్తి నైపుణ్య పురస్కారాలు ప్రదానం

అద్దంకిటౌన్, మే 31: సమాజంలో అన్ని వృత్తులు గౌరవించదగినవని, ఏ వృత్తినీ చిన్నచూపు చూడరాదని రోటరీ అధ్యక్షుడు చిన్ని మురళికృష్ణ అన్నారు. శుక్రవారం సాయంత్రం అద్దంకిలోని గీతామందిర్‌లో రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో వివిధ వృత్తులలో నైపుణ్యం చూపిన పది మందికి వృత్తి నైపుణ్య పురస్కారాల ప్రదాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా చెన్నుపల్లి సుబ్బారావు(రజిక), మున్నంగి వెంకటరావు(పారిశుధ్యం), మేడా సత్యనారాయణ(ఎలక్ట్రీషియన్), మునుగోటి లక్ష్మీ స్వరాజ్యం(టైలర్), వీరేపల్లి సూర్యనారాయణ(క్షవర) గోగులమూడి శేషగిరిరావు(గాత్రసంగీతం), అద్దంకి పున్నయ్య(చర్మకారి), ఇండ్ల అంజలి(రంగస్థల కళాకారిణి), మర్రిపూడి వెంకటేశ్వర్లు,(తాపీమేస్త్రీ), పెద్దిశెట్టి వెంకటాద్రి(కోలాటం)లకు శాలువా, జ్ఞాపిక, నూతన వస్త్రాలు, పూల మాలలతో ఘనంగా సత్కరించి పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ సెక్రటరీ చప్పిడి వీరయ్య, ట్రెజరర్ కొల్లా భువనేశ్వరి, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ అద్దంకి లేవి ప్రసాద్, సందిరెడ్డి శ్రీనివాసరావు, మహమ్మద్ రఫీ, వీరవల్లి సుబ్బారావు (రుద్రయ్య), డాక్టర్ యు.దేవపాలన, జ్యోతి చంద్రమౌళి, మలాది శ్రీనివాసరావు, హరిప్రసాద్, ఆంజనేయులు పాల్గొన్నారు.



వృత్తి నైపుణ్య పురస్కారాలను అందుకున్న వృత్తిదారులతో రోటరీ సభ్యులు

ముఠా కార్మికుల ధర్నా



గోడౌన్ వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

దొనకొండ, మే 31: దొనకొండలోని పౌరసరఫరాల శాఖ స్టాక్ పాయింట్ పరిధిలో నుంచి 20 చౌకధరల దుకాణాలను ప్రభుత్వం తొలగించి కార్మికుల పొట్టకొట్టిందని సీఐటీయూ మండల కార్యదర్శి చిరుపల్లి అంజయ్య విమర్శించారు. సివిల్ సప్లయ్ ముఠా యూనియన్ అధ్యక్షుడు గుడిమెట్ల ఆదాము అధ్యక్షతన గోడౌన్ వద్ద శుక్రవారం జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడారు. దొనకొండ, కురిచేడు మండలాల్లోని 20 చౌకధరల దుకాణాలకు ఆహర ధాన్యాల ఎగుమతి, దిగుమతులను దూరప్రాంతాల్లో ఉన్న మార్కాపురం, ఎర్రగొండపాలెం స్టాక్ పాయింట్లలో చేర్చటంతో ఇక్కడ కార్మికుల కు పనులు తగ్గిపోతున్నాయన్నారు. గత 30 సంవత్సరాలుగా దొనకొండ స్టాక్ పాయింట్ పరిధిలో ఉన్న ఈ రెండు మండలాల దుకాణాలను ఇక్కడ నుంచి తొలగించటంతో 30 మంది కార్మికులు జీవనం కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నిర్ణ యంతో ప్రభుత్వానికి రవాణాభారం అదనంగా పడుతుందని, రేషన్ డీలర్లు ఒ కటికి రెండుసార్లు అంతదూరం వెళ్లి స్టాక్ తెచ్చుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సంబంధిత అధికారులు ఈ విషయా లను గుర్తించి గతంలో ఉన్న విధంగానే దొనకొండ స్టాక్ పాయింట్ నుంచే రేషన్ షాపులకు సరుకులు సరఫరా చేసి కార్మికులకు ఉపాధి కల్పించాలని అంజయ్య డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పోరు మామిళ్ల వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు, దారం నరసిం హారావు, శ్రీనివాస రావు, కర్నా హనుమయ్య కుందుర్తి అనీల్, తదితరులు పాల్గొన్నారు.

వసతుల కల్పనకు ఎస్‌బీఐ పూర్తి సహకారం

• రీజనల్ మేనేజర్ గుణేశ్వరరావు



ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎస్‌బీఐ అధికారులు

అద్దంకి, మే31: శింగరకొండకు వచ్చే భక్తులకు అవసరమైన వసతుల కల్పనకు ఎస్‌బీఐ ఆధ్వర్యంలో తమ వంతు సహకారం అందిస్తామని ఎస్‌బీఐ ఒం గోలు రీజనల్ మేనేజర్ ఎస్.గుణేశ్వరరావు అన్నారు. శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో 10 లక్షల రూపాయలతో నిత్యఅన్నదానం తయారీకి అవసరమైన స్టీమ్, కిచెన్ ఐటెమ్స్‌ను శుక్రవారం దేవస్థానం ఈవో, అసిస్టెంట్ కమిషనర్ సుభ ద్రకు అందజేశారు. ఈ సందర్భంగా దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ మేనేజర్ వి.రాజేష్‌బాబు, హెచ్ఆర్ మేనేజర్‌లు చంద్రరావు, నళినీకాంత్, అద్దంకి శాఖ చీఫ్ మేనేజర్ కాకి రాజేష్, డిప్యూటీ మేనేజర్ రామిశెట్టి నరసింహారావు, ఎస్‌బీఐఓఏ అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ వి.శ్రీనివాసరావు, రీజనల్ సెక్రటరీ శ్రీనివాసరావు, ఎస్‌బీఐ ఎస్‌యూఏసీ వైస్ ప్రెసిడెంట్ సుధాకరరావు పాల్గొన్నారు.

శింగరకొండలో హనుమజ్జయంతి ఉత్సవాలు



ప్రసన్నాంజనేయుడికి లక్ష మల్లెల పూజ చేస్తున్న అర్చకులు

అద్దంకి, మే31: శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో హనుమజ్జయంతి ఉత్సవాలు రెండో రోజు శుక్రవారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా శుక్రవారం ఉదయం గణపతి పూజ, రుత్విగ్వరణము, మహన్యాస పారాయణం, ఏకాదశ మన్యుసూక్త వారాభిషేకం, వేద స్వస్తి, పంచామృతాలు, ఏకాదశ విశేష ద్రవ్యాలతో సంపూర్ణాభిషేకం, సుందరకాండ పారాయణ చండి సప్తశతి సూర్య నమస్కారాలు జరిగాయి. ఉభయదాతలుగా సింగరాయకొండ మండలం చినకనుమళ్లకు చెందిన కాట్రగడ్డ వెంకటసాయిరామ్, నాగరాజులు వ్యవహరించారు. సాయంత్రం ప్రదోషకాల సమయంలో లక్ష మల్లిక(మల్లెపూలు) పూజ నిర్వహించారు. ఉభయదాతలుగా ధేనువకొండకు చెందిన బోడపాటి కల్యాణ్‌కుమార్, గీత, గురజాల మురళీకృష్ణ,కల్యాణి దంపతులు పాల్గొన్నారు. ఈవో సుభద్ర ఆధ్వర్యంలో ఏర్పాట్లు పర్యవేక్షించారు. శనివారం హనుమజ్జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు జరుగుతాయ ని ఈవో తెలిపారు. ఈ ఏడాది హనుమజ్జయంతి శనివారం రావటం విశేషం. పలువురు దీక్షా భక్తులు ఇరుముడి సమర్పించి దీక్ష విరమించనున్నారు.



ఎగుమతి చేసేందుకు సిద్ధం చేసిన డిజైన్ స్లేట్స్

పలకల పరిశ్రమ కుదేలు

• పెరిగిన డెడ్ రెంట్ • నిలిచిన ముడిరాయి వెలికితీత • ఫ్యాక్టరీల మూసివేత • వలస పోతున్న కూలీలు

మార్కాపురం, మే 31: పిల్లలకు ఓనమాలు నేర్పాలంటే ఇదివరకు గుర్తొచ్చేది రాతి పలకే. రాతి పలకల తయారీకి, దేశవిదేశాల్లో పంపిణీకి కేంద్రబిందువు జిల్లాలోని మార్కాపురం. శతాబ్దకాలం నుంచి పలకల తయారీకి దేశవ్యాప్తంగా మార్కాపురం ప్రసిద్ధిగాంచింది. అందుకే మార్కాపురం మట్టిపలకకి మారు పేరయ్యింది. కానీ మట్టి పలక ఇప్పుడు తన ప్రాభవాన్ని కోల్పోతోంది. పలకల తయారీ మొదట కుటీర పరిశ్రమగా ప్రారంభమైంది. రాసే పలకలకి గిరాకీ పెరగడంతో బడా వ్యాపారవేత్తలు కూడా రంగప్రవేశం చేశారు. తదనంతర అతిపెద్ద పరిశ్రమలు వెలశాయి. ఈ పలకల్ని విదేశాలకు కూడా ఎగుమతి చేసేవారు. సుమారు 200ల ఫ్యాక్టరీలు నెలకొల్పారు. ఈ పరిశ్రమపై ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 20 వేల మంది కూలీలు ఆధారపడి జీవించే వారు.

ఎనామిల్ పలకల తయారీ...

పలకల పరిశ్రమ దినదినాభివృద్ధి చెందుతున్న కాలంలో ఎనామిల్, హార్డ్‌బోర్డు పలకలు మార్కెట్‌లో రంగప్రవేశం చేశాయి. ఇక్కడ కూడా కొందరు ఎనామెల్ పలకల తయారీ మొదలుపెట్టారు. కాని వాటి తయారీకి అవసరమైన ముడిసరుకును దిగుమతి చేసుకోవాల్సి వచ్చేది. దానివల్ల ఆ వ్యాపారం లాభసాటిగా లేకపోవటంతో తయారీ ఆగిపోయింది.

కుటీర పరిశ్రమనుంచి పారిశ్రామికవాడ వరకు

మార్కాపురంలో వ్యాపారం ఊపందుకోవడంతో పరిసర ప్రాంతాలలో కూడా రాతిగనుల కోసం అన్వేషణ మొదలైంది. ఆ పట్టణ పరిసరప్రాంతాల్లోని మండలాల్లోనే కాకుండా గుంటూరు, నల్గొండ జిల్లాలలో కూడా ఈ రాతి నిక్షేపాలను గుర్తించారు. ఆయా ప్రాంతా ల్లో కూడా డిజైన్ స్లేట్ పరిశ్రమల్ని నెలకొల్పారు. ప్రస్తుతం ప్రకాశం జిల్లాలో బేస్తవారిపేట, తర్లుపాడు, త్రిపురాంతకం, దొనకొండ, దర్శి, గుంటూరు జిల్లాలో రేమిడిచర్ల, మాచర్ల, నల్గొండ జిల్లాలో మిర్యాలగూడలో ఈ పరిశ్రమలున్నాయి. మూడు జిల్లాల్లో కలిపి సుమారు మూడే వేల ఎకరాల్లో పలకల గనులు విస్తరించి ఉన్నాయి.

ఆర్థిక మాద్యంతో కుదేలైన పరిశ్రమ

2010లో అమెరికాలో ఏర్పడ్డ ఆర్థికమాద్యంతో పలకల పరిశ్రమ మొట్టమొదటిసారిగా కుందేలైంది. అప్పటి వరకు రోజుకు సుమారు 50 లారీల పలకలను ఎగుమతి చేస్తున్న వ్యాపారవేత్తలు నెలకు 50 లారీలు కూడా ఎగుమతి చేయలేని పరిస్థితికి పడిపోయారు. దీంతో గనుల నుంచి ముడిరాయిని వెలికి తీసేందుకు వ్యాపారవేత్తలు ఆసక్తి చూపలేదు. దీంతో గనులలో పనిచేసే కూలీలు ఉపాధి కోల్పోయారు. పనుల కోసం వలసలు వెళ్లారు. ముడిసరుకు లేని కారణంగా చాలా ఫ్యాక్టరీలు మూతపడ్డాయి. దీంతో పలక ఫ్యాక్టరీలలో పని చేసే వారి పరిస్థితి కూడా అదే విధంగా తయారైంది. దీనికి తోడు అనుబంధ పారిశ్రామికవేత్తలైన చెక్కపెట్టెల తయారీదారులు కూడా తమ ఫ్యాక్టరీలను మూసివేశారు.



ముడిరాయిని కటింగ్ చేస్తున్న కార్మికులు

పడి లేచిన తీరు...

కనుమరుగవుతున్న మార్కాపురం పలకల పరిశ్రమ లోకి ప్రవేశించి ఈ పలకలను రాసే పలకల్నించి రంగు రంగుల హరివిల్లులు తయారు చేయవచ్చని గుర్తించిన మొట్టమొదటి వ్యక్తి రాష్ట్ర మాజీ మంత్రి ఎం.మాణిక్యరావు. డిజైన్ స్లేట్ వ్యాపారం లాభాలను గడిస్తుండడంతో అప్పటి వరకూ రాసే పలకల వ్యాపారంలో ఆరితేరిన నలుగురు పారిశ్రామికవేత్తలు కూడా డిజైన్‌స్లేట్ రంగంలోకి మారారు. పలువురు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు కూడా డిజైన్ స్లేట్ వ్యాపారంలోకి ప్రవేశించారు. ఫ్యాక్టరీలు మూతపడటం వల్ల ఉపాధి కోల్పోయిన వారంతా తిరిగి డిజైన్ స్లేట్ పరిశ్రమలోకి ప్రవేశించారు.

నాలుగురెట్లు పెరిగిన డెడ్ రెంట్

మార్కాపురం పారిశ్రామిక వాడలో ప్రస్తుతం సుమారు 60 ఫ్యాక్టరీలలో డిజైన్ పలకల ఉత్పత్తి జరుగుతోంది. పలకల గనులలో వచ్చే ముడి సరుకుపై వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డెడ్‌రెంట్ విపరీతంగా పెంచింది. టీడీపీ ప్రభుత్వ హయాంలో హెక్టారుకు ఏడాదికి రూ.15 వేలుగా ఉన్న డెడ్‌రెంట్ ప్రస్తుతం రూ.65 వేలకు పెంచింది. క్వారీల యజమానులకు టీడీపీ హయాంలో టన్నుకు చెల్లిస్తున్న రాయల్టీ రూ.6500 నుంచి రూ.13000లకు చేరింది.



కట్ చేసేందుకు సిద్ధంగా ఉన్న ముడిరాయి

పెరిగిన రవాణా చార్జీలు

డీజిల్ రేటు రోజురోజుకూ మారుతుండటంతో రవాణా చార్జీలు సైతం పెరిగిపోయాయి. మార్కాపురం నుంచి చెన్నై ఎయిర్ పోర్టుకు చేరేందుకు ఒక టన్నుకు రూ.1450 లు వసూలు చేస్తున్నారు. ఒక కంటైనర్‌ను నింపాలంటే 24 టన్నులు ఉత్పత్తి చేయాల్సి ఉంది. విదేశాలకు రవాణా చార్జీలు సైతం ఆకాశాన్ని అంటాయి. ఒక కంటైనర్ అమెరికాకు పంపించడానికి గతంలో 1200 డాలర్లు చెల్లించాల్సి ఉండగా ప్రస్తుతం 7500 డాలర్లు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. అదే బ్రిటన్‌కు గతంలో 800 డాలర్లు చెల్లిస్తుండగా ప్రస్తుతం 6000 డాలర్లు చెల్లించాల్సి వస్తుంది.

ముందుకు రాని బయ్యర్లు

పలకల ఉత్పత్తి వ్యయాలు, రవాణా చార్జీలు, కూలీ చార్జీలు పెరిగిన నేపథ్యంలో ఉత్పత్తిదారులు ఒక చదరపు అడుగుకు రూ.150లు పెంచాల్సిన పరిస్థితి నెలకొంది. కేవలం రూ.10లు పెంచితేనే పలకల కొనుగోలుకు విముఖత చూపే బయ్యర్లు ప్రస్తుతం పలకలకు యజమానులు సూచించే రేట్లకు ముందుకు రాని పరిస్థితి నెలకొంది.

ట్రాన్స్‌ఫార్మర్ మార్పు



ట్రాన్స్‌ఫార్మర్‌ను మారుస్తున్న సిబ్బంది

మార్కాపురం రూరల్, మే 31: మండలంలోని బోడపాడు గ్రామంలో ప్రభుత్వ పాఠశాల వద్ద స్తంభాలు ఏర్పాటు చేసి ట్రాన్స్‌ఫార్మర్ మార్పు మరచి అనే శీర్షికతో మే 28న ప్రచురితమైన కథనానికి విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. శుక్రవారం బోడపాడు ప్రభుత్వ పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన స్తంభానికి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. మండల విద్యుత్ శాఖ ఏఈ సుబ్బరాయుడు తన సిబ్బందినితో పర్యవేక్షించి ట్రాన్స్‌ఫారమర్ మార్పు పనులను చేయించినట్లు తెలిపారు. దీంతో గ్రామంలోని పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. పాఠశాలలో విద్యార్థులు ప్రమాదాల బారిన పడకుండా ఉండేందుకు విద్యుత్ సమస్యను ఆంధ్రజ్యోతి ద్వారా అధికారులుకు తెలియజేసి సమస్యను పరిష్కరించినందుకు పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలియజేశారు.

నంబర్ ప్లేట్లపై స్టిక్కర్లు ఉంటే వాహనాలు సీజ్

• మార్కాపురం సీఐ వెంకటేశ్వర్లు

మార్కాపురం, మే 31: వాహనాల నంబర్ ప్లేట్లపై ఎలాంటి స్టిక్కర్లు ఉన్నా ఎంవీఐ యాక్ట్ ప్రకారం వాటిని సీజ్ చేస్తామని మార్కాపురం సీఐ ఆవుల వెంకటేశ్వర్లు తెలిపారు. రెండురోజులుగా రాష్ట్రవ్యాప్తంగా నంబర్ ప్లేట్లపై ఫలానా ఎమ్మెల్యే, ఎంపీల తాలూకా అంటూ పలు రాజకీయ పక్షాల కార్యకర్తలు స్టిక్కర్లు అతికించి వివాదాలకు తెరలేపారని అన్నారు. నంబర్ ప్లేట్లపై నంబరు మినహా ఇలాంటి రాతలు ఉన్నా ఉపేక్షించేదిలేదన్నారు. వారిపై మోటారు వాహనాల చట్టం ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆన్‌లైన్ మోసంపై కేసు నమోదు

• రూ.34 లక్షలు పోగొట్టుకున్న బ్యాంకు ఉద్యోగిని

మార్కాపురం, మే 31: అత్యాశకుపోయిన ఓ మహిళా ఉద్యోగిని ఆన్‌లైన్ మోసంలో రూ.34 లక్షలు పోగొట్టుకుంది. ఈ మేరకు మార్కాపురం పట్టణ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల మేరకు పట్టణంలోని ఓ బ్యాంకులో ఉద్యోగం చేస్తున్న మహిళ సెల్‌ఫోన్‌కు తరచుగా వర్క్ ఫ్రం హోం ద్వారా డబ్బులు బాగా సంపాదించవచ్చేనే మెసేజ్‌లు వచ్చాయి. దీంతో వాటిని నమ్మిన ఆ ఉద్యోగిని తొలుత కొంత మేర సంపాదించారు. ఆ తర్వాత పెద్ద మొత్తంలో మీకు ఆదాయం రావాలంటే కొంత మేర పెట్టుబడి పెట్టాలని ఆమెను ముగ్గులోనికి దించారు. అత్యాశకు పోయిన ఆ ఉద్యోగిని విడతల వారీగా సుమారు రూ.34 లక్షలు మోసగాళ్లకు ఆన్‌లైన్‌లో చెల్లించింది. నెలలు గడుస్తున్నా సదరు మోసగాళ్లు ఆమెను పట్టించుకోకపోవడంతో మోసపోయినట్లు గ్రహించి పోలీసులను ఆశ్రయించారు. దీంతో ఆమె ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్సై అబ్దుల్ రెహమాన్ శుక్రవారం 420, 66 డి ఐటీ సెక్షన్‌ల క్రింద కేసు నమోదు చేశారు.

కొండారెడ్డి కాలనీలో చోరీ

• రూ.1.20 లక్షల సొత్తు అపహరణ

మార్కాపురం : మార్కాపురంలోని కొండారెడ్డి కాలనీలో శుక్రవారం ఓ చోరీ వెలుగు చూసింది. ఈ ఘటనలో రూ.1.20 లక్షలు చోరీ జరిగినట్లు ఎస్సై అబ్దుల్ రెహమాన్ తెలిపారు. కాలనీకి బండారు తిరుపతమ్మ భర్త వెంకటేశ్వర్లు, ఆమె పుట్టింటికి మండలంలోని పెద్దనాగులవరం గ్రామానికి నాలుగు రోజుల క్రితం వెళ్లారు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం ఇంటికి వచ్చి చూశారు. అప్పటికే తలుపులు పగలగొట్టి, ఉంది. ఇంటో అభరణాలు పరిశీలించు కోగా, 74 గ్రాముల బంగారం రూ.18 వేల నగదును పోగట్టుకున్నారు.

జార్జ్ ఆశయ సాధనే లక్ష్యంగా విద్యా సంస్థలు

• మంత్రి ఆదిమూలపు సురేష్



జార్జ్ సమాధి వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి సురేష్

మార్కాపురం వన్‌టౌన్, మే 31: డాక్టర్ ఆదిమూలపు శామ్యూల్ జార్జ్ ఆశయ సాధనే లక్ష్యంగా జార్జ్ విద్యాసంస్థలు పనిచేస్తున్నాయని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. స్థానిక జార్జ్ ఇంజనీరింగ్ కళాశాలలో జార్జ్ విద్యా సంస్థల వ్యవస్థాపకులు డాక్టర్ ఆదిమూలపు శ్యామ్యూల్ జార్జ్ 92వ జయంతి కార్యక్రమాలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ జార్జ్ స్మృతి చిహ్నంపై పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ.. వెనుకబడిన పశ్చిమ ప్రకాశంలో సాంకేతిక విద్యను పేద విద్యార్థులకు అందించాలన్న సామాజిక సేవా దృక్పథంతో డాక్టర్ జార్జ్ ఇంజనీరింగ్ కళాశాలను స్థాపించాడన్నారు. ఆ లక్ష్య సాధనే ధ్యేయంగా నిరంతరం జార్జ్ విద్యాసంస్థలు కృషి చేస్తూ, ముందుకు వెళ్తున్నాయన్నారు. జిల్లాలోనే మొట్ట మొదటి ఇంజనీరింగ్ కళాశాలను తమ తండ్రి జార్జ్ మార్కాపురంలో స్థాపించాడన్నారు. రోజురోజుకు పెరుగుతున్న పోటీ ప్రపంచంలో విద్యార్థులకు నాణ్యమైన విద్య క్రమశిక్షణ, నైతిక విలువలు నేర్పిస్తున్నామన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందేందుకు వివిధ రంగాలలో ఉత్తమ శిక్షణ ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ రాజాబాబు, డీన్ ఎం.మస్తానయ్య, ఈశ్వరయ్య డానియల్ జోసఫ్ తదితరులు పాల్గొన్నారు.

సప్లై చానల్ శుభ్రం చేయించి మొక్కలు నాటిస్తాం

మున్సిపల్ కమిషనర్ కిరణ్

మార్కాపురం రూరల్, మే 31: మార్కాపురం చెరువు సప్లై చానల్‌ను శుభ్రం చేయించి మురుగునీరు లేకుండా చేస్తామని మున్సిపల్ కమిషనర్ కిరణ్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన కాలువను పరిశీలించారు. కాలువలో మురికి నీరు నిల్వ ఉండడంపై 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో గురువారం 'పచ్చదనం లేదు పరిశుభ్రత లేదు' శీర్షికన కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. దీంతో స్పందించిన కమిషనర్ సప్లై ఛానల్‌లో మురుగు నీటినిల్వను, నివాసాల నుంచి సప్లై చానెల్‌లోకి ఏర్పాటు చేసిన మురుగునీటి పైపులను పరిశీలించారు. సంబంధిత ఉన్నతాధికారులకు సమస్యను తెలియజేసి వీలైనంత త్వరలో పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. నివాసాల నుంచి సప్లై చానల్‌లోకి ఏర్పాటు చేసిన పైపులను ఏర్పాటు చేసుకు న్న వారికి నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. ఏపీ గ్రీనింగ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ వారికి సమస్యను తెలియజేశామన్నారు. వారి సహకారంతో త్వరలో సప్లై ఛానల్‌లో ఉన్న వ్యర్థాలను, మురికి నీటిని పరిశుభ్రం చేసి, మొక్కలు నాటే కార్యక్రమం చేపడతామన్నారు.



కాలువను పరిశీలిస్తున్న కమిషనర్ కిరణ్

తాగునీటి బోర్లలో అడుగంటిన భూగర్భజలాలు

తాగునీరు అందక ప్రజల అవస్థలు

ఎర్రగొండపాలెం, మే 31 : మండలంలో తాగునీటిబోర్లలో భూగర్భజలాలు అడుగంటడంతో తాగునీటికోసం గ్రామీణ ప్రజలు ట్యాంకర్ల పైనే ఆధారపడుతున్నారు. ఎర్రగొండపాలెం మండలంలో నాలుగురోజులుగా పెరిగిన ఉష్ణోగ్రతల కారణంగా గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రమయ్యింది. మండలంలో శుక్రవారం గరిష్ట ఉష్ణోగ్రత 44 డిగ్రీలు కాగా కనిష్ట ఉష్ణోగ్రత 30 డిగ్రీలు నమోదు అయ్యింది. మండలంలో 20 గ్రామాల్లో తాగునీటికోసం ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం కేవలం 11 గ్రామాల్లో నీటిసరఫరాకు 85 ట్యాంకర్ల నీటిని సరఫరా చేయడానికి ప్రభుత్వం మార్చి నెలలో అనుమతి ఇచ్చింది. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలు రావడంతో వైసీపీ, టీడీపీ అభ్యర్థులు ఓట్లకోసం నీటిసమస్య ఉన్న గ్రామాల్లో పోటాపోటీగా ట్యాంకర్లు ఏర్పాటుచేసి టాక్టర్లు ద్వారా నెలరోజులుగా గ్రామీణ ప్రజలకు నీళ్లు సరఫరా చేశారు. మండలంలో తాగునీటి సమస్య ఉన్న గ్రామాల్లో ఇరు పార్టీల కార్యకర్తలు నీటి సరఫరా చేస్తుండడంతో గ్రామీణ ప్రజలకు నీటి సమస్య లేదు. ఎన్నికల ముందు రోజు నుంచి గ్రామాల్లో పార్టీల నాయకులు ఏర్పాటు చేసిన ట్యాంకర్లు నిలిపి వేశారు. దీంతో మండలంలో తాగునీటి సమస్య మొదటికొచ్చింది. ప్రస్తుతం ఉన్నతాగునీటి సమస్య తీరాలంటే నిత్యం 250 ట్యాంకర్లు నీటిని సరఫరా చేస్తేనే ప్రజల తాగునీటి అవసరాలు తీరుతాయి. మండలంలోని అమానిగుడిపాడు, గురిజేపల్లి,వాదంపల్లి, మురారిపల్లి, వెంకటాద్రిపాలెం, గుర్రపుసాల, గోళ్లవీడపి గ్రామాల్లో తాగునీటి తీవ్రంగా ఉంది. కలెక్టరు అనుమతి ఇచ్చిన తమ్మడపల్లి గ్రామంలో 17 ట్యాంకర్లు, గంగుపల్లి 12, గుర్రపుసాల 5, చిన్నకొలుకుల 5, చెన్నరాయునిపల్లి 11, రేగుల పల్లి 2, కాశికుంటతాండ 4, వేగినాటికోటయ్యనగర్ 9, మురారిపల్లె 6, అయ్యంబొట్లపల్లి 4, చిన్న బోయలపల్లి 10 ట్యాంకర్లు గ్రామీణ నీటిసరఫరా విభాగం తరపున సర్పంచులు సరఫరా చేస్తున్నారు. గోళ్లవీడపి గ్రామంలో 4 రోజులకు ఒక పర్యాయం సాగర్‌పైపులైను నుంచి నీటి సరఫరా చేస్తుండడంతో గొంతెండుతుందని గోళ్లవీడపి ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఎన్నికలు ముగియడంతో ఇరుపార్టీల నాయకులు ట్యాంకర్లు నిలిపి వేయడంతో గ్రామాల్లో తాగునీటికోసం ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం సర్వే చేయించి తాగునీటి సమస్య ఉన్న గ్రామాలకు ట్యాంకర్లు ద్వారా నీటి సరఫరాకు అనుమతి ఇవ్వాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



ట్యాంకర్ వద్ద నీళ్లు పట్టుకుంటున్న ప్రజలు

11 గ్రామాలకు నీటిని సరఫరా చేస్తున్నాం

మండలంలో 11 గ్రామాలకు 85 ట్యాంకర్లు ప్రభుత్వ అనుమతితో నీటిని సరవరా చేస్తున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీకాంత్ తెలిపారు. తాగునీటి సమస్య ఉన్న గ్రామాలను గుర్తించి సరఫరాకు అనుమతి తీసుకుంటామన్నారు.

వృత్తికే వన్నె తెచ్చిన సుబ్బలక్ష్మి



సుబ్బలక్ష్మీని సన్మానిస్తున్న యాజమాన్యం, సిబ్బంది

మార్కాపురం వన్‌టౌన్, మే 31: తన విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉంటూ వృత్తికే వన్నె తెచ్చిన మహిళ తాడువాయి వెంకట సుబ్బలక్ష్మీ అని ఎస్వీకేపీ కళాశాల ప్రిన్సిపాల్ డి.దీప అన్నారు. స్థానిక ఎస్వీకేపీ కళాశాలలో 36 సంవత్సరాలుగా ల్యాబ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న తాడువాయి వెంకట సుబ్బలక్ష్మీ ఉద్యోగ విరమణ, సన్మాన సభ శుక్రవారం కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ దీప మాట్లాడుతూ.. సుబ్బలక్ష్మి ఎందరో విద్యార్థిని, విద్యార్థులను ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దేందుకు తోడ్పడ్డారన్నారు. కళాశాల కరస్పాండెంట్ ఎస్.నరసింహులు మాట్లాడుతూ.. ఉన్నత విలువలు, క్రమశిక్షణ సుబ్బలక్ష్మీ సొంతం అన్నారు. మంచి వ్యక్తిత్వం ఉన్న సుబ్బలక్ష్మీ ఉద్యోగ విరమణ అనంతరం ఆమె జీవితం మరిన్ని ఉన్నతాశయాలు సమాజసేవలో పాల్గొనాలన్నారు. ఆమె భావి జీవితం ఆయురారోగ్య ఐశ్వర్యాలు సుఖసంతోషాలతో ఆనందంగా గడపాలన్నారు. అనంతరం సుబ్బలక్ష్మీని కళాశాల సిబ్బంది, బంధుమిత్రులు అత్యంత ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తాడువాయి వెంకట సుబ్బారావు, సుబ్బలక్ష్మీ, వెంకట సుబ్రహ్మణ్యం, రాజ్యలక్ష్మీ, తాడువాయి వెంకట సత్యనారాయణ, భాగ్యలక్ష్మీ, కాశీనాథ్, లక్ష్మీ స్పందన, రేణు కృష్ణ చైతన్య, శైలజ, నాగ పవన్ కుమార్, పద్మప్రియ, తేజస్విని, టి.కాశీనాథ్, పి.కాశీరావు పాల్గొన్నారు.

కంకర పరిచారు.. రోడ్డు మరిచారు..

ఐదేళ్లగా అవస్థలు పడుతున్న ప్రజలు

పుల్లలచెరువు, మే 31: మండలంలోని పలు రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోకపోవడంతో రోడ్లు గతుకుల మయంగా మారాయి. దీంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎన్నికల కోడ్ కారణంగా రంగన్నపాలెం కుందంపల్లి నుంచి శంకుస్థాపన చేసిన రోడ్డు నేటికి అలాగే కనిపిస్తుండటం విశేషం.

అధ్వానంగా కుందంపల్లి రోడ్డు

పుల్లలచెరువు మండలం కుందంపల్లి రోడ్డు అధ్వానంగా ఉంది. అధ్వానంగా ఉన్న గ్రామ ప్రజలు నిత్యం ఎర్రగొండపాలేనికి నిత్యవసరాలు, వ్యవసాయ అవసరాలకు ప్రయాణాలు సాగిస్తుంటారు. రంగన్నపాలెం నుంచి కుందంపల్లికి సూమారు 2 కిలోమీటర్లు వుంటుంది. ఏళ్లుగారోడ్డు లేక ఇబ్బంది నిత్యం పడుతున్నారు. ఈ విషయం తెలుసుకొని గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 2019లో ప్రత్యేక ప్యాకేజీ కింద రోడ్డు మంజూరు చేసింది. అయితే పనులు మొదలు పెట్టి చిప్స్ తోలగానే ఎన్నికల కోడ్ కారణంగా రోడ్డు నిర్మాణం నిలిచిపోయింది. ఎన్నికల అనంతరం కాంట్రాక్టరు మరోసారి రెండవ లేయరు చిప్స్ పోశారు. అయితే నూతన ప్రభుత్వం రావడంతో రాష్ట్ర మంత్రి ఆదిమూలపు సురేష్ హంగు ఆర్భాటంతో రోడ్డుకు శంఖుస్థాపన చేసి మమ అనిపించారు తప్ప మరోసారి ఆ రోడ్డు గురించి పట్టించుకున్న పాపన పోలేదు. ప్రభుత్వం బిల్లులు ఇవ్వలేరన్న భయంతో నేటికీ కాంట్రాక్టరు పట్టించుకోకపోవడంతో నాలుగేళ్ళుగా పనులు నిలిచిపోయాయి. నిర్మాణం కోసం తోలిన చిప్స్ లేచిపోయి వర్షం పడినప్పుడు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నాలుగేళ్ళుగా పనులు నిలిచిపోయినా అధికారులు కాని, ప్రజా ప్రతినిధులు కాని పట్టించుకున్న పాపన పోలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా జిల్లా కలెక్టరు స్పందించి తక్షణమే రోడ్డు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



అధ్వానంగా ఉన్న రంగన్నపాలెం-కుందంపల్లి రోడ్డు

అవీ..ఇవీ..

ఆరాధన మహోత్సవం

గిద్దలూరు, మే 31 : రాచర్ల మండలం చోళ్లవీడు గ్రామంలోని శ్రీవేమయ్యస్వామి ఆలయంలో 202వ ఆరాధన మహోత్సవం శుక్రవారం వైభవంగా ప్రారంభమైంది. వేమయ్యస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కళశాలతో గ్రామోత్సవం చేశారు. 1న శనివారం స్వామి వారికి ఆరాధన మహోత్సవం, అభిషేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు దేవస్థాన ప్రతినిధులు తెలిపారు. అదేవిధంగా ఎద్ల బలప్రదర్శన పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జూన్ 1న శనివారం నాలుగు పండ్ల సైజుల వృషభాలతో బండలాగుడు పోటీలను నిర్వహించనున్నారు. వరుసగా బహుమతులు రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.8వేలు, రూ.5వేలు, రూ.4వేలు నగదు ఇవ్వనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం, సాయంత్రం కోలాట ప్రదర్శన, చెక్కభజన కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

మార్కాపురం వన్‌టౌన్, మే 32: పట్టణంలోని ఆంధ్రప్రగతి గ్రామీణా బ్యాంకులో శనివారం ఉదయం 10.30గంటలకు రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు ఏపీజీబీ సీనియర్ మేనేజర్ రామకృష్ణారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీజీబీ 19 వార్షికోత్సవం సందర్భంగా నెహ్రూ బజార్‌లోని రీజనల్ మేనేజర్ కార్యాలయంలో రక్తదానం శిబిరం ఉంటుందన్నారు. రీజనల్ మేనేజర్ మహేశ్వరం రఘురాం ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు.

ఆంజనేయస్వామికి ఆకు పూజ



ఆకుపూజలో పాల్గొన్న భక్తులు

మార్కాపురం రూరల్, మే 31: మండలంలోని చింతగుంట్ల గ్రామంలో వెలిసిన శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయంలో ఆంజనేయ స్వామి జయంతి వేడుకల సందర్భంగా ఆకుపూజ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి 1.11 లక్షల తమలపాకులతో ఆలయ ప్రధాన పూజారి సుబ్రహ్మణ్యం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమంలో 250 మంది దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించారు. ఆలయ ప్రాంగణంలో భక్తిశ్రద్ధలతో జై వీరాంజనేయ, జై రామాంజనేయ అని స్మరిస్తూ, భక్తులు ఆకు పూజలో పాల్గొని తమ మొక్కులు తీర్చుకున్నారు. పూజ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు మురళీకృష్ణమూర్తి, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కేన్సర్ స్క్రీనింగ్‌పై శిక్షణ



శిక్షణ ఇస్తున్న నోడల్ ఆఫీసర్ డాక్టర్ తిరుమలరావు

మార్కాపురం, మే 31: స్థానిక డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ వైద్య కళాశాలలో రెండు రోజుల కేన్సర్ స్క్రీనింగ్ శిక్షణ కార్యక్రమం శుక్రవారం ప్రారంభించారు. విశాఖపట్నంలోని హోమీబాబా క్యాన్సర్ సెంటర్‌లో శిక్షణ పొందిన ఒంగోలు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రివెంటివ్ ఆంకాలజీ యూనిట్ నోడల్ అధికారి డాక్టర్ తిరుమలరావు స్థానిక వైద్యులకు శిక్షణ ఇచ్చారు. ప్రధానంగా రొమ్ము, గర్భాశయ ముఖద్వార, నోటి క్యాన్సర్‌లను స్క్రీనింగ్ ద్వారా ఎలా గుర్తించాలో తెలియజేశారు. ఈ సందర్భంగా మార్కాపురం ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్‌వీవీ నాగరాజమన్నార్ మాట్లాడుతూ 70 శాతం క్యాన్సర్లను ముందుగానే గుర్తించి నివారించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సావిత్రి, మార్కాపురం వైద్య కళాశాల ప్రివెంటివ్ అంకాలజీ యూనిట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ వి.ప్రసన్నరాణి, వైద్యులు పాల్గొన్నారు.

ఆరోగ్యకర జీవనశైలితో కేన్సర్ దూరం



పొగాకు వ్యతిరేక దినోత్సవంలో పాల్గొన్న వైద్యసిబ్బంది

కంభం, మే 31 : మానవుల జీవనశైలిలో వచ్చిన మార్పులతో ఇటీవల కాలంలో కేన్సర్ కేసులు ఎక్కువగా పెరుగుతున్నాయని కంభం ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ శిరీష ప్రియదర్శిని పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో హెచ్‌సీజీఎంఎస్‌ఆర్ కేన్సర్ సెంటర్ ఆధ్వర్యంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. పాల్గొన్న డాక్టర్ శిరీష మాటాడుతూ.. యువత తమ జీవనశైలితో కేన్సర్‌ను దూరం చేసుకోవచ్చన్నారు. బీడీ, సిగరెట్, గుట్కా వంటి పొగాకు ఉత్పత్తులకు యువత దూరంగా ఉండాలన్నారు. ఈ విషయాలపై ప్రజాసంఘాలు, స్వచ్ఛందసేవ సంస్థలు ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు. బాధితులు కేన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తిస్తే సరైన వైద్యం ద్వారా, నయం చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యులు డాక్టర్ శివనాయక్, గైనకాలజిస్టు డాక్టర్ పద్మావతి, డాక్టర్ విజయ్‌చంద్ర, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ శ్రావ్య, డాక్టర్ ఫణీంద్ర, ఒంగోలు క్యాన్సర్ సెంటర్ మార్కెటింగ్ మేనేజర్ ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

స్తంభాలను ఆక్రమించినా పట్టించుకోరే..?



స్తంభాన్ని ఆక్రమించి నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్

మార్కాపురం వన్‌టౌన్, మే 31: మార్కాపురం పట్టణంలో విద్యుత్ శాఖ లీలలు చిత్ర విచిత్రంగా ఉన్నాయి. పట్టణంలోని తర్లుపాడు రోడ్డులో విద్యుత్ శాఖ డివిజన్ కార్యాలయం. డివిజన్ విద్యుత్‌శాఖ ఉన్నతాదికారితో పాటు ఏడీఈలు, పట్టణ, రూరల్ ఏఈలు అక్కడ విధులు నిర్వహిస్తుంటారు. కానీ సాక్షాత్తూ విద్యుత్ శాఖ కార్యాలయం ప్రహరి గోడ వద్ద నూతనంగా నిర్మించిన కాంప్లెక్స్‌లో పెద్ద విద్యుత్ స్తంభాన్ని కాంప్లెక్స్‌లో కలుపుకుని కట్టారు. ఇదేదీ విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి రానంతంగా కళ్లుమూసుకుని కార్యాలయానికి రాకపోకలు సాగిస్తున్నారు. క్రమంగా విద్యుత్ స్తంభాన్ని కాంప్లెక్స్‌లో కలిపి కట్టుకున్నా అడిగే దిక్కే లేదు. దీంతో పాటు పట్టణంలో అస్తవ్యస్తంగా విద్యుత్ స్తంభాలు వేశారు. అప్సరా బార్ ఎదురు, నాయుడు వీధి మూలమలుపు వద్ద దాదాపు 20 అడుగులు వదిలి రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభాలు పాతడంతో ఆ ప్రాంతమంతా ఆక్రమణలతో నిండిపోయింది. నాయుడు వీధిలో నిత్యం వందలాది మంది తిరిగే మూలమలుపు వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె ఏర్పాటు చేయలేదు. తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రాజ్యలక్ష్మీ కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. పట్టించుకోవాల్సిన అధికారులు, సిబ్బంది నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నారు.

అరకొరగా ఆర్టీసీ సర్వీసులు

» తాళ్లూరు వాసులకు తప్పని ప్రయాణ కష్టాలు

» దర్శి, అద్దంకి వెళ్లాలంటే ప్రయివేట్ వాహనాలను ఆశ్రయించాల్సిందే!

» పట్టించుకోని అధికారులు

తాళ్లూరు, మే 31: తాళ్లూరు ప్రాంత ప్రజలకు ప్రయాణ సౌకర్యార్థం తగినన్ని బస్సులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నియోజకవర్గ కేంద్రమైన దర్శికి, అద్దంకికి బస్సు సౌకర్యం లేదు. గతంలో ఆర్టీసీ బస్సులు అధిక సంఖ్యలో తిరిగి ప్రజలకు మెరుగైన సేవలు అందించేవి. గత టీడీపీ ప్రభుత్వంలో రోడ్లు అభివృద్ధి చెంది వాహన రాకపోకలకు ఇబ్బందులు తొలగాయి. ఆర్టీసీ అధికారులు కొత్త బస్సులు వేసి ప్రజల కష్టాలను తొలగించాల్సింది పోయి ఉన్న బస్సులను రద్దుచేసి ప్రయాణికులను తీవ్ర కష్టాలు పాలుచేశారు. అధికారులు ఆర్టీసీ బస్సులు తిప్పక పోవటంతో ప్రయాణికులు ప్రయివేట్ వాహనాలను ఆశ్రయించి రాకపోకలు సాగిస్తున్నారు.

కొన్ని సంవత్సరాలుగా పొదిలి ఆర్టీసీ డిపో బస్సులను తూర్పుగంగవరంకు మాత్రమే నడుపుతూ ప్రయాణికులను తీవ్ర అవస్థల పాలు చేస్తున్నారు. తూర్పుగంగవరం నుంచి తాళ్లూరు కేవలం ఐదు కిలో మీటర్ల దూరంలో ఉన్నా మండల కేంద్రానికి ప్రాధాన్యత ఇవ్వకపోవటంలోని అంతర్యమేమిటని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. తూర్పుగంగవరం ఆవలివైపు గ్రామాలకు చెందిన ప్రజలు నిత్యం కార్యాలయ వ్యవహారాల నిమిత్తం నియోజకవర్గ కేంద్రమైన దర్శికి రాకపోకలు సాగిస్తుంటారు. బస్సులు తూర్పుగంగవరంకు తిరిగి వెళుతున్నందున ప్రయాణీకులు గత్యంతరం లేక ప్రయివేట్ వాహనాలపై ఆధారపడాల్సి వస్తుంది. బస్సు సర్వీసులు సరిగా లేనందున ప్రతినిత్యం 15 ప్రయివేట్ వాహనాలు తాళ్లూరు నుండి తూర్పుగంగవరంకు తిరుగుతున్నాయి. ప్రైవేట్ వాహనాలు జోరుగా తిరుగుతూ ఆర్టీసీ ఆదాయానికి గండి కొడుతున్నాయని ఆ శాఖకు తెలిసినా పొదిలి డిపో వారు తాళ్లూరుకు బస్సులు నడపటంలో నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నారని ప్రయాణికులు విమర్శిస్తున్నారు. ఈమార్గంలో ఆర్టీసీ చార్జీల కంటే ప్రయివేటు వాహనాలు అధికంగా చార్జీలు వసూలు చేస్తున్నాయి.

తాళ్లూరు నుండి దర్శికి నేరుగా బస్సులు లేకపోవటంతో ప్రయాణికులు పడరానిపాట్లు పడుతున్నారు. గత్యంతరంలేక వ్యయప్రయాసలకోర్చి ప్రయివేట్ వాహనాలకు ఆశ్రయిస్తున్నారు. అద్దంకి గతంలో నాలుగు ఆర్టీసీ సర్వీసులు నడిచేవి. గత నాలుగేళ్లుగా ఈమార్గంలో కూడా బస్సులు రద్దు చేశారు. ఒకేఒక సర్వీస్ మాత్రం నడుస్తున్నది. అదీ ముండ్లమూరు మార్గం కాకుండా మోదేపల్లి గుండా వెళుతున్నది. దీంతో ప్రయాణికులు ప్రయివేట్ వాహనాలపై ఆధారపడుతున్నారు. ప్రజల విన్నపం మేరకు ఆర్టీసీ అధికారులు రెండు, మూడు పర్యాయాలు తాళ్లూరు వరకు పొదిలి బస్సులను నడిపారు. ఆతర్వాత నష్టాలు వస్తున్నాయన్న సాకు చూపుతూ బస్సులు రద్దు చేయటం పరిపాటిగా మారింది. జిల్లా ఆర్టీసీ అధికారులు, పొదిలి డిపో మేనేజర్ స్పందించి తూర్పుగంగవరంకు నడిచే దర్శి-తూర్పుగంగవరం షటిల్ బస్సులను తాళ్లూరు వరకు పొడగించాలని ప్రయాణికులు కోరుతున్నారు. అలాగే, అద్దంకికి బస్సు సర్వీస్‌లను పెంచాలని కోరుతున్నారు.

దర్శి వెళ్లాలంటే రెండు చోట్ల దిగాల్సిందే!

- చందోలు రామారావు, తాళ్లూరు



గతంలో రోడ్లు సక్రమంగా లేవు. అప్పుడు ఆర్టీసీ బస్సులు బాగానే తిరిగాయి. గత నాలుగేళ్లుగా తాళ్లూరు నుంచి దర్శి వెళ్లాలంటే ఆర్టీసీ బస్సు సౌకర్యం లేదు. దీంతో తూర్పుగంగవరం లేదా ముండ్లమూరుకు వరకు ప్రయివేట్ వాహనంలో వెళ్లి అక్కడ నుండి మరో వాహనంలో దర్శి వెళ్లాల్సి వస్తుంది. నియోజకవర్గ కేంద్రమైన దర్శిలో గల కార్యాలయాల్లో పనుల నిమిత్తం నిత్యం వందల సంఖ్యలో ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. దర్శికి నేరుగా వెళ్లే బస్సులు వేసి ప్రయాణికుల అవస్థలు తొలగించాలి.



అద్దంకి-తాళ్లూరు పల్లెవెలుగు బస్సు

దర్శి వెళ్లాలంటే పూట పడుతుంది..

-మోరతోటి శరాబంది, తాళ్లూరు



దర్శిలో నియోజకవర్గ పరిధిలోని అన్ని కార్యాలయాలు ఉన్నాయి. ప్రయాణికులు కార్యాలయాల పని మీద వెళ్లాలంటే వ్యయప్రయాసలకు గురవుతున్నారు. దర్శికి నేరుగా బస్సు సౌకర్యం లేకపోవడంతో అక్కడికి వెళ్లాంటే పూట పడుతున్నది. ఆర్టీసీ బస్సులు నేరుగా లేక పోవటం వల్ల ఖర్చు పెరుగుతున్నది. రెండు వాహనాలు మారాల్సి రావటం ప్రయాణానికి కష్టంగా ఉంది. ప్రయాణికుల సౌకర్యార్థం దర్శికి నేరుగా ఆర్టీసీ బస్సులు నడపాలి.

వడదెబ్బకు వృద్ధుడు మృతి

దొనకొండ, మే 31: వడదెబ్బకు వృద్ధుడు మృతిచెందిన సంఘటన మండలంలోని తెల్లబాడులో శుక్రవారం చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన అంకాల సిద్ధయ్య(62) గొర్రెలను పొలాల్లో మేపుకునేందుకు తోలుకెళ్లాడు. వేడిగాలులతో ఎండ తీవ్రత విపరీతంగా ఉండటంతో వడదెబ్బకు గురై పొలంలోనే సొమ్మసిల్లి పడిపోయాడు. సమీప పొలంలో ఉన్న కొందరు గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. వారు హుటాహుటీన వెళ్లి పొలంలో పడిపోయిన సిద్ధయ్యను ఆటోలో ఆస్పత్రికి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తుండగా అప్పటికే మృతిచెందినట్లు గుర్తించారు. మృతుడి భార్య కొన్ని సంవత్సరాల క్రితం మృతిచెందారు. ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుటుంబం పెద్దదిక్కు మృతిచెందటంతో కుటుంబసభ్యులు, బంధువులు కన్నీటిపర్యంతమయ్యారు.

దివ్యాంగులకు పరికరాలు అందజేస్తాం

దొనకొండ, మే 31: దివ్యాంగ విద్యార్థులకు రావాల్సిన పరికరాలను, వారికి అవసరమైన సదుపాయాలను సమగ్ర శిక్ష ద్వారా అందించనున్నట్లు ఎంఈవో సాంబశివరావు పేర్కొన్నారు. మండలంలో జరుగుతున్న దివ్యాంగుల సర్వే కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. మండలంలో ఇప్పటివరకు కొత్తగా 20 వరకు దివ్యాంగ విద్యార్థులను గుర్తించి నమోదు చేసినట్లు చెప్పారు. గ్రామాల్లో ఇంకా మాటలు రాని పిల్లలు, వినికిడి లోపం కల్గిన పిల్లలు, మందబుద్ధి కల్గిన పిల్లలు ఉంటే మండలంలోని ఐఈఆర్టీ టీచర్లకు వివరాలు అందించాలని కోరారు. మండలంలోని దివ్యాంగ విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వం కల్పించిన ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 7981854915 నెంబరును సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో-2 షేక్ అమీర్, ఐఆర్టీ టీచర్లు వెంకటేశ్వర్లు, ఉషా, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి

దర్శి, మే 31: శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని ఎస్సై సుమన్ కోరారు.ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా జూన్ 4న దర్శి పట్టణంతో పాటు అన్నీ గ్రామాల్లో 144 సెక్షన్ విధిస్తున్నట్లు తెలిపారు. ఫలితాల అనంతరం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఫలితాల అనంతరం గెలుపొందిన అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ఊరేగింపులు, బాణసంచా కాల్చటం వంటి కార్యక్రమాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టింగ్‌లు పెడితే కఠిన చర్యలు తీసకుంటామని హెచ్చరించారు.

వృద్ధులకు అన్నదానం

దర్శి, మే 31: మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, లక్ష్మీపద్మావతి దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలను శుక్రవారం దర్శిలో ఘనంగా నిర్వహించారు. శిద్దా కార్యాలయ ఇన్‌చార్జ్ మండాది సుబ్బారావు ఆధ్వర్యంలో స్థానిక షిరిడి సాయిబాబా ఆశ్రమంలోని వృద్ధులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కేకు కట్ చేసి అభిమానులకు పంచారు. కార్యక్రమంలో శిద్దా అభిమానులు పాల్గొన్నారు.

వృద్ధురాలిపై దాడి

కనిగిరి, మే 31: గొర్రెల మేత విషయంలో వృద్ధురాలిపై వ్యక్తి దాడి చేసిన సంఘటన శుక్రవారం మండలంలోని గానుగపెంటలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మర్రి సుబ్బులు అనే వృద్ధురాలు తన గొర్రెలను మేపుకునేందుకు గ్రామ శివారు పొలాల్లోని గురవయ్య కుంట వద్దకు వెళ్ళింది. అదే గ్రామానికి చెందిన రాజు అనే వ్యక్తి కూడ తన గొర్రెలను మేపుకునేందుకు వెళ్ళాడు. ఈక్రమంలో రాజుకు చెందిన గొర్రెలు వృద్ధురాలి గొర్రెలతో కలసిపోయాయి. ఈక్రమంలో ఇద్దరి మధ్య వాగ్వివాదం చోటుచేసుకొని వృద్ధురాలిపై దాడి చేశాడు. దీంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆమె ఫిర్యాదుచేసింది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో టీడీపీకి మద్దతుగా ఓటేశామనే అక్కసుతోనే వైసీపీకి చెందిన రాజు తనపై దాడి చేశాడని వృద్ధురాలి ఆరోపించింది.

అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే కఠినచర్యలు

» సీఐ వెంకటేశ్వరరావు

» పత్రాలు లేని వాహనాలు స్వాధీనం



కార్డన్ సెర్చ్‌లో సీజ్ చేసిన వాహనాలు

కనిగిరి, మే 31: అవాంఛనీయం సంఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ వెంకటేశ్వరరావు హెచ్చరించారు. మండలంలోని చల్లగిరగలలో శుక్రవారం తెల్లవారుజామున కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. పత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ పత్రాలు లేని వాహనాలను, ఆధారాలు లేని వ్యక్తులను అదుపులోకి తీసుకుంటున్నట్లు చెప్పారు. పత్రాలు లేని వాహనాలు ఎక్కడైనా చోరీకి గురైతే ఆయా వాహనాలు సీజ్ చేసి వ్యక్తులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గ్రామాల్లోకి కొత్తవ్యక్తులు సంచరిస్తే తప్పనిసరిగా పోలీసుశాఖకు సమాచారం అందించాలని కోరారు. ఈనెల 4న జరిగే కౌంటింగ్‌లో భాగంగా వెలువడిన గెలుపోటముల మెజార్టీలపై గొడవలకు పాల్పడితే నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామన్నారు. ఈనెల 3నుంచి నుంచి ప్రతి గ్రామంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఎన్నికల నిబంధలలో భాగంగా ఎన్నికల కౌంటింగ్ దృష్ట్యా భారీ బందోబస్తు, నిఘా ఉంటుందన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. ప్రజల ప్రశాంత జీవనానికి భంగం కల్గించే విధంగా ప్రవర్తిస్తే అలాంటి వ్యక్తులను అదుపులోకి తీసుకుంటామన్నారు.

చల్లగిరగల గ్రామంలో జరిగిన కార్డన్‌సెర్చ్‌లో 24 మోటర్‌బైక్‌లు, 22 మోటర్‌సైకిల్స్, ఒక ఆటో, ఒక కారు సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు. ఆయన వెంట ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన ఉగ్ర



రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న డాక్టర్ ఉగ్ర

కనిగిరి, మే 31: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని హైద్రాబాద్‌లో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఇద్దరూ ఎన్నో విషయాలు తన పాత జ్ఞాపకాలను మననం చేసుకుంటూ గడిపారు. ఆ సమయంలో ఏపీలో జరిగిన ఎన్నికల గురించి, పోలింగ్ సరళి గురించి ప్రస్తావించారు. కనిగిరిలో డాక్టర్ ఉగ్ర గెలుపు గురించి చర్చించారు. సీఎంగా రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేసిన తరుణం నుంచి ఏపీలో ఎన్నికల దృష్ట్యా డాక్టర్ ఉగ్ర ఆయనను కలిసేందుకు వీలుపడలేదు. అయినా రేవంత్‌రెడ్డిని ఫోన్‌లో శుభాకాంక్షలు తెలియచేసినా, చిరకాల మిత్రుడిని నేరుగా కలిసేందుకు వెళ్ళడం, ఎంతో ఆప్యాయంగా తనను పలకరించటం తనకెంతో ఆనందాన్ని ఇచ్చిందని, ఇది తనకు మరచిపోలేని అనుభూతి అని తోటి స్నేహితుల వద్ద, ట్విట్టర్‌లో పంచుకున్నారు.

108 మద్యం బాటిళ్లు స్వాధీనం

దొనకొండ, మే 31: మండలంలోని రెండు ప్రాంతాల్లో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా నిల్వ ఉంచిన 108 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సంపత్‌కుమార్ తెలిపారు. దొనకొండలో మల్లంపేట గ్రామానికి చెందిన వడ్లమూడి రమణయ్య వద్ద ఉన్న 43 మద్యం బాటిళ్లు, చందవరం గ్రామంలో శెట్టిబత్తిన కాశయ్య వద్ద ఉన్న 65 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఇరువురిపై కేసులు నమోదు చేసి పూర్తిస్థాయిలో దర్యాప్తు చేప డుతున్నట్లు ఎస్సై తెలిపారు. ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా అన్నీ గ్రామాల్లో విస్తృతంగా తనిఖీలు చేస్తున్నట్లు చెప్పారు.

రేపటి నుంచి గంగాభవాని తిరునాళ్ల

పామూరు మే, 31: మండలంలోని మోపాడు రిజర్వాయర్ వద్ద వెలసియున్న శ్రీ గంగాభవాని దేవస్థానంలోని అమ్మవారి తిరునాళ్ల ఆదివారం నుంచి నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఈ ఉత్సవాలు బుధవారం వరకు జరుగుతాయని పేర్కొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లలో రాగి తీగ చోరీ

ముండ్లమూరు, మే 31: మండలంలోని మారెళ్ళ సమీపంలోని గుండ్లకమ్మ నదిపై నిర్మించిన మారెళ్ళ - 4 ఎత్తి పోతల పథకానికి సంబంధించి నాలుగు ట్రాన్స్‌ఫార్మర్ల రాగి తీగను అపహరించుకు పోయిన సంఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. కొంత మంది రైతులు ఎత్తిపోతల పథకం వద్దకు వెళ్ళి చూడగా తాళాలు పగులగొట్టి ఉండటంతో అనుమానం వచ్చి లోపలకి వెళ్లిచూడగా, ట్రాన్స్‌ఫార్మర్‌లు ధ్వంసంచేసి అందులోని రాగి తీగను అపహరించుకు పోయారు. రూ.20 లక్షల మేర నష్టం జరిగి ఉంటుందని రైతులు తెలిపారు.

సరదా ఆటలు ప్రాణాలమీదకు తెచ్చాయి..

» స్నేహితుల మధ్య వివాదంలో ఒకరికి తీవ్రగాయాలు



గాయపడిన అబుదావలి

కురిచేడు, మే 31: గ్రామాలలో వేసవిలో సరదాగా ఆడుకునే ఆటలు ప్రాణాల మీదకు తీసుకు వస్తున్న సంఘటనలు అరుదుగా జరుగుతున్నాయి. మండలంలోని బోదనంపాడు గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం ఇద్దరు స్నేహితులు ఆంజనేయ స్వామి గుడి వద్ద సరదాగా చింత పిక్కెలతో ఆటలాడుకుంటున్నారు. ఆట మధ్యలో చిన్న వివాదం వచ్చి ఇరువురు గొడవ పడి చివరకు సీసాలతో పొడుచుకోగా ఒకరి పరిస్థితి విషమంగా మారింది.

బోదనంపాడు గ్రామంలోని ఆంజనేయ స్వామి గుడి దగ్గర బస్ షెల్టర్ ఎదురుగా గ్రామస్థులు సరదాగా కూర్చొని ఆటలు ఆడుకుటుంటూ ఉంటారు. శుక్రవారం కూడా అలాగే 108లో పనిచేసే అబుదావలి, అదే గ్రామానికి చెందిన వేమా గోవింద రమేష్‌లు చింత పిక్కెలతో ఆడుకుంటున్నారు. ఆట మధ్యలో సరదా సంభాషణ కాస్తా పక్కదారి పట్టి వివాదం చెలరేగింది. అబుదావలి గోవింద రమేష్‌ను కొట్టబోయి పక్కనే ఉన్న సీసాతో కొట్టాడు. దీంతో రమేష్ ఆగ్రహంతో పక్కనే బీరు బాటిల్‌తో అబుదావలి తలపై బాదాడు. సీసా పగిలి అబుదావలి గాయపడ్డాడు. అదే సమయంలో గోవింద రమేష్ అబుదావలి గొంతు మీద కాలేసి తొక్కి పట్టి ఇష్టం వచ్చినట్లు పగిలిన సీసాతో పొడిచాడు. దీంతో తీవ్రగాయాలపాలైన అబుదావలి అపస్మారక స్థితిలోకి వెళ్ళాడు. వెంటనే అతడిని దర్శి ప్రభుత్వ వైద్యశాలకు చికిత్స కోసం తీసుకెళ్లారు.



సీసాతో పొడిచిన గోవింద రమేష్

మెరుగైన వైద్యం కోసం అబుదావలిని ఒంగోలు రిమ్స్ వైద్యశాలకు తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలియజేస్తున్నారు. సరదాగా ఆడుకునే ఆటలు చివరకు ప్రాణాల మీదకు తెచ్చాయని స్థానికులు అంటున్నారు.

విద్యార్థులు ప్రశ్నించేతత్వాన్ని అలవర్చుకోవాలి

పామూరు, మే 31: స్థానిక కరెంటు ఆఫీసు కాలనీ వడ్డెపాలెం పాఠశాలలో పామూరు చిల్డ్రన్‌క్లబ్ ఆధ్వర్యంలో గత ఐదు రోజులుగా నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపు క్లాసులు శుక్రవారంతో ముగిశాయి. విద్యార్థులకు ఆటలు పాటలు, ఫన్నీ మ్యాక్స్, దేశభక్తి గేయాలు, పొడుపు కథలు, సైన్స్ క్రాఫ్ట్, డ్రాయింగ్, సంబంధించిన విషయాలను నేర్పించారు. పాల్గొన్న విద్యార్థులకు జేవీవీ మండల గౌర వాధ్యక్షుడు డాక్టర్ టి.చెన్నకృష్ణ బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ప్రశ్నించేతత్వాన్ని అలవరుచు కోవాలని సూచించారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు అబ్దుల్, శంకర్, ఐద్వా సంఘం నాయకులు షర్మిల, సరళాదేవి, భానుమతి, అంజలి, తదితరులు పాల్గొన్నారు.

ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు

ముండ్లమూరు, మే 31 : మండలంలోని పలు వాగులు, నదుల నుంచి అక్రమంగా ఇసుక తరలించే నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ జె.మధుబాబు హెచ్చరించారు. శుక్రవారం రెవెన్యూ, మైనింగ్, ఎస్ఈబీ అధికారులు సంయుక్తంగా మండలంలోని పోలవరం సమీపంలో చిలకలేరు, ముండ్లమూరు సమీపంలోని తమ్మలూరు వద్ద చిలకలేరు వాగులను పరిశీలించారు. అనధికార క్వారీలు పరిశీలించారు. ఈసందర్భంగా అధికారులు మాట్లాడుతూ అనుమతి లేకుండా పగలు, రాత్రుళ్లు ఇసుక తరలించే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటుచేసినట్లు చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలించే వారిపై నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో మైనింగ్ విజిలెన్స్ ఆర్ఐ మురళీకృష్ణ, ఎస్ఈబీ ఎస్ఐ కళ్యాణ్, వీఆర్వో జాన్‌లిపి, పున్నారావు తదితరులు పాల్గొన్నారు.

రెచ్చగొట్టే మెసేజ్‌లు పోస్ట్ చేయొద్దు!

పామూరు, మే 31: ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఐటీడీపీ కోఆర్డినేటర్లు సోషల్ మీడియా వేదిక ద్వారా ఎటువంటి కవ్వింపు పోస్టులు పెట్టొద్దని ఎస్ఐ ఎం.మధుబాబు పేర్కొన్నారు. ఈమేరకు ఐటీడీపీ కోఆర్డినేటర్లు ఎం.రామకృష్ణ, కె.రాము, చలపతి, కిశోర్‌కు శుక్రవారం నోటీసులు జారీ చేశారు. ఎస్పీ ఆదేశాలమేరకు నోటీసులు జారీ చేసినట్లు చెప్పారు. సోషల్ మీడియా ద్వారా శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవిధంగా పోస్టులు పెడితే చట్టపరమైన చర్యలు తప్పవని నోటీసుల్లో హెచ్చరించినట్లు ఐటీడీపీ కోఆర్డినేటర్లు తెలిపారు.

మధ్యాహ్న భోజనం రుచిగా, శుచిగా ఉండాలి

కురిచేడు, మే 31: విద్యార్థులకు వండి వడ్డించే మధ్యాహ్న భోజనం రుచిగా, శుచిగా ఉండాలని మండల విద్యాశాఖాధికారి సీహెచ్ సుబ్బారావు కుకింగ్ ఏజన్సీలకు సూచించారు. కురిచేడులోని వైఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలంలోని కుకింగ్ ఏజన్సీల నిర్వాహకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం సూచించిన విధంగా మెనూ అందించాలని ఆయన కోరారు.

పామూరులో అవగాహన ర్యాలీ

పామూరు, మే 31: పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండి ఆరోగ్యంగా జీవించాలని స్వయంకృషి సేవా సంస్థ అధ్యక్షుడు షేక్ నాయబ్‌రసూల్ అన్నా రు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శుక్రవారం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పొగాకు ఉత్పత్తులైన బీడి, సిగరేట్ గుట్కాలు, వాడకం వలన కాన్సర్ లాంటి వ్యాధుల బారిన పడతారని తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య మిత్ర అయాజ్, శేషంమోషే, బత్తుల సత్యనారాయణ, భువనేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వసతులతోపాటు వేతనం పెంచాలి

కనిగిరి (హనుమంతునిపాడు), మే 31: ఉపాధి కూలీలకు పని ప్రాంతాల్లో కల్పించే వసతులతో పాటు వేతనం పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బి.వెంకటేశ్వర్లు అన్నారు. హనుమంతునిపాడు మండలం నల్లగండ్ల గ్రామంలో శుక్రవారం ఉపాధి కూలీలతో ఆయన మాట్లాడారు. మండుతున్న ఎండల్లో కూడా పూట గడవటం కోసం పనిచేస్తుంటే కనీస వసతులు కూడా పని ప్రదేశాల్లో కల్పించటం లేదని ఉపాధి కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉపాధి కూలీలకు సరైన వేతనం అమలు చేయకపోతే ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధి కూలీలు రాజేష్, యెహోవా, సుందర్‌బాబు, మత్తయ్య, ఏసు, నరేష్, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా హనుమాన్ శోభాయాత్ర



దర్శిలో జరిగిన హనుమాన్ శోభాయాత్ర

దర్శి, మే 31: హనుమాన్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని దర్శిలో శుక్రవారం శోభాయాత్ర నిర్వహించారు. పట్టణంలోని పొదిలి రోడ్డులో నుంచి ఆరంభమైన ఈ యాత్ర పట్టణ ప్రధాన వీధుల్లో వైభవంగా సాగింది. భక్తులు హనుమాన్ జెండాలు ధరించి మోటార్ సైకిళ్లపై ఈయాత్ర నిర్వహించారు.

కార్యక్రమంలో బీజేపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాడపాకుల శ్రీనివాసులు, సంగు ఏడుకొండలు, హనుమాన్ భక్తులు పా ల్గొన్నారు.

నేడు హనుమజ్జయంతి

దొనకొండ, మే 31: స్థానిక నాల్గురోడ్ల కూడలిలోని పాపులమ్మ పూర్వ ఆశ్రమావరణలో వెలసిన శ్రీవిజయాంజనేయస్వామి దేవాలయంలో శనివారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త సిరిగిరెడ్డి బాలిరెడ్డి తెలిపారు. ఉదయం 6.30 నుంచి పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయని తెలిపారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మండలంలోని గ్రామా లకు చెందిన ప్రజలు ఈ వేడుకల్లో పాల్గొని స్వామి వారి దీవెనలు, తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ధర్మకర్త బాలిరెడ్డి కోరారు.

ముఠా కార్మికుల ధర్నా



సివిల్ సప్లయీస్ గోడౌన్ వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

దొనకొండ, మే 31: దొనకొండలోని పౌరసరఫరాల శాఖ స్టాక్ పాయింట్ పరిధిలో నుంచి 20 చౌకధరల దుకాణాలను ప్రభుత్వం తొలగించి కార్మికుల పొట్టకొట్టిందని సీఐటీయూ మండల కార్యదర్శి చిరుపల్లి అంజయ్య విమ ర్శించారు. సివిల్ సప్లయీస్ ముఠా యూనియన్ అధ్యక్షుడు గుడిమెట్ల ఆదాము అధ్యక్షతన గోడౌన్ వద్ద శుక్రవారం జరిగిన ధర్నాలో ఆయన మా ట్లాడారు. దొనకొండ, కురిచేడు మండలాల్లోని 20 చౌకధరల దుకాణాలకు ఆహర ధాన్యాల ఎగుమతి, దిగుమతులను దూరప్రాంతాల్లో ఉన్న మార్కా పురం, ఎర్రగొండపాలెం స్టాక్ పాయింట్లలో చేర్చటంతో ఇక్కడ కార్మికుల కు పనులు తగ్గిపోతున్నాయన్నారు.

గత 30 సంవత్సరాలుగా దొనకొండ స్టాక్ పాయింట్ పరిధిలో ఉన్న ఈ రెండు మండలాల దుకాణాలను ఇక్కడ నుంచి తొలగించటంతో 30 మంది కార్మికులు జీవనం కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నిర్ణ యంతో ప్రభుత్వానికి రవాణాభారం అధనంగా పడుతుందని, రేషన్ డీలర్లు ఒకటికి రెండుసార్లు అంతదూరం వెళ్లి స్టాక్ తెచ్చుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సంబంధిత అధికారులు ఈ విషయాలను గుర్తించి గతంలో ఉన్న విధంగానే దొనకొండ స్టాక్ పాయింట్ నుంచే రేషన్ షాపులకు సరుకులు సరఫరా చేసి కార్మికులకు ఉపాధి కల్పించాలని అంజయ్య డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పోరుమామిళ్ల వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు, దారం నరసిం హారావు, శ్రీనివాసరావు, కర్నా హనుమయ్య, కుందుర్తి అనీల్, తదితరులు పాల్గొన్నారు.





● పిడుగురాళ్లలో కవాతు నిర్వహిస్తున్న ఎస్పీ మాలికాగార్గ్, పోలీసు అధికారులు

పోలీసు శాఖ.. కొరడా

- పోలింగ్ హింసపై ప్రత్యేక దృష్టి
- బైండోవర్ ఉల్లంఘించిన వారిపై చర్యలు
- అల్లర్లకు పాల్పడిన 382 మందిపై రౌడీషీట్లు
- శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారు జిల్లా బహిష్కరణ

నరసరావుపేట, మే 31 (ఆంధ్రజ్యోతి): పోలింగ్ రోజు, ఆ తర్వాత పల్నాడులో చోటు చేసుకున్న హింసాకాండపై పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. హింసకు పాల్పడిన వారిపై పోలీసు శాఖ కొరడా ఝుళిపిస్తోంది. ఎన్నికల ముందస్తు చర్యల్లో భాగంగా పోలీసులు జిల్లాలో పది వేల మందికిపైగా బైండోవర్ చేశారు. బైండోవర్‌లో ఉన్న వ్యక్తులు ఎన్నికల సందర్భగా జరిగిన పలు హింసాత్మక సంఘటనల్లో పాల్గొన్నట్లు పోలీసు అధికారులు గుర్తించారు. హింసాత్మక ఘటనల్లో పాల్గొన్న 382 మందిపై రౌడీషీట్లు తెరిచారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిని జిల్లా బహిష్కరణకు పోలీసుశాఖ సమాయత్తమవుతోంది. ఎన్నికల సందర్భంగా ఎటువంటి నేరాలకు పాల్పడమని, నేరాలకు పాల్పడితే తమపై చర్యలు తీసుకోవచ్చని బైండోవర్ సందర్భంగా ఒప్పంద పత్రాలను రెవెన్యూ శాఖ ద్వారా పోలీసు శాఖ స్వీకరించింది. తాము నేరాలకు పాల్పడితే నగదు కూడా చెల్లిస్తామని కూడా అంగీకరించారు. అయితే జిల్లాలో 13, 14 తేదీల్లో జరిగిన హింసాకాండ ఘటనల్లో పాల్గొన్న వ్యక్తులను గుర్తించి వారిపై పోలీసు శాఖ కేసులు నమోదు చేసింది. ఈ ప్రక్రియలో భాగంగా బైండోవర్‌లోని వ్యక్తులు నేరాల్లో పాల్గొన్నరా అన్న అంశంపై పోలీసు శాఖ ప్రత్యేకంగా దృష్టి సారించింది. బైండోవర్‌లో ఉన్న దాదాపు 250 మంది పోలింగ్ హిం స ఘటనల్లో ఉన్నట్టుగా నిర్ధారించి పోలీసులు నోటీసులు చేశారు. బైండోవర్‌ను ఉల్లంఘించిన వారిని మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిచేందుకు చర్యలు తీసుకుంటున్నారు. బైండోవర్ సందర్భంగా తీసుకున్న బాండ్ మేరకు వారి వద్ద సదరు మొత్తం వసూలు చేయనున్నారు. ఒక్క గురజాల పోలీసు డివిజన్‌లోనే 147 మంది బైండోవర్ ఉల్లంఘించి నట్లు పోలీసుశాఖ తెలియజేసింది. నరసరావుపేట, సత్తెనపల్లి పోలీసు డివిజన్ల పరిధిలో దాదాపు 103 మందిని గుర్తించారు. బైండోవర్ సందర్భంగా గతంలో వారు చేసిన నేరాలను, సదరు ప్రాంతాలను పరిగ ణనలోకి తీసుకుని ఒక్కొక్కరి నుంచి రూ.50 వేలు నుంచి రూ.2 లక్షల వరకు బాండ్లు స్వీకరించారు. బాండ్ లో నమోదు చేసిన మేరకు డబ్బు చెల్లించాలని సదరు వ్యక్తులకు నోటీసులు కూడా జారీ చేశారు. ఒక వేళ బాండ్‌లో పేర్కొన్న విధంగా డబ్బు చెల్లించలేకపోతే వారి ఆస్తులను జప్తు చేసేందుకు అధికారులు సమాయత్తం అవుతున్నారు. ఒకవేళ ఆస్తులు లేకుంటే వారెంట్ తీసు కుని జైలుకు పంపే అంశాన్ని పోలీసు శాఖ పరి శీలిస్తోంది.

161 కేసులు 1320 అరెస్టు

పల్నాడు జిల్లాలో పోలింగ్ హింసాత్మక సంఘటనల నేపథ్యంలో పోలీసులు 161 కేసులు నమోదు చేశారు. ఆయా కేసులకు సంబంధించి ఇప్పటి వరకు 1320 మందిని అరెస్టు చేశారు. కేసుల్లో ఉన్న వ్యక్తులను అరెస్టు చేసేందుకు ప్రత్యేక పోలీసు బృందాలను ఎస్పీ మాలికాగార్గ్ నియమించారు. కొత్తగా మరో 1196 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. మాచర్ల నియోజకవర్గంలో 7 ఈవీఎంలను ధ్వంసం చేసిన కేసుల్లో 59 మందిని అరెస్టు చేశారు. పోలింగ్‌కు ముందు రోజు జరిగిన సంఘటనలకు సంబంధించి 33 కేసుల్లో 143 మందిని అరెస్టు చేశారు, పోలింగ్ రోజున 106 కేసుల్లో 883 మందిని, పోలింగ్ తర్వాత రోజు జరిగిన ఘటనల్లో నమోదైన 24 కేసుల్లో 203 మందిని అరెస్టు చేశారు.

నేరస్తులకు హెచ్చరికలు..

నేర చరిత్ర ఉన్న ఏ వ్యక్తి అయినా అదుపుతప్పి ప్రవర్తిస్తూ, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకునేందుకు పోలీసులు సిద్ధమయ్యారు. అలాంటి వారిపై పీడీ యాక్ట్ నమోదు చేసి అవసరమైతే జిల్లా బహిష్కరణ కూడా చేస్తామని హెచ్చరించారు. సోషల్ మీడియాలో విద్వేషాలు రెచ్చగొట్టే సందేశాలు, ఫొటోలు, వీడియోలు పోస్టు చేసే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు. సత్తెనపల్లి టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ రౌడీషీటర్ ఓ రాజకీయ పార్టీ ఆఫీసు వాచ్‌మన్‌పై దాడి చేసి అతడ్ని కొట్టి ఆఫీసును తగల పెడతానని బెదిరించగా ఆ వ్యక్తిని అరెస్టు చేసి జైలుకు పంపించారు.



సత్తెనపల్లిలో పర్యటిస్తున్న సీఐ శ్రీనివాసరావు

కఠినంగా 144 సెక్షన్ అమలు

- అల్లర్లకు పాల్పడితే కఠినంగా చర్యలు
- బాపట్ల, చీరాల, రేపల్లె, అద్దంకిల్లో దుకాణాల బంద్
- అభ్యర్థుల కదలికలపై షాడోపార్టీలు : ఎస్పీ వకుల్‌జిందాల్



మాట్లాడుతున్న ఎస్పీ వకుల్ జిందాల్

బాపట్ల: ఓట్ల లెక్కింపు దృష్ట్యా జిల్లాలో 144 సెక్షన్‌ను జూన్ 3న సాయంత్రం నుంచి కఠినంగా అమలు చేస్తామని ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియపై జిల్లా పోలీసు అధికారులతో శుక్రవారం ఎస్పీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాపట్ల, చీరాల, రేపల్లె, అద్దంకి ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో దుకాణాలు తెరవరాదన్నారు. 3వ తేదీ సాయంత్రం నుంచి కౌంటింగ్ ప్రక్రియ ముగిసే వరకు దుకాణాలు, హోటళ్ళు, ఇతర వ్యాపార సముదాయాలు తెరవడానికి వీలులేదని చెప్పారు. కౌంటింగ్ కేంద్రాల వద్దకు అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లు మినహ ఇతరులు రాకూడదన్నారు. అవాంఛనీయ ఘటనలను ఆదిలోనే కట్టడి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అభ్యర్థుల కదలికలను ఎప్పటి కప్పుడు తెలుసుకునేందుకు షాడోపార్టీలు ఏర్పాటు చేశామన్నారు. ఐదు డ్రోన్లతో పటిష్ఠ నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎవరైనా అల్లర్లకు, ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాజకీయ పార్టీల కార్యకర్తలు, ప్రజలు అభ్యర్థుల ఇంటి వద్దకు, పార్టీ కార్యాలయాలకు వెళ్లరాదన్నారు. కౌంటింగ్ ముందు రోజు, కౌంటింగ్ రోజు, ఆ తర్వాత రోజు పోలీసు ఆదేశాలను మీరి గుంపులుగా చేరి అవాంఛనీయ ఘటనలు, ఘర్షణలకు పాల్పడిన వారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా ఘర్షణలకు పాల్పడే అవకాశం ఉంటే గుర్తించి వారిని బైండోవర్ చేయాలన్నారు. చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తామన్నారు. రాళ్ళు, కర్రలు, ఇనుపరాడ్లు, ఇతర మారణాయుధాలు ఉంటే ఆ వాహనాన్ని సీజ్ చేసి పై అధికారులకు సమాచారం అందించాలన్నారు. పోలీసు సిబ్బంది లాఠీ, హెల్మెట్ తప్పనిసరిగా దగ్గర ఉంచుకోవాలన్నారు. జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా విధులు నిర్వహించడానికి పోలీసు అధికారులకు సూచనలు చేశారు. సమావేశంలో ఏ ఎస్పీ విఠలేశ్వరరావు, డీఎస్పీలు పాల్గొన్నారు.



● దాచేపల్లిలో అనుమతులు లేని విత్తనాలను గుర్తించిన విజిలెన్స్ అధికారులు (పాత చిత్రం)

అమ్మకాలు.. తనిఖీలు

- విత్తనాలపై వ్యవసాయశాఖ హడావుడి
- రైతుల చేతికి అందాక రంగంలోకి అధికారులు
- వేటికి అనుమతులున్నాయో లేవో తెలియక రైతులకు నష్టం
- ఏటా ఆలస్యంగా మేల్కొంటున్న యంత్రాంగం.. వ్యాపారులకు వరం

పిడుగురాళ్ల, మే 31: వరుణుడు కరుణిస్తున్నాడు. సాగుకు రైతులు సమాయత్తమవుతున్నారు. వివిధ రకాల విత్తనాలను వ్యాపారులు ఎప్పటి నుంచే అమ్మకాలు చేస్తున్నారు. ధరలు పెరుగుదల, కొరత తదితరాల నేపథ్యంలో రైతులు ముందుగానే విత్తనాలను కొనుగోలు చేసి తెచ్చిపెట్టుకున్నారు. అయితే ఇప్పుడిప్పుడే వ్యవసాయశాఖ మేల్కొంటోంది. నకిలీ విత్తనాలను తేల్చేందుకు అధికారులు రంగంలోకి దుకాణాల్లో తనిఖీలు మొదలుపెట్టారు. చాలావరకు విత్తనాలు రైతుల వద్దకు చేరిపోయాక ఇప్పుడు తనిఖీల వల్ల లాభం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఏవి అసలు.. ఏవి నకిలీ.. వేటి వల్ల లాభం.. అనే విషయాలపై రైతుల్లో గందరగోళం ఉంది. విత్తనాల గురించి రైతులకు చెప్పేవారే లేకుండా పోయారు. వ్యాపారులు చెప్పినట్లు చాలాదగ్గర్ల రైతులు విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు. తీరా ఆరుగాలం కష్టపడి చివర్లో దిగుబడి రాక లబోదిబోమంటూ రైతులు రోడ్డెక్కడం ప్రతీ ఏటా పరిపాటిగా మారుతోంది. అయినా వ్యవసాయశాఖ విత్తనాల విషయంలో రైతులకు మేలు చేసే ఆలోచనే చేయడం లేదు. వ్యాపారులకు, విత్తనాల ఉత్పత్తిదారులకు మేలు చేసేలా అధికారుల చర్యలు ఉంటున్నాయన్న విమర్శలు, ఆరోపణలు వస్తున్నా ప్రభుత్వంలో కనీస స్పందన ఉండటంలేదు. కొందరు వ్యాపారులు దిగుబడుల ఆశచూపి రైతులకు విత్తనాలను అంటగడుతున్నారు. తమకు ఎక్కువ కమీషన్ ఇచ్చే కంపెనీల విత్తనాల విక్రయాలపైనే వ్యాపారులు ఆసక్తి చూపుతున్నారు. ఈ క్రమంలో ఖరీఫ్ సీజన్‌కు ముందే కొందరు వ్యాపారులు విత్తనాల అమ్మకాలు ప్రారంభిస్తున్నారు. ధరలు పెరుగుతాయని, స్టాక్ అయిపోతుందన్న భ్రమచూపి కొందరు వ్యాపారులు సిండికేట్‌గా తయారై రైతులకు విత్తనాలను అంటగడుతూ సొమ్ము చేసుకుంటున్నారు. అనుమతులతో సంబంధం లేకుండానే వ్యాపారులు యథేచ్ఛగా అమ్మకాలు చేస్తున్నారు. అయినా వ్యవసాయశాఖ అధికారులు తమకేమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. గత ఏడాది గురజాల మండలం పల్లెగుంతలో కొందరు రైతులు ఓ కంపెనీకి చెందిన పత్తి విత్తనాలను సాగు చేసి తీవ్రంగా నష్టపోయారు. బాధిత రైతులు వ్యవసాయశాఖకు ఫిర్యాదు చేసి ఆందోళన చేశాక కంపెనీ యాజమాన్యం పరిహారం చెల్లించింది. ఇదేదో సీజన్‌కు ముందే అధికారులు తనిఖీలు చేపట్టి విత్తనాలపై రైతులకు అవగాహన కల్పిస్తే మేలు చేసినట్లు. కానీ ఆ దిశగా అటు అధికారులు ఇటు ప్రభుత్వం చర్యలు ఉండటంలేదు.

అధికారుల తీరు ప్రశ్నార్థకం

సీజన్ ప్రారంభ దశలో విత్తనాల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించాల్సిన వ్యవసాయశాఖ మొక్కుబడిగా వ్యవహరిస్తోంది. ఏఏ విత్తనాల కంపెనీల విత్తనాలకు అనుమతులు ఉన్నాయి.. వాటి గడువు తదితర వివరాల బహిరంగ పర్చకుండానే వ్యాపారులు అమ్మకాలు సాగిస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో అమ్మకాలకు అనుమతి లేని పత్తి, మిరప విత్తనాలను కూడా గత ఏడాది పలు ప్రాంతాల్లో యథేచ్ఛగా విక్రయించారు. అంతా అయిపోయిన తర్వాత విజిలెన్స్ అధికారులు వరుసదాడులకు దిగడంతో పల్నాడులో వివిధ ప్రాంతాల్లో అనుమతులు లేని విత్తనాలను రైతులకు అమ్మేసిన విషయాన్ని గుర్తించింది. అయితే అప్పటికే ఆ విత్తనాలతో రైతులు సాగు చేపట్టారు. ఈ ఏడాది కూడా ఇదే పునరావృతమైంది. అనుమతులు లేకుండా అమ్ముతున్న విత్తనాలను దాచేపల్లిలో రెండు రోజుల క్రితం విజిలెన్స్ అధికారులు గుర్తించారు. విజిలెన్స్ అధికారులు వచ్చి పల్నాడులో అనుమతులులేని విత్తనాలను గుర్తిస్తుంటే స్థానికంగా ఉండే వ్యవసాయశాఖ అధికారుల తీరు ప్రశ్నార్థకంగా మారింది. కొందరు వ్యవసాయశాఖ అధికారులు తనిఖీలకు వెళ్లకుండానే పుస్తకాలను కార్యాలయానికి తెప్పించుకుని తనిఖీలు పూర్తయినట్లుగా ముద్ర వేస్తున్నారన్న ఆరోపణలు న్నాయి. ఏదో మొక్కుబడిగా ముందే సమాచారం ఇచ్చి ఎంపిక చేసుకున్న దుకాణాల్లో తనిఖీలతో మమ అనిపించి చేతులు దులుపుకుంటున్న అధికారులు కూడా ఉన్నారు. తనిఖీల పేరిట మామూళ్లను సీజన్‌కు ముందే వసూలు చేసుకుంటున్న వ్యవసాయ అధికారులు ఉన్నారు.



పిడుగురాళ్ల వ్యవసాయశాఖ విత్తన పరీక్షా కేంద్రం

నిబంధనలు పాటించని వ్యాపారులు

విత్తన దుకాణాల ముందు అనుమతులు పొందిన కంపెనీ వివరాలు, నిల్వలు, ధరల పట్టికను బోర్డుపై రాసి బహిరంగంగా ఉంచాలి. ఈ నిబంధనలను కొందరు అధికారులు మామూళ్ల మత్తులో పడి పట్టించుకోవడంలేదు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో చాలా దుకాణాల వద్ద వివరాలు తెలిపే పట్టిక బోర్డును ప్రదర్శిస్తున్న దాఖలాలు లేవు. అనుమతులు లేని విత్తనాలను అంటగడుతున్న దుకాణాలపై చర్యలు తీసుకోవడంలో వ్యవసాయశాఖ మీనమేషాలు లెక్కిస్తుంది. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకున్న విత్తనాలకు అనుమతులు ఉండటంలేదు. ఆయా విత్తనాల కొనుగోలు తరువాత రశీదులు కూడా ఇవ్వకపోవడంతో దిగుబడి, పంట నష్టం జరిగిన సమయంలో తగిన పరిహారం పొందేందుకు రైతులు తంటాలు పడాల్సి వస్తుంది.

86 పీహెచ్‌సీలు 8 కాన్పులు..

- ఉద్యోగులపై వైద్య ఆరోగ్య శాఖ కొరఢా
- విధుల నుంచి ముగ్గురు స్టాఫ్‌నర్సుల ఉద్వాసన
- ఆస్పత్రి ప్రసవాలపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి
- అధికారుల చర్యలతో హడలిపోతున్న క్షేత్రస్థాయి సిబ్బంది
- రాష్ట్ర స్థాయి ఆరోగ్య సూచీల్లో వెనకబడిన ఉమ్మడి గుంటూరు జిల్లా

గుంటూరు సిటీ, మే 31: ఉమ్మడి గుంటూరు జిల్లా 86 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. అయితే కేవలం 8 ప్రసవాలే జరిగాయి. ఆపరేషన్లు వద్దు.. ప్రసవాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని అధికారులు ఆదేశిస్తున్నారు. అయితే ఆస్పత్రి ప్రసవాలపై క్షేత్రస్థాయి సిబ్బంది నిర్లక్ష్యంగా ఉన్నారని.. అందువల్లే ప్రసవాలు జరగడంలేదని అధికారులు భావించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో అత్తలూరు, ఈపూరు, పొన్నూరు పీహెచ్‌సీల్లో ఒక్కోటి, ఈమనిలో రెండు, వెల్లటూరులో మూడు చొప్పున ఆస్పత్రి ప్రసవాలు జరిగాయి. ఇవి మినహా మిగిలిన కేంద్రాల్లో కాన్పుల జాడే లేదు. కొన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో గత ఆరు నెలల కాలంలో కనీసం ఒక్కటంటే ఒక్కటి కూడా ఆస్పత్రి ప్రసవం జరగలేదు. దీంతో ఉన్నతాధికారులకు చర్యలకు సిద్ధమయ్యారు. ఆస్పత్రి ప్రసవాలు చేయడంలో వెనుకబడిన ముగ్గురు స్టాఫ్ నర్సులను విధుల నుంచి పూర్తిగా తొలగిస్తూ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆదేశాలు ఇవ్వడం సంచలనంగా మారింది. గడచిన నెలలో ఆస్పత్రి ప్రసవం ఒక్కటి కూడా చేయనందుకు బాపట్ల జిల్లా పెరవలికి చెందిన సీహెచ్ మాణిక్యం, బీ సువర్చల, ప్రకాశం జిల్లా అమ్మనబ్రోలుకు చెందిన జీ మేరీమమతను ఉద్యోగం నుంచి తొలగిస్తూ గురువారం రాత్రి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ ముగ్గురు కూడా సీనియర్ స్టాఫ్ నర్సులు కావడం గమనార్హం. ఆస్పత్రి ప్రసవాలపై మే 25న నిర్వహించిన సమీక్షలోనే సదరు స్టాఫ్ నర్సులను విధుల నుంచి తొలగించాలని అధికారులను కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆదేశించారు. ఆస్పత్రి ప్రసవాల విషయంలో ఉన్నతాధికారులు సీరియస్‌గా ఉండటంతో క్షేత్రస్థాయి సిబ్బంది హడలిపోతున్నారు. దీంతో వైద్యఆరోగ్య శాఖ ఉద్యోగులకు 'డెలివ'రీ' ఫీవర్ పట్టుకుంది.

అసలు బోణి కొట్టని ఆస్పత్రులెన్నో..

రాష్ట్ర స్థాయి ఆరోగ్య సూచీల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా బాగా వెనకబడింది. ఆస్పత్రి ప్రసవాల్లో అట్టడుగు స్థాయికి పడిపోయింది. ఉమ్మడి జిల్లాలో సుమారు 50 పీహెచ్‌సీలు 24 గంటలు తెరిచే ఉంటున్నాయి. ఆయా కేంద్రాల్లో అనుభవం కలిగిన వైద్యులతో పాటు కాన్పులకు అన్ని రకాల వసతులు కూడా ఉన్నాయి. నియోనేటల్ కేర్ యూనిట్లు కూడా అందుబాటులో ఉన్నాయి. అయినా ఆస్పత్రి ప్రసవాలు జరగకపోవడం గమ నార్హం. ఒకటి అర ప్రసవాలకు ఆస్పత్రికి వచ్చినా వైద్యులు తగిన రీతిగా స్పందించక పోవడంతో వచ్చిన కేసులు కూడా ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంటుంది. డాక్టర్లు లేకుండా కాన్పు చేస్తే ఆ తర్వాత సమ స్యలు వస్తాయన్న భయంతో స్టాఫ్ నర్సులు సాహసం చేయడం లేదని సమాచారం.

ప్రైవేటుకు వెళ్తే కోతే కోత

గర్భిణులు ప్రైవేటు ఆస్పత్రికి వెళ్తే అన్ని విధాలా నష్ట పోతున్నారు. అక్కడ చాలా సందర్భాల్లో సహజ ప్రసవం జరిగే అవకాశం ఉన్నప్పటికీ ఆపరేషన్ చేసి బిడ్డను తీస్తున్నారు. ఈ ఆపరేషన్ కోసం రూ.40 వేల నుంచి రూ.70 వేల వరకు వసూలు చేస్తున్నారు. ఇదే కాన్పు ప్రభుత్వ ఆస్పత్రిలో జరిగితే ప్రభుత్వమే తల్లికి రూ.5 వేల వరకు చెల్లిస్తుంది. ప్రభుత్వ ఆస్పత్రిలో ఉన్న స్టాఫ్ నర్సులు చాలా వరకు సాధారణ ప్రసవం కొరకు ప్రయత్నం చేస్తారు. ఈ విషయం తెలిసి చాలామంది ప్రభుత్వ ఆస్పత్రికి మొగ్గు చూపుతున్నా వైద్యుల నిర్లక్ష్యం వల్ల కేసు లు వెనక్కి పోతున్నాయి.

కేంద్రాలకు దూరంగా నివాసం

ఆస్పత్రిలో ప్రసవాలు జరగకపోవడానికి ప్రధాన కారణం వైద్యులు అందుబాటులో లేకపోవడమే. చా లా మంది వైద్యులు ఉద్యోగం చేసే ప్రాంతానికి చాలా దూరంలో నివాసం ఉంటున్నారు. గుంటూరు నుంచి జిల్లాలోని నలుమూలలకు వెళ్లి వస్తున్నారు. డాక్టర్ దగ్గరలో లేరన్న సమాధానం ఎక్కువగా వినపడుతుండటంతో ఎక్కువ మంది పీహెచ్‌సీల్లో కాన్పులకు రావడానికి భయపడుతున్నారు. ఆస్పత్రిలో ప్రసవాలు జరగాలంటే అందరి పాత్ర ఉండాలని స్టాఫ్ నర్సులు అంటున్నారు. కేసు ఆస్పత్రికి వస్తే కదా తాము కాన్పులు చేసేదని వారు పేర్కొంటున్నారు. డాక్టర్లు అందుబాటు లో లేకుండా మొత్తం బాధ్యత తమకు అప్పగిస్తే కాన్పు సమయంలో తలెత్తే సమస్యలను తాము ఏ రీతిగా కట్టడి చేయగలమని ప్రశ్నిస్తున్నారు. అందరినీ వదిలి పెట్టి తమపై చర్యలు సహేతుకం కాదని వారంటున్నారు.

ఓటుతో.. ఓటమి



- పాలక పార్టీకి ఉద్యోగులు వ్యతిరేకం
- వారి వ్యతిరేక ఓటుతో అధికార మార్పిడి
- ఈ దఫా అదే జరగనున్నదని సంఘ నేతల ధీమా

గుంటూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగుల వ్యతిరేక ఓటుతో పాలక పార్టీలు ఓటమి బాట పట్టాయి. ప్రతీసారీ ప్రభుత్వాలు మారాయి. 2009 మినహా అంతకముందు, ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో ప్రభుత్వ ఉద్యోగులు రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీకి వ్యతిరేకంగా ఓటు వేయడం ప్రభుత్వాలు మారడం జరిగింది. ఓటింగ్ విధానంలో ఈవీఎంలు ప్రవేశపెట్టిన 2004 నుంచి చూసుకుంటే ఇదే పరిస్థితి పునరావృతమౌతూ వస్తున్నది. ప్రభుత్వ ఉద్యోగులు ఏ పార్టీ వైపు ఎక్కువగా మొగ్గు చూపితే ఆ పార్టీనే ఎన్నికల్లో గెలుపొందుతోన్నది. ఈ దఫా కూడా అదే పరిస్థితి పునరావృతం అవుతుందన్న అభిప్రాయం సర్వత్రా నెలకొన్నది. ఈ నేపథ్యంలో ఎన్నికలకు రెండు, మూడు నెలలు ముందు తమదే అధికారం అని బెట్టింగ్‌లకు పాల్పడిన వైసీపీ నేతలు కౌంటింగ్ రోజున వెలువడే ఫలితాలతో నష్టపోకుండా ఉండేందుకు ఇప్పుడు టీడీపీ తరఫున పందేలు కాస్తున్నట్లు సమాచారం. టీడీపీకి వ్యతిరేకంగా బెట్టింగ్‌రాయుళ్లు రాకపోతుండటంతో రూ.లక్షకు రూ.2 లక్షలు ఇస్తామని వల వేస్తున్నారు. 2004 సార్వత్రిక ఎన్నికలకు ముందు వీడియో కాన్ఫరెన్స్‌ల ద్వారా ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం తమని ఇబ్బంది పెడుతున్నదని ఉద్యోగులు వ్యతిరేకత పెంచుకున్నా రు. జన్మభూమి, అభివృద్ధి పనుల నాణ్యత తనిఖీలతో స్పాట్ సస్పెన్షన్లు, టీచర్ల బదిలీలు, పని ప్రదేశంలోనే నివాసం ఉండాలన్న నిబంధన వంటి కారణాలతో ఆ ఎన్నికల్లో టీడీపీకి వ్యతిరేకంగా ఓటు వేశారు. దాంతో ఆ ఎన్నికల్లో టీడీపీ ఓటమి పాలైంది. 2009 ఎన్నికలు వచ్చేసరికి ఏ కారణం చేతనో అప్పటి వైసీపీ ప్రభు త్వానికి అనుకూలంగా ఉద్యోగులు ఓటు వేశారు. 2014 సార్వత్రిక ఎన్నికలు వచ్చేసరికి అప్పటివరకు అధికారంలో ఉన్న కాంగ్రెస్ రాష్ట్రాన్ని చీల్చింది. దీనిపై ఉద్యోగ సంఘాల నాయకులే పెద్దఎత్తున ఉద్యమించారు. విడిపోయిన రాష్ట్రాన్ని చంద్రబాబునాయుడు అయితే ముందుకు తీసుకెళ్లారని విశ్వసించారు. దాంతో ఎన్‌డీఏ కూటమికి అండగా నిలిచారు. 2019 వచ్చే సరికి ఉద్యోగులు టీడీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేశారు. తెలంగాణ కంటే మెరుగైన ఫిట్‌మెంట్ చంద్రబాబు ఇచ్చారు. అయినా సీపీఎస్ రద్దు చేస్తానన్న ఒకే ఒక్క హామీతో వైసీపీకి ఓటు వేశారు. దాంతో ఆ ఎన్నికల్లో వైసీపీ ప్రభంజనం సాగింది. అయితే వైసీపీ ప్రభుత్వం మాట తప్పడంతో పాటు సకాలంలో జీతాలు, పింఛన్లు ఇవ్వకపోవడం, ఫేస్ రికగ్నిజేషన్ యాప్ ద్వారా హాజరు తీసుకురావడం, సచివాలయాల వ్యవస్థ తీసుకొచ్చి ఉద్యోగులకు ప్రాధాన్యం లేకుండా చేయడం తదితర కారణాలతో రకరకాల ఆందోళనలతో తమ వ్యతిరేకతని ఏడాది క్రితం నుంచే చూపిస్తున్నారు. ఎన్నికల నాటికి అది తారాస్థాయికి చేరింది. పోస్టల్‌బ్యాలెట్ ఓట్ల రూపంలో ప్రభుత్వంపై అసంతృప్తిని వ్యక్తం చేశారు. దీంతో ఈఎన్నికల్లో వైసీపీకి ఓటమి తప్పదన్న అభిప్రాయం సర్వత్రా నెలకొన్నది. తాము ఎటు నిలిస్తే ప్రజలు కూడా అటు వైపే ఉంటూ వస్తున్నారని ఉద్యోగసంఘాల నాయకులు ధీమా కనబరుస్తున్నారు.

ఎండల్లో.. తరగతులా?

- నేటి నుంచి ఇంటర్ క్లాసులు ప్రారంభం
- వేసవి దృష్ట్యా భయపడుతున్న విద్యార్థులు
- ఆదివారం.. రెండో విఘ్నం ఉండరాదని కళాశాల

గుంటూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల అనంతరం ఇంటర్మీడియల్ కళాశాలలు శనివారం నుంచి తెరుచుకోనున్నాయి. ఇప్పటికే దీనికి సంబంధించిన సమాచారాన్ని కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు చేరవేశాయి. శని, ఆదివారాల్లో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు తరగతులు నిర్వహి స్తామని తెలిపాయి. ఆదివారం సెలవుదినం కదా అని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తే ద్వితీయ విఘ్నం ఉండకూడదని క్లాసులు నిర్వహిస్తున్నామని సమాధానం. కాగా ఒకపక్క 45 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత, సెగలు గక్కుతున్న వాతావరణం, వడగాడ్పులతో ప్రజలు అల్లాడుతున్న సమయంలో కళాశాలలు తెరుస్తుండటంపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఈ దఫా రోహిణి కార్తె ముందువరకు ఎండల తీవ్రత కాస్త తక్కువగానే ఉన్నది. ఎప్పుడైతే మే 25న రోహిణి కార్తె వచ్చిందో ఆ రోజు నుంచి ఎండ భగ్గుమంటోన్నది. రాత్రి అయినా వాతావరణంలో వేడి ఏమాత్రం తగ్గడం లేదు. ఉదయం 8 గంటలకు మొదలు సాయంత్రం 4 గంటల వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటున్నది. మధ్యాహ్నం అడుగు బయట పెట్టాలంటే భయపడిపోయే పరిస్థితి. జూన్ 9 తర్వాత ఎండలు తగ్గుముఖం పడతాయని వాతావరణ శాఖ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు ఈ నెల 4న ఓట్ల లెక్కింపు, 8న రెండో శనివారం. ఈ దృష్ట్యా జూన్ 10 నుంచి తరగతులు ప్రారంభిస్తే విద్యార్థులకు ఇబ్బంది ఉండదన్న అభిప్రాయాన్ని వారి తల్లిదండ్రులు వ్యక్తపరుస్తున్నారు. రెండో విఘ్నం ఉండరాదని ఆదివారం తరగతులు నిర్వహణపై ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు ఆయా కళాశాలలపై చర్యలు తీసుకోవాలంటున్నారు.

చంద్రబాబును కలిసిన గరటయ్య


చంద్రబాబునాయుడుకు పుష్ప గుచ్ఛం అందజేస్తున్న గరటయ్య

అద్దంకి, మే31: టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ సీఎం నారా చంద్రబాబు నాయుడును టీడీపీ బాపట్ల పార్లమెంట్ ఎన్నికల కోఆర్డినేటర్, అద్దంకి మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచుగరటయ్య శుక్రవారం సాయంత్రం హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా 13 వ తేదీ బాపట్ల పార్లమెంట్ పరిధిలో ఓటింగ్ సరళి గురించి చంద్రబాబుకు వివరించినట్లు గరటయ్య తెలిపారు.

శీనారెడ్డిపై ఫిర్యాదును స్వీకరించిన సీవీసీ

» నంబర్‌ను కేటాయించి ఫిర్యాదుదారునికి సమాచారం

» కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని పురందేశ్వరిని కోరిన మోహన్


పురందేశ్వరికి శీనారెడ్డి అవినీతి చర్యలనువివరిస్తున్న ఈదర మోహన్

ఒంగోలు, మే 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్‌గా కె.శీనారెడ్డి పనిచేసిన కాలంలో భారీగా అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని డీసీసీబీ మాజీ చైర్మన్ ఈదర మోహన్ చేసిన ఫిర్యాదుపై కేంద్ర విజిలెన్స్ కమిషన్ స్పందించింది. ఈనెల 25న ఫిర్యాదును మోహన్ కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ, సీవీసీలకు పంపించారు. దాన్ని స్వీకరించి 59417/2024 నంబరును కూడా కేటాయించినట్లు ఫిర్యాదుదారు అయిన మోహన్‌కు శుక్రవారం సీవీసీ నుంచి సమాచారం వచ్చింది. త్వరలో విచారణ చేయనున్నట్లు పేర్కొంది.

ఇదిలా ఉండగా శీనారెడ్డి అవినీతి, అక్రమాలను శుక్రవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, కేంద్ర మాజీ మంత్రి దగ్గుబాటి పురందేశ్వరి దృష్టికి మోహన్ తీసుకెళ్లారు. కేంద్రానికి లేఖ రాసి విచారణ చేయించాలని కోరారు. దీనిపై పురందేశ్వరి సానుకూలంగా స్పందించినట్లు సమాచారం.

నేటి నుంచి జూనియర్ కళాశాలలు పునఃప్రారంభం

ఒంగోలు (విద్య), మే 31 : జిల్లాలోని అన్ని యాజమాన్యాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జూనియర్ కళాశాలలు వేసవి సెలవుల అనంతరం శనివారం నుంచి పునఃప్రారంభమవుతున్నట్లు ఇంటర్మీడియేట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ఎ.సైమన్ విక్టర్ తెలిపారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు శనివారం నుంచే తరగతులు జరుగుతాయన్నారు. మొదటి సంవత్సరం విద్యార్థుల అడ్మిషన్లు మొదలవుతాయని చెప్పారు.

ఉత్తరప్రదేశ్ లారీ డ్రైవరు మృతి


కల్యాణ్ సింగ్ (ఫైల్)

మార్టూరు, మే 31: పచ్చి మిర్చి కూరగాయల మార్కెట్‌లో శుక్రవారం తెల్లవారుజామున ఉత్తరప్రదేశ్‌కు చెందిన లారీ డ్రైవరు కల్యాణ్ సింగ్ (40) మృతి చెందాడు. మృతుడిది ఉత్తరప్రదేశ్‌లోని లలిత్‌పూర్ జిల్లా చిల్లాక్ గ్రామం. పోలీసుల సమాచారం మేరకు ఈ నెల 28 వతేదీన ఉత్తరప్రదేశ్ రాష్ట్రంనుంచి బంగాళా దుంపలను లారీలో లోడ్ చేసుకొని గురువారం అర్ధరాత్రి సమయంలో మార్టూరు పచ్చిమిర్చి మార్కెట్‌కు వచ్చాడు. అతనితో పాటు వరుసకు మేనల్లుడు అ య్యే యువకుడు క్లీనరుగా వచ్చాడు. అయితే రాత్రి సమయంలో లారీ నుంచి దుంపలను దించడానికి ముఠా కూలీలు లేక పోవడంతో ఉదయాన్నే కూలీలు వస్తారని అప్పటి వరకు వేచి ఉండాలనే ఉద్దేశంతో లారీని మార్కెట్ లోనే ఉంచి క్లీనరు లారీ క్యాబిన్‌లో, డ్రైవరు సమీపంలోని చెట్టు కింద బండపై నిద్ర పోయారు. తెల్లవారు జామున 4 గంటల సమయంలో డ్రైవరుకల్యాణ్ సింగ్ నిద్రలేసి కొంచెం నుస్తీగా ఉందని క్లీనరుకు తెలిపాడు. అనంతరం మళ్లీ నిద్రపోయిన డ్రైవరును ఉదయం 6 గంటల సమయంలో లేపడానికి క్లీనరు ప్రయత్నించగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించాడు. అతను గుండెపోటు లేదా వడ దెబ్బకు మృతి చెంది ఉంటాడని మార్కెట్‌లోని కూలీలు భావిస్తున్నారు. ఈ విషయాన్ని క్లీనరు ఉత్తరప్రదేశ్‌లోని బంధువులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టు మార్టమ్ నిమిత్తం శుక్రవారం మధ్యాహ్నం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఇవేం షీట్లు..!

» ఏకపక్ష వైఖరిని కప్పిపుచ్చుకునేందుకే రౌడీషీట్లు

» బాధితులనూ ఇరికించారు..

» ఒంగోలులో 137 మందిపై తెరిచారు..

» సమతానగర్, వెంగముక్కలపాలెం ఘటనలే కారణం

» వారి కదలికలపై నిఘా

» ఇప్పటికే అజ్ఞాతంలోకి కొందరు


ఇటీవల ఒంగోలులో జరిగిన దాడి(ఫైల్)

ఒంగోలు సమతానగర్‌లో వైసీపీ నేతలు జనంపై రౌడీయిజం చేశారు. ప్రచారంలో వలంటీర్ ఉందని ప్రశ్నించిన సామాన్య కుటుంబంపై దాడి చేశారు. విషయం తెలుసుకుని అక్కడికి వెళ్లిన టీడీపీ నేతను నడిరోడ్డుపై చితకబాదారు. పోలీసులు అక్కడికి చేరుకున్నా ప్రేక్షపాత్ర వహించారు. ఈ ఘటన గతనెల 10న చోటుచేసుకుంది.

సమతానగర్‌లో గాయపడిన వారిని తీసుకొని టీడీపీ ఒంగోలు అభ్యర్థి దామచర్ల జనార్దన్ ఎస్పీని కలిశారు. అనంతరం వారిని చికిత్స కోసం ఒంగోలు రిమ్స్‌కు తీసుకెళ్లారు. అక్కడికి వైసీపీ అభ్యర్థి బాలినేని శ్రీనివాసరెడ్డి, ఆయన కుమారుడు, ప్రణీత్‌రెడ్డి అనుచరులతో చేరుకొని వీరంగం సృష్టించారు. వైసీపీ మూకలు అక్కడ ముఖద్వారం అద్దాలు పగులగొట్టాయి. ఆసుపత్రిలో భీతావహ వాతావరణాన్ని సృష్టించాయి. అక్కడే ఉన్న పోలీసులు నిస్సహాయంగా ఉండిపోయేరే కానీ వారిని వారించలేదు.

ఈ రెండింటితోపాటు పోలింగ్ రోజు వెంగముక్కలపాలెంలో చోటుచేసుకున్న ఘటనకు సంబంధించి పోలీసుల తీరు అనేక విమర్శలకు తావిచ్చింది. కేసుల నమోదులో పక్షపాతంగా వ్యవహరించారన్న ఆరోపణలు వచ్చాయి. బాధిత కుటుంబ పెద్దను ఉద్యోగం నుంచి సస్పెండ్ చేయడాన్ని పలువురు ఆక్షేపించారు. ఈ ఘటనలకు సంబంధించి పోలీసులు తాజాగా 137 మందిపై రౌడీషీట్లు తెరవడం వివాదాస్పదమైంది. అందులో 75 మంది వైసీపీ, 62 మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. కేవలం ఒక్క కేసు ఆధారంగా పోలీసులు వీటిని తెరవడం విస్మయం కలిగిస్తోంది. వారిలో బాధితులు కూడా ఉండటం విడ్డూరంగా ఉంది. రౌడీషీట్లు తెరిచి తమ చేతగాని తనాన్ని కప్పిపుచుకున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అయితే పోలీసులు మాత్రం ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకే రౌడీషీట్లు తెరిచామని చెప్తున్నారు.

ఒంగోలు (క్రైం), మే 31: బాధితులకు న్యాయం చేయాల్సిన పోలీసులు వారిపైనే రౌడీషీట్లు తెరిచారు. ఒంగోలు సమతానగర్‌లోనూ, అనంతరం రిమ్స్ వద్ద వైసీపీ నేతలు వీరంగం సృష్టించగా ఆ ఘటనలకు సంబంధించి బాధితులు, టీడీపీ నేతలపైనా కేసులు నమోదు చేశారు. అలాగే పోలింగ్ రోజు వెంగముక్కలపాలెంలోని ఒక బూత్‌లో టీడీపీ ఏజెంట్‌పై వైసీపీ నేతలు దాడి చేయడంతోపాటు అదేరోజు రాత్రి ఎస్సీ కాలనీలో ఆమె ఇంటి వద్దకు వెళ్లి బీభత్సం సృష్టించారు. అయితే పోలీసులు బాధితులపైనా కేసులు పెట్టారు. ఇప్పుడు ఈ మూడు ఘటనల్లో ఉన్న 137 మందిపై రౌడీషీట్లు తెరిచారు. ఒకే ఒక్క కేసులో ఉన్న వారిపై ఇలా రౌడీషీట్లు తెరవడం ఇదే మొదటిసారి కావడంతో దీనిపై చర్చ జరుగుతోంది.

సమతానగర్‌లో ఏం జరిగిందంటే..

నగరంలోని సమతానగర్‌లో గతనెల 10వతేదీ రాత్రి వైసీపీ శ్రేణులు ఎన్నికల ప్రచారం నిర్వహించాయి. ఈ సందర్భంగా సమతానగర్ మొదటి లైనులో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి కోడలు ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించడం ప్రారంభించారు. అందులో భాగంగా హిమశ్రీ అపార్ట్‌మెంట్‌లోని 2వ అంతస్తులో నివాసం ఉంటున్న చప్పిడి ప్రభావతి ఇంటికెళ్లిన వైసీపీ శ్రేణులు ఓట్లు అభ్యర్థించారు. అయితే ప్రచారంలో వలంటీర్ పాల్గొనడంతో ఆమె రావడమేమిటని ప్రభావతి కుటుంబసభ్యులు ప్రశ్నించారు. దీంతో అవమానంగా భావించిన వైసీపీ నాయకులు ప్రభావతి కుటుంబసభ్యులపై దాడిచేశారు. అనంతరం కిందకు వచ్చి మిగతా ఇళ్లలో ప్రచారానికి వెళ్లారు. దాడి విషయం తెలుసుకున్న స్థానిక టీడీపీ నాయకుడు మేడికొండ మోహన్‌రావు అపార్ట్‌మెంట్ వద్దకు చేరుకోగా, వైసీపీ శ్రేణులు ముప్పై మంది ఒక్కసారిగా ఆయనపై దాడిచేశారు. నడిరోడ్డుపై పడేసి కొట్టారు. స్థానికులు సర్దిచెప్పబోయినా వినిపించుకోకుండా వారిపైనా దాడికి దిగారు. దీంతో ఆ వీధిలో ఒక్కసారిగా ఉద్రిక్తత నెలకొంది. విషయం తెలుసుకున్న టీడీపీ శ్రేణులు ఒక్కొక్కరుగా అక్కడకు చేరుకున్నారు. దాడి జరిగిన విషయాన్ని తెలుసుకునే ప్రయత్నం చేశారు. ఆ సమయంలో అక్కడే ఉన్న వైసీపీ మూకలు పెద్దపెద్దగా అరుస్తూ, రెచ్చగొడుతూ వీరంగం సృష్టించాయి. దీంతో డీఎస్పీ ఆధ్వర్యంలో భారీగా పోలీసులు అక్కడ మోహరించారు. వారి అండతో వైసీపీ శ్రేణులు మరింత రెచ్చిపోయాయి. తొడలు గొడుతూ, మీసాలు మెలేస్తూ, ఇష్టమొచ్చినట్లుగా మాట్లాడుతూ సమతానగర్‌లో రెచ్చిపోవడంతో స్థానికులు భయంతో తలుపులు వేసుకున్నారు.

రిమ్స్ వద్ద వైసీపీ నేతల వీరంగం

టీడీపీ అభ్యర్థి దామచర్ల జనార్దన్‌రావు సమతానగర్‌కు చేరుకొని క్షతగాత్రులను వెంట బెట్టుకొని ఎస్పీ గరుడ్ సుమిత్‌ని కలిశారు. అనంతరం వారిని చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తీసుకెళ్లారు. వైసీపీ అభ్యర్థి బాలినేని శ్రీనివాసరెడ్డి, ఆయన తనయుడు ప్రణీత్‌రెడ్డి తమ అనుచరులతో రిమ్స్ వద్దకు చేరుకొని వీరంగం సృష్టించారు. వైసీపీ మూకలు ఆసుపత్రి ముఖద్వారం అద్దాలు పగులగొట్టాయి. దీంతో రోగులు సైతం భీతిల్లిపోయారు. అక్కడ ఆ సమయంలో పోలీసు ఉన్నతాధికారులు ఉండి కూడా ఏమీ చేయలేదు. అయితే ఘటనపై రిమ్స్ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అటు వైసీపీ, ఇటు టీడీపీ వర్గీయులైన 94 మందిపై ఒంగోలు ఒన్‌టౌన్, తాలూకా పోలీసు స్టేషన్‌లో కేసులు నమోదు చేశారు. వీరిలో 82 మందిపై ఒన్‌టౌన్‌లో, మరో ఏడుగురిపై తాలూకా స్టేషన్‌లో రౌడీషీట్లు తెరిచారు. అయితే కేసుల్లో ఉన్న బాలినేని, దామచర్లపై మాత్రం రౌడీషీట్లు తెరవలేదు. అలాగే రిమ్స్‌లో ఘటన జరిగినప్పుడు అక్కడే ఉన్న ప్రణీత్ రెడ్డిపై అసలు కేసు కూడా నమోదు చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఇదిలా ఉండగా సమతానగర్, వెంగముక్కలపాలెంలో జరిగిన ఘటనలకు సంబంధించి 55 మందిపై తాలూకా పోలీసు స్టేషన్‌లో రౌడీషీట్లు తెరిచారు.

బాధిత కుటుంబ పెద్దపైనా రౌడీషీట్

సమతానగర్‌లో వైసీపీ నేతలు దాడి చేసిన ఇంటి యజమాని నారాయణ ఏఆర్ కానిస్టేబుల్. ఆయన భార్య, కుమారులపై దాడి జరిగింది. ఘటన జరిగిన ప్పుడు నారాయణ లేరు. కానీ ఘటనకు కారణం ఆయనే అని పేర్కొంటూ ఎస్పీ గరుడ్ సుమిత్ ఆయన్ను స స్పెండ్ చేశారు. ఇప్పుడు ఏఆర్ కానిస్టేబుల్‌పైనా రౌడీషీ ట్ తెరిచారు. ఇది తెలుసుకున్న ప్రజలు విస్తుపోతున్నారు.

నగరంలో విస్తృత చర్చ

రౌడీషీట్లు ఏకపక్షంగా తెరిచారంటూ రెండు పార్టీల నాయకులు విమర్శిస్తున్నారు. గతంలో అనేక తీవ్రనేరాలకు పాల్పడిన వారు, ఎక్కువ కేసులు నమోదైన వారిపై పోలీసులు రౌడీషీట్లు తెరుస్తారు. కానీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పుడు జరిగిన ఒక్క సంఘటన ఆధారంగా రౌడీషీట్లు తెరవడాన్ని నాయకులు ఆక్షేపిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పోలీసు తీరు ఉందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

షీట్లు తెరిచిన వారి కదలికలపై నిఘా

రౌడీషీట్లు తెరిచిన వారి కదలికలపై పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు. అదేసమయంలో పోలీసు స్టేషన్‌కు రావాలని కొంత మందికి ఫోన్లు చేస్తున్నారు. దీంతో అనేక మంది ఇప్పటికే అజ్ఞాతంలోకి వెళ్లినట్లు సమాచారం. కోర్టు నుంచి ఏదైనా ఊరట లభించే వరకు అజ్ఞాతం తప్పదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకే..

కిషోర్‌బాబు, ఒంగోలు డీఎస్పీ

పల్నాడు ఘటన అనంతరం రైటింగ్ సెక్షన్‌లపై కేసు నమోదైన వారందరిపై రౌడీషీట్లు తెరవాలని ఎన్నికల కమిషన్ ఆదేశించింది. దీంతో ఒంగోలులో 137 మందిపై రౌడీషీట్లు తెరిచాం. ఈసీ ఆదేశాల మేరకు వీరిపై తదుపరి చర్యలు ఉంటాయి.

ఎండప్రచండం

» కొనసాగుతున్న సూర్యప్రతాపం

» ఎర్రగొండపాలెం, పుల్లలచెరువుల్లో 45.4 డిగ్రీల ఉష్ణోగ్రత

ఒంగోలు (కలెక్టరేట్), మే 31 : నిప్పుల కుంపటి నెత్తిన పెట్టినట్టు.. మల మల మాడ్చేస్తున్న ఎండ! మాడు పగిలే వేడి! సెగలు కక్కుతున్న సూర్యుడి ప్రతాపానికి తోడు జోరుగా వీస్తున్న వడగాడ్పుల తాకిడికి జనం విలవిల్లాడుతున్నారు. ఉదయం 8 గంటలకే భగభగలు మొదలవుతున్నాయి. దీంతో ఇంటి నుంచి బయటకు వెళ్లేందుకు ప్రజలు భయపడిపోతున్నారు. రాత్రి ఆరు గంటలకు కూడా 'కాక' తగ్గడం లేదు. రోహిణి ఆరంభం నుంచి మొదలైన సూర్యప్రతాపం కొనసాగుతోంది.. శుక్రవారం ఎర్రగొండపాలెం, పుల్లలచెరువు మండలాల్లో అత్యధికంగా 45.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. అది ఒంగోలులో 45 డిగ్రీలుగా ఉంది. సింగరాయకొండ మండలంలో 44.9, పామూరులో 44.9, వీసీపల్లిలో 44.9, తాళ్లూరులో 44.8, టంగుటూరులో 44.8, ముండ్లమూరులో 44.8, దర్శిలో 44.8, చీమకుర్తిలో 44.8, పొన్నలూరులో 44.5 డిగ్రీల ఎండ కాచింది. పొదిలి మండలంలో 44.3, సంతనూతలపాడులో 44.1, దోర్నాలలో 44.2, కొండపి 44.2, మద్దిపాడులో 43.5, దొనకొండలో 43.9, కొత్తపట్నంలో 43.5, నాగులుప్పలపాడులో 43.5, మర్రిపూడిలో 43.4డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మిగిలిన ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలపైనే ఉన్నాయి. దీంతో జనం ఉడికిపోయారు.

నిరంతరం పనులు చేసుకొని జీవనం సాగించే వారు, తోపుడు బండ్లపై చిరువ్యాపారాలు చేసుకొనే వారు ఇబ్బంది పడ్డారు. వృద్ధులు, చిన్నారులు విలవిల్లాడారు.

పొగాకు కిలో రూ.338

» ఒంగోలులో-2లో లభించిన ధర

ఒంగోలు, మే 31 (ఆంధ్రజ్యోతి) : దక్షిణాది పొగాకు మార్కెట్లో శుక్రవారం మరింత జోరు కొనసాగింది. ఒక్క రోజులో ఏకంగా కిలోకు రూ.12 మేర ధర పెరిగింది. గురువారం మార్కెట్‌లో మేలు రకం గరిష్ఠ ధర కిలోకు రూ.326 లభించగా.. శుక్రవారం రూ.338 పలికింది. ఒంగోలు-2 వేలం కేంద్రంలో ఇది లభించింది. ఆ కేంద్ర పరిధిలోని మద్దిరాలపాడు, అగ్రహారం గ్రామాలకు చెందిన బేళ్లు శుక్రవారం అమ్మకాలకు వచ్చాయి. సాధారణంగా ఆ ప్రాంత పొగాకు నాణ్యత బాగానే ఉంటుంది. దీంతో ఆ బేళ్ల కోసం పలు కంపెనీల బయ్యర్లు పోటీపడ్డారు. ఇతర వేలం కేంద్రాల్లో కూడా గరిష్ఠ ధరలు కిలో రూ.330పైనే ఉన్నాయి.

త్రిసభ్య కమిటీ విచారణ

» మార్కాపురం డీఎల్‌పీవో కార్యాలయంలో వేధింపుల వ్యవహారం

» నాలుగు రోజుల్లో కలెక్టర్‌కు నివేదిక


బాధితురాలిని విచారిస్తున్న త్రిసభ్య కమిటీ సభ్యులు

మార్కాపురం, మే 31 : మార్కాపురం డివిజనల్ పంచాయతీ కార్యాలయంలో మహిళా ఉద్యోగినిని వేధించిన వ్యవహారంపై త్రిసభ్య కమిటీ శుక్రవారం విచారణ ప్రారంభించింది. కమిటీ సభ్యులైన ఎంపీడీవో తోట చందన, సీడీపీవో సుశీలాదేవి, ఏపీడీ నిర్మాలాదేవిలు డీఎల్‌పీవో కార్యాలయానికి వచ్చి విచారించారు. డీఎల్‌పీవో నాగేశ్వరరావు, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు తనను లైంగికంగా వేధిస్తున్నట్లు కార్యాలయంలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ప్రాథమిక విచారణ అనంతరం సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులును కలెక్టర్ దినేష్‌కుమార్ సస్పెండ్ చేశారు. సమగ్ర విచారణ కోసం త్రిసభ్య కమిటీని నియమించారు. కమిటీ సభ్యులు శుక్రవారం బాధితురాలిని, ఆమెను వేధిస్తున్న సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులును విచారించారు. మరో రెండు, మూడు రోజులు డీఎల్‌పీవోతో సహా కార్యాలయంలో పనిచేసే ఇతర సిబ్బందిని విచారించనున్నారు. అనంతరం నివేదికను కలెక్టర్‌కు అందజేయనున్నారు.

నిఘా నీడలో ఓట్ల లెక్కింపు

» కౌంటింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత

» 3 నుంచి జిల్లావ్యాప్తంగా 144 సెక్షన్ అమలు

» సాయంత్రం ఐదు గంటల లోపు అన్ని నియోజకవర్గాల ఫలితాలు

» జిల్లా ఎన్నికల అధికారి దినేష్‌కుమార్ వెల్లడి


మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్, పక్కన ఎస్పీ గరుడ్ సుమిత్

ఒంగోలు (కలెక్టరేట్), మే 31 : సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారైన కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. ఒంగోలు సమీపంలోని రైజ్ ఇంజనీరింగ్ కళాశాలలో కట్టుదిట్టమైన భద్రత మధ్య, సీసీ కెమెరాల నిఘా నీడలో ఈనెల 4న కౌంటింగ్ జరుగుతుందని చెప్పారు. స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 14 టేబుళ్లు, ఒంగోలు పార్లమెంట్‌కు 40 టేబుళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈవీఎం కౌంటింగ్ కోసం ప్రతి టేబుల్ వద్ద ఒక సూపర్‌వైజర్, ఒక కౌంటింగ్ అసిస్టెంట్, ఒక మైక్రో అబ్జర్వర్ ఉంటారన్నారు. పోస్టల్ బ్యాలెట్ కోసం ప్రతి టేబుల్ వద్ద ఒక కౌంటింగ్ సూపర్ వైజర్, ఇద్దరు కౌంటింగ్ అధికారులు, ఒక మైక్రో అబ్జర్వర్, ఒక అసిస్టెంట్, ఒక ఏఆర్వోను నియమించినట్లు చెప్పారు. ఈవీఎంలు, పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు కేంద్రాలకు వెళ్లేందుకు సిబ్బందికి, ఏజెంట్లకు ప్రత్యేక మార్గాలను కూడా ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు సంబంధించి 2,400 మంది ఏజెంట్లు, 1,500 మంది సిబ్బంది, వెయ్యి మంది పోలీసులు ఉంటారని తెలిపారు. కౌంటింగ్ సిబ్బందిని ర్యాండమైజేషన్ పద్ధతిలో కేటాయించడం జరుగుతుందన్నారు. అభ్యర్థులకు సంబంధించిన ఏజెంట్లు తమ దరఖాస్తులను శనివారం లోపు అందించాలని కోరారు. కౌంటింగ్ సమయంలో అవాంతరాలు కల్పించాలని చూస్తే కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. అభ్యర్థులు కూడా కేవలం మూడుసార్లు మాత్రమే కౌంటింగ్ కేంద్రం నుంచి బయటకు వెళ్లి వచ్చేందుకు అవకాశం ఉందన్నారు. ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో 200 సీసీ కెమెరాలను వినియోగిస్తున్నట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా జూన్ 3 నుంచి 5వతేదీ వరకు 144 సెక్షన్ అమలు చేస్తూ కలెక్టర్ దినేష్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వు లు జారీ చేశారు.

పటిష్ఠ బందోబస్తు: ఎస్పీ

కౌంటింగ్ కోసం పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ గరుడ్ సుమిత్ తెలిపారు. రైజ్ ఇంజనీరింగ్ కళాశాల ఎదురు జాతీయ రహదారిలో ట్రాఫిక్‌ను ఒకవైపునకు మళ్లిస్తున్నట్లు చెప్పారు. ఆ ప్రాంతాన్ని నో ఆల్కహాల్ జోన్‌గా ప్రకటించామన్నారు. జిల్లావ్యాప్తంగా 156 సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. 18 మంది ముఖ్యనాయకుల ఇళ్లు, 16 పార్టీ కార్యాలయాల వద్ద కూడా భారీ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పోలింగ్ రోజు ఘర్షణలకు పాల్పడిన 265 మందిపై రౌడీషీట్లు తెరిచామన్నారు. 185 సమస్యాత్మక ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బెట్టింగ్‌లపై కూడా నిరంతర పర్యవేక్షణ చేస్తున్నామని ఎస్పీ తెలిపారు.

బ్యాంకు ఖాతాలకే పింఛన్ సొమ్ము!

» ఈనెలలో కూడా లబ్ధిదారులకు తప్పనిపాట్లు

» గత నెల సొమ్మునే డ్రా చేసుకోలేకపోయిన వృద్ధులు

» నడవలేని, వ్యాధులతో బాధపడుతున్న 70 వేల మందికే ఇంటింటికీ పంపిణీ

ఒంగోలు నగరం, మే 31: పింఛన్‌దారులకు ఈనెలలోనూ పాట్లు తప్పని పరిస్థితి నెలకొంది. జూన్ పింఛన్‌ను కూడా ప్రభుత్వం బ్యాంకు ఖాతాల్లోనే జమచేయనుంది. మంచంలో ఉన్న, వివిధ వ్యాధులతో బాధపడుతున్న 70వేల మందికి మాత్రమే ఇంటింటికీ పంపిణీ చేయనుంది. గతంలో వలంటీర్ల ద్వారా ఇంటింటికీ పింఛన్లను పంపిణీ చేసిన ప్రభుత్వం ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఆ విధానాన్ని నిలిపివేసింది. ఏప్రిల్ పింఛన్‌ను సచివాయాల ద్వారా ఇచ్చింది. మేలో లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు జమ చేసింది. ఈ సొమ్మును తీసుకునేందుకు పింఛన్‌దారులు అనేక అగచాట్లు పడ్డారు. ఎండలో వృద్ధులు, వితంతువులు బ్యాంకుల వద్ద క్యూ కట్టారు. వడదెబ్బ తగిలి కొందరు సొమ్మసిల్లిపోయారు. చాలామంది పింఛన్ సొమ్మును బ్యాంకు నుంచి తీసుకోలేకపోయారు. కానీ వీటి గురించి పట్టించుకోని ప్రభుత్వం జూన్ పింఛన్‌ను కూడా బ్యాంకు ఖాతాలకే జమచేయాలని నిర్ణయించింది. దీంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. సచి వాలయ సిబ్బంది ఇంటింటికీ వచ్చి కానీ, తాము సచివాలయానికి వెళ్లి కానీ పింఛన్ తీసుకోవడం సులభంగా ఉంటుందని వారు అంటున్నారు. జిల్లాలో మొత్తం 2,92,522 పింఛన్‌దారులు ఉండగా వారిలో 70 వేల మందికి మాత్రమే ఇంటింటికీ సచివాలయ సిబ్బంది పింఛన్లను అందజేయనున్నారు. మిగిలిన 2,22,522 మందికి వారి బ్యాంకు ఖాతాలకు జమ చేయనున్నారు. నడవలేనిస్థితిలో ఉన్న వృద్ధులు, వ్యాధులతో మంచానికి పరిమితమైన వారు, దివ్యాంగులతోపాటు బ్యాంకు ఖాతాలకు ఆధార్ కార్డులు లింకు కాని వారి ఇళ్లకు మాత్రమే సచివాలయ సిబ్బంది వెళ్లి పింఛన్ సొమ్మును అందజేయనున్నారు.

రమేష్ సేవలు అభినందనీయం


బల్లికురవ గ్రంథపాలకుడు రమేష్‌ను సత్కరిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ సెక్రటరీ ఆదిలక్ష్మి

బల్లికురవ. మే 31 : బల్లికురవ మండల గ్రంథపాలకుడుగా విశేష సేవ లు అందించి ఉద్యోగ విరమణ చేస్తున్న అడ్డగడ్డ రమేష్ సేవలు అభినందనీయం అని జిల్లా గ్రంథాలయ సంస్థ సెక్రటరీ కా సు ఆదిలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం బల్లికురవ గ్రంథాలయంలో పనిచేస్తు ఉద్యోగ విరమణ చేసిన రమేష్‌ను గ్రామస్థులు, వారి బంధువులు, తోటి ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అద్దంకి, మార్టూరు గ్రంథపాలకులు సుగుణారావు, రామారావు, లక్ష్మీనాథ్ తదితరులు పాల్గొన్నారు.



వృత్తి నైపుణ్య పురస్కారాలను అందుకున్న వృత్తిదారులతో రోటరీ సభ్యులు

వృత్తి నైపుణ్య పురస్కారాలు ప్రదానం

అద్దంకిటౌన్, మే 31: సమాజంలో అన్ని వృత్తులు గౌరవించదగినవని, ఏ వృత్తినీ చిన్నచూపు చూడరాదని రోటరీ అధ్యక్షుడు చిన్ని మురళికృష్ణ అన్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక గీతామందిర్‌లో రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో వివిధ వృత్తులలో నైపుణ్యం చూపిన పది మందికి వృత్తి నైపుణ్య పురస్కారాల ప్రదాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా చెన్నుపల్లి సుబ్బారావు(రజిక), మున్నంగి వెంకటరావు(పారిశుధ్యం), మేడా సత్యనారాయణ(ఎలక్ట్రీషియన్), మునుగోటి లక్ష్మీ స్వరాజ్యం(టైలర్), వీరేపల్లి సూర్యనారాయణ(క్షవర) గోగుల మూడి శేషగిరిరావు(గాత్రసంగీతం), అద్దంకి పున్నయ్య(చర్మకారి), ఇండ్ల అంజలి(రంగస్థల కళాకారిణి), మర్రిపూడి వెంకటేశ్వర్లు(తాపి మేస్త్రీ), పెద్దిశెట్టి వెంకటాద్రి(కోలాటం)లకు శాలువా, జ్ఞాపిక, నూతన వస్త్రాలు, పూల మాలలతో ఘనంగా సత్కరించి పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ సెక్రటరీ చప్పిడి వీరయ్య, ట్రెజరర్ కొల్లా భువనేశ్వరి, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ అద్దంకి లేవి ప్రసాద్, సందిరెడ్డి శ్రీనివాసరావు, మహమ్మద్ రఫీ, వీరవల్లి సుబ్బారావు (రుద్రయ్య), డాక్టర్ యు.దేవపాలన, జ్యోతి చంద్రమౌళి, మలాది శ్రీనివాసరావు, హరిప్రసాద్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



బల్లికురవ గ్రంథాలయంలో రికార్డులను తనిఖీ చేస్తున్న ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆదిలక్ష్మి

గ్రంథాలయాలకు పూర్వవైభవం తీసుకు వస్తాం

ఉమ్మడి ప్రకాశం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆదిలక్ష్మి

బల్లికురవ. మే 31 : గ్రంథాలయాలకు పూర్వ వైభవం తీసుకు వచ్చేలా కృషి చేస్తున్నామని ఉమ్మడి ప్రకాశం జిల్లా గ్రంథాలయ సంస్థ సెక్రటరీ కాసు ఆదిలక్ష్మి తెలిపారు. బల్లికురవ వచ్చిన ఆమె గ్రంథాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో 70 గ్రంథాలయాలు ప్రభుత్వం ద్వారా పనిచేస్తున్నాయని, వాటిల్లో 37 మంది రెగ్యులర్ ఉద్యోగులు, 11 మంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారన్నారు. త్వరలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేందుకు కలెక్టర్‌కు నివేదిక అందించామన్నారు. ఈ తనిఖీలో రమేష్, సుగుణరావు తదితరులు పాల్గొన్నారు.



యూటీఎఫ్ భవనాన్ని ప్రారంభిస్తున్న ప్రముఖులు

సమస్యలపై సంఘటితంగా పోరాడాలి

యూటీఎఫ్ చీరాల కార్యాలయ ప్రారంభంలో వక్తలు

చీరాలటౌన్, మే 31 : ఉపాధ్యాయుల సమస్యల పోరాటానికి సంఘటితంగా ముందుకుసాగాలని పలువురు వక్తలు అన్నారు. శుక్రవారం చీరాలలో యూటీఎఫ్ ప్రాంతీయ భవనాన్ని ఆ ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కొమ్మోజు శ్రీనివాసరావు ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా ఎంఎల్‌సీ లక్ష్మణరావు, రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు, మాజీ ఎంఎల్‌సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం ప్రసంగించారు. ప్రతినిధులు మాట్లాడుతూ యూటీఎఫ్ 50వ వార్షికోత్సవం సందర్భంగా భవనాన్ని ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. 475 మంది ఉపాధ్యాయుల సహకారంతో సుమారు రూ.78 లక్షలతో భవన నిర్మాణం జరిగినట్లు వివరించారు. అనంతరం ఎస్ఎఆర్ఆర్ఎం ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన వీరాంజనేయులు దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు కేఎస్ఎస్ ప్రసాద్, కె శ్రీనివాసరావు, గవిని శ్రీనివాసరావు, భిక్షాలు, నక్క వెంకటేశ్వర్లు, బాబురెడ్డి, కుర్రా రామారావు, వినయ్‌కుమార్, వీరారెడ్డి, వీరాంజనేయులు, సూరిబాబు, హనుమంతురావు, కరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.



శింగరకొండ ప్రసన్నాంజనేయుడికి లక్ష మల్లెల పూజ చేస్తున్న అర్చకులు

శింగరకొండలో హనుమజ్జయంతి ఉత్సవాలు

అద్దంకి, మే31: శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో హనుమజ్జయంతి ఉత్సవాలు రెండో రోజు శుక్రవారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా శుక్రవారం ఉదయం గణపతి పూజ, రుత్విగ్వరణము, మహన్యాస పారాయణం, ఏకాదశ మన్యుసూక్త వారాభిషేకం, వేద స్వస్తి, పంచామృతాలు, ఏకాదశ విశేష ద్రవ్యాలతో సంపూర్ణాభిషేకం, సుందరకాండ పారాయణ చండి సప్తశతి సూర్య నమస్కారాలు జరిగాయి. ఉభయదాతలుగా శింగరాయకొండ మండలం చినకనుమళ్ళకు చెందిన కాట్రగడ్డ వెంకటసాయిరామ్, నాగరాజులు వ్యవహరించారు. సాయంత్రం ప్రదోషకాల సమయంలో లక్ష మల్లిక(మల్లెపూలు) పూజ నిర్వహించారు. ఉభయదాతలుగా ధేనువకొండకు చెందిన బోడపాటి కల్యాణ్‌కుమార్, గీత, గురజాల మురళీకృష్ణ,కల్యాణి దంపతులు పాల్గొన్నారు. ఈవో సుభద్ర ఆధ్వర్యంలో ఏర్పాట్లు పర్యవేక్షించారు. శనివారం హనుమజ్జయంతి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయని ఈవో తెలిపారు. ఈ ఏడాది హనుమజ్జయంతి శనివారం రావటం విశేషం. పలువురు దీక్షా భక్తులు ఇరుముడి సమర్పించి దీక్ష వి రమించనున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొననున్నారు.

మొరాయిస్తున్న ట్రాన్స్‌ఫార్మర్లు

ఎండలతో పెరిగిన వినియోగం

పలు చోట్ల మరమ్మతులతో ఆగిపోతున్న వైనం



రాజుపాలెంలో పని చేయకుండా మొరాయించిన 15 కేవీ ట్రాన్స్‌ఫార్మర్

మార్టూరు, మే 31: వారం రోజులనుంచి ఎండలు పెరగడంతో పాటు పెరిగిన ఉష్ణోగ్రత కారణంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు సక్రమంగా పని చేయకుండా మొరాయిస్తున్నాయి. గ్రామాలలో ఏర్పాటు చేసిన 15 కేవీ, 100 కేవీ సింగిల్ ఫేజ్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురవుతున్నాయి. ఎండలు పెరగడంతో ఇళ్లల్లో వినియోగదారులు ఏసీలు, కూలర్ల వినియోగం పెరిగింది. దాంతో ఈ ట్రాన్స్‌ఫార్మర్లపై భారం పెరిగింది. గ్రామాలలో విద్యుత్ వినియోగదారులు సాధారణంగా వినియోగించే విద్యుత్ వినియోగాన్ని దృష్టిలో ఉంచుకొని గతంలో వినియోగదారులు విద్యుత్ డిపార్ట్‌మెంట్‌కు డిపాజిట్ చెల్లించారు. దానిని దృష్టిలో ఉంచుకొని మాత్రమే ట్రాన్స్ ఫార్మర్లను ఏర్పాటు చేశారు. కాలక్రమేణా ఇళ్లలో ఏసీలు, కూలర్లు ఏర్పాటుతో ఈ ట్రాన్స్‌ఫార్మర్లపై అధిక లోడు పడింది. అందులో ఎండలు ఎక్కువగా ఉండటంతో అందరూ పగలు, రాత్రిళ్లు కూడా ఏసీల వినియోగించడంతో విద్యుత్ లోడు పెరిగింది.

ఈ వారం రోజులలో మండలంలోని రాజుపాలెం, నాగరాజుపల్లి, మార్టూరు, రాజుగారిపాలెం, బొబ్బేపల్లి, జొన్నతాళి గ్రామాలలో సింగిల్ ఫేజ్ ట్రాన్స్ ఫార్మర్లు దెబ్బతిన్నాయి. వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేశామని, అందుకు ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్‌కు రూ. 25 వేలు దాకా ఖర్చు అయ్యిందని విద్యుత్ ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. అంతేగాకుండా రాజుపాలెం, జొన్నతాళి, రాజు గారిపాలెం, నాగరాజుపల్లి గ్రామాలలో అదనంగా కూడా విద్యుత్ ట్రాన్సుఫార్మర్లను ఏర్పాటు చేశామన్నారు.

అన్ని పార్టీల ఏజెంట్‌లు నిబంధనలు పాటించాలి

చీరాలటౌన్, మే 31 : కౌంటింగ్‌కు ఈసీ సూచించిన ఆదేశాలను కచ్చితంగా పాటించాలని ఆర్వో సూర్యనారాయణ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక రోటరీక్లబ్ ఆఫ్ చీరాల కార్యాలయంలో ఏజెంట్‌లతో అధికారులు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఏజెంట్‌లు కౌంటింగ్ సెంటర్‌కు పరిమితి ప్రకారమే రావాలని సూచించారు. అలాగే కౌంటింగ్ సమయంలో వ్యర్థచర్చలు, వివాదాలు కలిగించకుండా వ్యవహరించాలన్నారు. అలాగే వాహనాలు కేటాయించిన పార్కింగ్ ప్రదేశాల్లోనే ఉంచాలన్నారు. కౌంటింగ్ సమయం ఎంతో విలువైనదని, ఇబ్బందులు కలుగజేస్తే కఠినంగా వ్యవహరించాల్సి ఉంటుందని ముందస్తు హెచ్చరికలు జారీ చేశారు. కార్యక్రమంలో ఆర్వోతో పాటు డీఎస్పీ బేతపూడి ప్రసాద్, తహసీల్దార్ నాసరయ్య, అన్ని పార్టీల ఏజెంట్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.



చీరాల: సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

ప్రశాంత వాతావరణానికి సహకరించాలి

పర్చూరు : కౌంటింగ్ కేంద్రంలో ప్రశాంత వాతావరణం నెలకొనే విధంగా ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని పర్చూరు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, బాపట్ల ఆర్డీవో కె.రవీందర్ అన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో ఎన్నికల్లో పోటీపడిన అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్వో మాట్లాడుతూ గెలుపు ఓటములు సహజమని, అందరూ ప్రజాతీర్పును శిరసావహించాలన్నారు. లెక్కింపు కేంద్రాల్లో అనుసరించాల్సిన నియమ నిబంధనల గురించి వివరించారు. ఓట్ల లెక్కింపు పూర్తిఅయ్యే వరకు ఎవరూ బయటకు రాకూడదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు శిక్షార్హులు అవుతారని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో బాపట్ల జిల్లా డీఎస్పీ మురళీకృష్ణ, సీఐ సీహెచ్.సీతారామయ్య, ఏఆర్వోలు సిహెచ్.సుబ్బయ్య, సంధ్యశ్రీ, మెహర్‌బాబు, ప్రమీల, నాగరాజు, ఫణీంద్రబాబు, ఎస్సై రమేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి రవీందర్

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు / ఎస్ఐ తిరుపతిరావు

పంగులూరు, మే 31 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలంలో 144వ సెక్షన్ అమలులో ఉందని, ప్రజలెవరూ నిబంధనలు అతిక్రమించవద్దని స్థానిక ఎస్ఐ కె.కె. తిరుపతిరావు కోరారు. ఎన్నికల ఫలితాల లెక్కింపు దృష్ట్యా గ్రామాలలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించరాదని కోరుతూ ఆయన రేణంగివరం పీఎస్‌లో శుక్రవారం స్థానిక విలేకర్లతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 4వ తేదీన జరిగే కౌంటింగ్ సందర్భంగా 144వ సెక్షన్ అమలులో ఉన్న దృష్ట్యా గ్రామాలలో ప్రజలు గుంపులు గుంపులుగా గుమికూడరాదని, బాణసంచా కాల్చడం, వీధుల వెంట సంబరాలు జరపడం చేయరాదని ఆయన సూచించారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే ప్రకటనలు చేయడం, రంగులు చల్లుకోవడం లాంటి చట్టవ్యతిరేక చర్యలకు ఎవరూ పాల్పడవద్దని హెచ్చరించారు. అటువంటి కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

అమలులో 144 సెక్షన్

మార్టూరు : పోలీస్, రెవెన్యూ ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు 144 వ సెక్షను , సెక్షను 30 పోలీస్ యాక్టు అమలులో ఉందని సీఐ రాజశేఖర్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాలలో హోటళ్లు, రెస్టారెంట్లు, టీ స్టాల్స్ వద్ద నలుగురు వ్యక్తులు గుమికూడి ఉండవద్దన్నారు. బాణసంచా కాల్చవద్దని, విజయోత్సవ ర్యాలీలు నిర్వహించవద్దని సూచించారు. ఓట్ల లెక్కింపు రోజు, మరుసటి రోజు చెక్ పోస్టులను ఏర్పాటు చేసి వాహనాల తనిఖీ చేపడతామన్నారు. అదేవిధంగా ఈ నెల 3వతేదీ నుంచి 5 వతేదీ సాయంత్రం వరకు రాజకీయ పార్టీల ఆఫీసుల వద్ద గాని, పోటీలో ఉన్న అభ్యర్థుల ఇళ్ల వద్దగాని, ఆఫీసుల వద్ద గాని ప్రజలు గు మికూడ వద్దన్నారు. పోలీసు యాక్టు నిబంధనలను అతిక్రమించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని, ప్రజలు సహకరించాలని సీఐ రాజశేఖర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

భానుడి భగభగ.. ప్రజలు విలవిల

బల్లికురవ. మే 31 : రోహిణి కార్తె ప్రారంభం అయిన దగ్గర నుంచి భానుడి భగ భగలు రోజు రోజుకు అధికం కావటంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కావటంతో ప్రజలు ఉక్కపోతతో ఉడికి పోతున్నారు. మండుతున్న ఎండలు, వడగాడ్పుల ప్రభావంతో గృహాల నుంచి బయటకు రావాలంటేనే భయపడిపోతున్నారు. ఉదయం 9 గంటల వరకు ప్రజలు రోడ్ల మీద కనిపిస్తున్నారు. ఆతర్వాత జన సంచారం లేక వీధులన్నీ నిర్మానుష్యంగా మరుతున్నాయి. గ్రానైట్ క్వారీలలో అయితే కార్మికులు పనులు చేయలేక ఒక పూటకే పనులు ముగిస్తున్నారు. రోజు వారీ కూలీలు అయితే పనులకు వెళ్లే పరిస్థితి లేదు. గ్రామాలలో అయితే ఉపాధీ పనులకు వెళుతున్న కూలీలు సైతం ఉదయం ఆరు గంటలకే వెళ్లాల్సి వస్తుందని వారు తెలిపారు.



వడగాడ్పులతో నిర్మానుష్యంగా మారిన బల్లికురవ ప్రధాన వీధి

వసతుల కల్పనకు ఎస్‌బీఐ పూర్తి సహకారం

● రీజనల్ మేనేజర్ గుణేశ్వరరావు

అద్దంకి, మే31: శింగరకొండకు వచ్చే భక్తులకు అవసరమైన వసతుల కల్పనకు ఎస్‌బీఐ ఆధ్వర్యంలో తమ వంతు సహకారం అందిస్తామని ఎస్‌బీఐ ఒం గోలు రీజనల్ మేనేజర్ ఎస్. గుణేశ్వరరావు అన్నారు. శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో 10 లక్షల రూపాయలతో నిత్య అన్నదానం తయారీకి అవసరమైన స్టీమ్, కిచెన్ ఐటెమ్స్‌ను శుక్రవారం దేవస్థానం ఈవో, అసిస్టెంట్ కమిషనర్ సుభద్రకు అందజేశారు. ఈ సందర్భంగా దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ మేనేజర్ వి.రాజేష్‌బాబు, హెచ్ఆర్ మేనేజర్‌లు చంద్రరావు, నళినీకాంత్, అద్దంకి శాఖ చీఫ్ మేనేజర్ కాకి రాజేష్, డిప్యూటీ మేనేజర్ రామిశెట్టి నరసింహారావు, ఎస్‌బీఐఓఏ అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ వి.శ్రీనివాసరావు, రీజనల్ సెక్రటరీ సీహెచ్ శ్రీనివాసరావు, ఎస్‌బీఐ ఎస్‌యూఏసీ వైస్ ప్రెసిడెంట్ సుధాకరరావు తదితరులు పాల్గొన్నారు.



శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎస్‌బీఐ అధికారులు

రామలింగేశ్వరస్వామి వార్షిక తిరునాళ్ల

బల్లికురవ. మే 31 : మండలంలోని కొణిదెన గ్రామంలో శుక్రవారం రామలింగేశ్వరస్వామి దేవాలయ 14 వ వార్షిక తిరునాళ్ల అంగరంగ వైభవంగా జరిగింది. గ్రామస్తులు ప్రత్యేక ఏర్పాట్లు చేయగా దేవాలయానికి భక్తులు పెద్ద ఎత్తున హాజరై పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. పూజారి గుదూరి మోహన శర్మ ఆధ్వర్యంలో తిరునాళ్ల సందర్భంగా రామలింగేశ్వరస్వామిని, పార్వతి అమ్మవారిని ప్రత్యేకంగా ఆలంకరించి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి వార్ల కల్యాణం నిర్వహించారు. అనంతరం గ్రామంలో ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా దేవాలయం వద్ద కోలాట ప్రదర్శన నిర్వహించారు. అన్నదానం నిర్వహించారు.



ప్రత్యేక అలంకరణలో రామలింగేశ్వరస్వామి



ప్రత్యేక ఆలంకరణలో పార్వతి అమ్మవారు

నేడు నూరు శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేయాలి

చినగంజాం, మే 31 : గ్రామాల్లో వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళ, దివ్యాంగుల పింఛన్ల ఇంటింటి పంపిణీ కార్యక్రమాన్ని శనివారం ఉదయం 6గంటల నుంచి 10 గంటల లోపు నూరు శాతం పూర్తి చేయాలని ఎంపీడీవో యూబీ. వరప్రసాద్ గ్రామ సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. బ్యాంకు అకౌంట్‌లు ఉన్న పెన్షన్‌దారులకు వారి బ్యాంకు ఖాతాకు జమ అవుతుందని తెలిపారు. మండల పరిధిలోని 6,066 పెన్షన్‌లకు గాను 1,596 మంది పెన్షన్‌దారులకు వారి ఇంటి వద్దనే సచివాలయ సిబ్బంది నగదు పంపిణీ చేస్తారని తెలిపారు. మిగిలిన 4,470 మంది పెన్షన్‌దారులకు వారి బ్యాంకు ఖాతాలకు జమ చేస్తామని తెలిపారు. పింఛన్ల పంపిణీ వివరాలను పర్సంటేజ్ సదరు గ్రూపులో సిబ్బంది నమోదు చేయాలని సూచించారు.



కిడ్స్ సమ్మర్ క్యాంపు ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

ఆరోగ్యపు జాగ్రత్తలపై అవగాహన అవసరం

అద్దంకిటౌన్, మే 31: చిన్న పేద తేడా లేకుండా ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ కేసీఎస్ తనూజా అన్నారు. జన విజ్ఞాన వేదిక అద్దంకి డివిజన్ ఆధ్వర్యంలో స్థానిక గురకాయపాలెం జడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించిన కిడ్స్ సమ్మర్ క్యాంప్ 2024 శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా విద్యార్థులు రోజూ ఒక పండు తినాలని, రెండు పూటలా బ్రష్ చేసి మంచి పోషకాహారం తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని హెల్త్ ఎడ్యుకేటర్ కేఏ రాజు తెలిపారు. ఈ సందర్భంగా చిన్నారులకు వడదెబ్బ తగలకుండా నేట్రముర్ 30 హోమియో మాత్రలను కావూరి ధనలక్ష్మి ఉచితంగా అందజేశారు. విద్యార్థులందరికీ జేవీవీ బాపట్ల జిల్లా ఉపాధ్యక్షుడు మన్నం త్రిమూర్తులు మొక్కలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జేవీవీ బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి తంగా శ్రీనివాసరావు, సీఐటీయూ నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

3న అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

పర్చూరు, మే 31: పర్చూరు వైజంక్షన్‌లో నూతనంగా నిర్మించిన 92 అడుగుల శ్రీఅభయాంజనేయస్వామి ఆలయ ప్రథమ వార్షిక వేడుకలు ఈనెల 3న నిర్వహించనున్నట్లు విగ్రహ కమిటీ ప్రతినిధులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉద యం 7గంటల నుంచి గణపతి పూజ, స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం ఉంటుందని, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.



పర్చూరులోని అభయాంజనేయస్వామివారి విగ్రహం

స్వర్ణమ్మతల్లి ఆలయ హుండీ లెక్కింపు

కారంచేడు మండలం స్వర్ణ గ్రామంలో వేంచేసియున్న శ్రీ స్వర్ణమ్మ తల్లి దేవస్థానానికి చెందిన హుండీ లెక్కింపునకు సంబంధించి రూ. 1,71,587 నగదు కానుకల ద్వారా లభించినట్లు ఆయల ఆధికారులు సీహెచ్.వేణుగోపాలరావు, బి.శ్రీనివాసరావు, పి.శ్రీనివాసరావులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈకార్యక్రమంలో గ్రామస్థులు నీరుకట్టు సుబ్బారావు, అర్చకస్వాములు పాల్గొన్నారు.

పోషకవిలువలతో కూడిన ఆహారం అందించాలి



సమావేశానికి హాజరైన కుకింగ్ నిర్వాహకులు

ఇంకొల్లు,మే 31: పాఠశాలలు పునఃప్రారంభించిన తరువాత విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో పోషక విలువలతో కూడిన ఆహారం అందించాలని మండల విద్యాశాఖాధికారి అనంత శ్రీనివాసరావు సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంకొల్లు మండలంలోని మధ్యాహ్నభోజన నిర్వాహకులకు మంచి భోజనం అందించడంపై మాస్టర్‌ట్రైనర్ నాగమణితో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి బి.అజయ్‌బాబు, అనంత శ్రీనివాసరావు, సీఆర్పీలు,కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగ పిల్లల గుర్తింపునకు సర్వే

మార్టూరు, మే 31: మండలంలోని గ్రామాలలో దివ్యాంగ పిల్లలను గుర్తించేందుకు శుక్రవారం ఐఆర్‌పీలు ఇంటింటా సర్వే నిర్వహించారు. గ్రామాలలో నమోదు కాని దివ్యాంగుల పిల్లలకు సంబంధించిన వారు సర్వే బృందానికి వివరాలు ఇవ్వడంతో పాటు వారి పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. అదేవిధంగా దివ్యాంగుల పిల్లల వివరాలు నమోదుకు, వారికి అందించే సేవలు కొరకు మార్టూరులోని ఆర్‌జేఎస్‌టీ కాలనీలో ప్రాథమిక పాఠశాలలో భవిత కేంద్రాన్ని సంప్రదించాలన్నారు. ఈ కేంద్రం అందరికీ అందుబాటులో ఉందన్నారు. ఈ సర్వేలో అధికారులు సీహెచ్ నాగకుమారి, షేక్ ఆయేషా పర్వీన్‌లు పాల్గొన్నారు.



దివ్యాంగుల పిల్లలపై సర్వే చేస్తున్న అధికారులు

శిల్పగురు నేషనల్ అవార్డుకు దరఖాస్తులు విడుదల

అద్దంకి, మే31: కేంద్ర ప్రభుత్వం రాష్ట్రపతి ద్వారా చేతివృత్తి కళాకారులకు ఇస్తున్న శిల్పగురు నేషనల్ అవార్డుకు దరఖాస్తులను శుక్రవారం విజయవాడలోని బీజేపీ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి విడుదల చేశారని ఆపార్టీ కన్వీనర్ కొండముది బంగారుబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో కో కన్వీనర్ కొల్లపూడి హేమసుందర్, బట్టా వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వెండి వస్తువులు బహూకరణ



ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో వెండి వస్తువులు అందజేస్తున్న దాత కాట్రగడ్డ అనిల్‌కుమార్

అద్దంకి, మే31: శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో అభిషేకానికి వినియోగించే వెండి వస్తువులను జిల్లా శింగరాయకొండ మండలం చిన్న కనుమళ్లకు చెందిన కాట్రగడ్డ అనిల్‌కుమార్, శ్రీవిద్య దంపతులు 1.40 లక్షల రూపాయల విలువైన వెండి అభిషేకం గిన్నె, ఉద్ధరిణి, 20 వేల రూపాయల విలువైన రెండు ఎయిర్ కూలర్స్, 50 వేల రూపాయల విలువైన ఏసీలను శుక్రవారం దేవాలయం ఈవో, అసిస్టెంట్ కమిషనర్ సుభద్రకు అందజేశారు.

సినీ పరిశ్రమలో ధ్రువతార కృష్ణ

చీరాలటౌన్, మే 31 : తెలుగు సినీ ఇండస్ట్రీలో ఎంతోమందికి సహాయ సహకారాలు అందించి ధ్రువతారలా ఘట్టమనేని కృష్ణ నిలిచారని మునిసిపల్ వైస్ చైర్మన్ బొనిగల జైసన్ బాబు, కృష్ణ అండ్ మహేష్ బాబు ఫ్యాన్స్ అధ్యక్షులు షేక్ అబ్దుల్ సలామ్ పేర్కొన్నారు. కృష్ణ 81వ జయంతి సందర్భంగా పట్టణంలో శుక్రవారం మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. అలాగే స్థానిక మహిళా మండలిలో వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అభిమానులు ఎస్‌కె రఫి, బొనిగల యొహాన్, సూరిబాబు, రవి, సుబ్రహ్మణ్యం, మౌలాలి కృష్ణ, మహేష్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న అభిమానులు

పర్చూరులో..

పర్చూరు : పర్చూరులో శుక్రవారం స్థానిక బొమ్మల సెంటర్ కూడలిలో కృష్ణ అభిమానులు కేక్‌కట్‌చేసి అభిమానం చాటుకున్నారు. అనంతరం ఉచిత మజ్జిగను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో తోకల కృష్ణమోహన్, రోటరీ క్లబ్ అధ్యక్షులు నాగ భైరు శ్రీనివాసరావు, కోటా శ్రీనివాసరావు, గడ్డిపాటి శ్రీనివాసరావు, పంబి సదానందరెడ్డి, పాబోలు వెంకన్న, తులసి శ్రీనివాసరావు, అల్లడి చెన్నయ్య, రామకృష్ణ, లక్ష్మణ్ పాల్గొన్నారు.




పర్చూరులో కేక్ కట్ చేసి అభిమానం చాటుకుంటున్న కృష్ణ అభిమానులు

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు


బోడవాడ(పర్చూరు), మే31: ద్విచక్రవాహనానికి గేదె అడ్డురావటంతో జరిగిన ప్రమాదంలో ఓ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన పర్చూరు మండలం బోడవాడ సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. బోడవాడ గ్రామానికి చెందిన ఇరువురు ద్విచక్ర వాహనంపై పర్చూరు వస్తుండగా ఎదురుగా గేదె రావటంతో వాహనం అదుపు తప్పి ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో జి.దుర్గాదేవి తలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను పర్చూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

చికిత్స పొందుతూ తహసీల్దార్ మృతి



బత్తుల వెంకటరెడ్డి(ఫైల్)

యర్రంవారిపాలెం(పర్చూరు), మే 31: బ్రెయిన్ స్ట్రోక్‌తో చికిత్స పొందుతూ బాపట్ల జిల్లా యద్దనపూడి మండల తహసీల్దార్ బత్తుల వెంకటరెడ్డి(60) శుక్రవారం మృతిచెందారు. కారంచేడు మండలం యర్రంవారిపాలెం గ్రామానికి చెందిన వెంకటరెడ్డి బాపట్ల జిల్లా, యద్దనపూడి మండల తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తూ బ్రెయిన్ స్ట్రోక్‌కు గురయ్యారు. హైదరాబాదులోని అపోలో ఆసుపత్రిలో చికిత్స పొదుతూ శుక్రవారం రాత్రి మృతి చెందారు. మృతదేహాన్ని స్వగ్రామం యర్రంవారిపాలెం తరలించారు. మృతునికి భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.



ప్రాంతం	నెల్లూరు	కావలి	ఆత్మకూరు	ఉదయగిరి	కందుకూరు
గరిష్ఠం	44.1	44.0	44.0	43.0	45.0
కనిష్ఠం	32.5	31.0	32.0	21.0	31.0

భక్తి, శక్తి కలిస్తే భజరంగభళి!!

నేడు హనుమజ్జయంతి



అచంచలమైన భక్తివిశ్వాసాలకు, అమేయమైన శక్తి సామర్థ్యాలకు ప్రతీక హనుమంతుడు. రామబంటుగా స్వామి భక్తిని చాటి, సీతాన్వేషణలో.. సంజీవిని సాధనలో శక్తియుక్తులను ప్రదర్శించి సేవకు ప్రతిరూపంగా కీర్తిగడించాడు. దుష్టశిక్షణ, శిష్ట రక్షణతోపాటు అన్ని భయాలను పోగొట్టే అభయ మూర్తిగా ఆంజనేయుడు భక్తుల పూజలందుకుంటున్నాడు.

నెల్లూరు (సాంస్కృతికం), మే 31 : భజరంగభళి పుట్టినరోజును హనుమజ్జయంతి పర్వదినంగా ప్రజలు జరుపుకుంటారు. శనివారం ఈ పండుగ సందర్భంగా జిల్లాలోని అన్ని రామాలయాలు, కృష్ణమందిరాలు ఆంజనేయస్వామి ఆలయాల్లో భారీ ఏర్పాట్లు చేశారు. కొన్ని ఆలయాల్లో ఇప్పటికే ఉత్సవాలు జరుగుతున్నాయి. హనుమంతుని ఆరాధనతో ధైర్యం, స్థైర్యం కలుగుతాయని, భయాలు, భ్రమలు తొలగి, తలపెట్టిన కార్యంలో విజయం సిద్ధిస్తుందని పండితుల ఉవాచ. ఈ నేపథ్యం లో హనుమజ్జయంతి సందర్భంగా స్వామివారికి విశేష అభిషేకాలు, అర్చనలు, ఆకుపూజలు, హోమాలు, అన్నదానాలు, పల్లకీసేవలు, సీతారాముల కల్యాణాలు జరగనున్నాయి.



పురుషామృగ వాహనంపై
ఆదిదంపతులు

బుచ్చిరెడ్డిపాళెం, మే 31 : మల్లికార్జున, కామాక్షితాయి కొలువైన జొన్నవాడ క్షేత్రంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వేడుకగా జరుగుతున్నాయి. శుక్రవారం రాత్రి పురుషామృగ వాహనంపై కొలువైన ఆదిదంపతులు భక్తులను కటాక్షిస్తూ ఊరేగారు. ఉదయం తిరుచా ఉత్సవంపై స్వామిఅమ్మవార్లు భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తజనం ఉత్సవర్ల దర్శనానంతరం మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి వి.గిరికృష్ణ ఉత్సవాలను పర్యవేక్షించారు. బ్రహ్మోత్సవాల్లో శనివారం మల్లికార్జునస్వామి, కామాక్షితాయి సింహవాహనంపై దర్శనమివ్వనున్నారు.

నేటి నుంచి ఇంటర్ తరగతులు

- కళాశాలల పునఃప్రారంభం

నెల్లూరు (విద్య), మే 31 : ఇంటర్మీడియట్ కళాశాలలు శనివారం నుంచి పునఃప్రారంభం కానున్నాయి. ప్రథమ సంవత్సరంలో నూతన ప్రవేశాలతోపాటు ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు తరగతులు నిర్వహించనున్నారు. గడిచిన విద్యా సంవత్సరం కంటే కొత్త సంవత్సరానికి ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. జిల్లాలో ప్రభుత్వ కళాశాలల కంటే ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలల్లోనే మంచి ఫలితాలు వస్తుండటంతో గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు కూడా ప్రైవేట్ వైపే ఆసక్తి చూపుతున్నారు. ఈ నేపథ్యంలో ఇంటర్‌బోర్డు అధికారులు పేద, మధ్య తరగతి విద్యార్థులను ప్రభుత్వ కళాశాలల్లో చేర్పించడంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించి నెల రోజులుగా విద్యార్థులను ఆకర్షించే ప్రయత్నాలు జరుపుతున్నారు. జిల్లాలో 218 జూనియర్ కళాశాలలు ఉండగా వీటిలో 23 ప్రభుత్వ, రెండు ఎయిడెడ్ కళాశాలలు కలవు. ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో మొత్తం 7,500 సీట్లు అందుబాటులో ఉండగా గతేడాది 5,700 మంది విద్యార్థులు ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ కోర్సులతోపాటు వృత్తివిద్యాకోర్సుల్లో సీట్లు పొందారు. ఈ ఏడాది అడ్మిషన్ల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని ఇంటర్‌బోర్డు అధికారులు తెలిపారు.

- **పుస్తకాలు లేకుండానే..**

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నాలుగేళ్లుగా పాఠ్యపుస్తకాలు లేకుండానే విద్యాబోధన సాగుతుండటం గమనార్హం. అత్యధిక శాతం గ్రామీణ ప్రాంతాలకు చెందిన, పేద విద్యార్థులే ఈ కళాశాలల్లో చదువుతుండగా వీరికి పాఠ్యపుస్తకాలు అందించకపోవడమేకాక మధ్యాహ్న భోజన సదుపాయాన్ని కూడా తొలగించడంతో ఆయా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాత పుస్తకాలు, లైబ్రరీలలో దొరికే వాటితో సాధన చేసి పరీక్షలకు హాజరవుతున్నారు. ఈ క్రమంలో నూతన విద్యా సంవత్సరంలో అయినా అధికారులు పాఠ్య పుస్తకాలు అందించేలా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. అలాగే నాడు-నేడు పేరుతో అత్యధిక కళాశాలల్లో చేపట్టిన పనులు అసంపూర్తిగా ఉన్నాయి. అదనపు తరగతి గదులు పూర్తి కాకపోవడం, పూర్తయిన వాటిని సంబంధిత కళాశాలలు వాటి కార్యాలయాలకు వినియోగించుకోవడంతో విద్యార్థులు చాలీచాలని గదుల్లో, వరండాల్లో కూర్చోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థులకు కళాశాలలు తొలిరోజు సమస్యలతోనే స్వాగతం పలకనున్నాయి.

నేటి నుంచి
పింఛన్లు, రేషన్ పంపిణీ

నెల్లూరు(హరనాథపురం), మే 31 : సామాజిక పింఛన్ల పంపిణీ, రేషన్ సరుకుల పంపిణీ శని వారం నుంచి జరుగనుంది. పింఛన్లను 5వ తేదీ వరకు బ్యాంకుల ద్వారా చెల్లించనున్నారు. జిల్లాలో 3,14,422 మంది లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేయనున్నారు. వీరిలో 2,28,471 మంది లబ్ధిదారు లకు బ్యాంకు ఖాతాల్లో జమ చేయనుండగా, బ్యాంకు అకౌంట్‌లేని 85,951 మంది లబ్ధిదారులకు గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది ద్వారా ఇంటి వద్దనే అందజేస్తారు. ఇక, రేషన్ సరుకుల విషయానికి వస్తే శనివారం నుంచి 17వ తేదీ వరకు చేపడుతున్నామని డీఎస్వో డీవీ రమణ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని 7,33,520 కార్డుదారులకు బియ్యం, చక్కెర పంపిణీ చేస్తారని తెలిపారు. ఇందుకోసం 9వేల టన్నుల బియ్యం, కార్డుకు అరకేజీ వంతున చక్కెర కేటా యింపు జరిగిందన్నారు. సరుకులు చౌకదుకాణాలకు చేరాయని, ఎండీయూ వాహనాల ద్వారా కార్డుదారు లకు అందచేసేందుకు చర్యలు తీసుకున్నామని డీఎస్వో తెలిపారు.

కిలో పొగాకు రూ.331

కలిగిరి, మే 31 : పొగాకు ధర పెరుగుతుండటంతో సాగుదా రుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. కలిగిరి వేలం కేంద్రానికి శుక్ర వారం 742 పొగాకు బేళ్లు అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో 15 కంపెనీ ప్రతినిధులు పాల్గొని 606 బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-95, ఆర్‌ఆర్-2, సీఆర్-22, జంపింగ్ లాట్స్-17 కారణాలతో 136 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.331, కనిష్ఠ ధర రూ.205, సగటు ధర రూ.289.04గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ తెలిపారు.

మందు మోసేద్దాం!

ఎన్నికల కౌంటింగ్‌కు ముందే మద్యం దుకాణాలను ఎక్సైజ్ అధికారులు మూసి వేస్తారన్న ప్రచారంతో పలు పార్టీల రాజకీయ నాయకులు మద్యం నిల్వపై ప్రత్యేక దృష్టి సారించినట్లు సమాచారం. ఎన్నికల పోలింగ్ తర్వాత పోలీసుల నిఘా ప్రత్యేక చెక్‌పోస్టులపై తగ్గడం, వాహనాల తనిఖీలు పెద్దగా జరగక పోవడంతో ఇదే అదునుగా ఇతర రాష్ట్రాల నుంచి సరుకు తరలిస్తున్నట్లు తెలిసింది. పోలింగ్‌కు ముందు జిల్లాలో ఇతర రాష్ట్రాలకు చెందిన మద్యం డంప్‌ను స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. ఓట్ల లెక్కింపు నేపథ్యంలో మరోసారి జిల్లా వ్యాప్తంగా ఇతర రాష్ట్రాలకు చెందిన మద్యం డంప్‌లు పెద్ద సంఖ్యలో ఏర్పాటు చేసినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

- మద్యం నిల్వలపై నాయకుల దృష్టి
- మూడురోజులు లిక్కర్ బంద్ అంటూ ప్రచారం
- కౌంటింగ్ రోజు కోసం ముందుగానే స్టాక్
- 'బెల్టు' వ్యాపారుల హడావిడి
- ప్రభుత్వ దుకాణాల నుంచి తరలుతున్న కేసులు
- మద్యం షాపులు రాత్రి 8 వరకే..!

నెల్లూరు(క్రైం), మే 31: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ చివరి దశకు చేరుకుంది. గతంలో పోలింగ్ ముగిస్తే ఎన్నికల ప్రక్రియ దాదాపుగా పూర్తయినట్లే భావించేవారు. అయితే ఈసారి పోలింగ్ రోజు, ఆ తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా చోటుచేసుకున్న అల్లర్లు, ఘర్షణలతో కౌంటింగ్ ప్రక్రియపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఓట్ల లెక్కింపు ప్రశాంతంగా సాగేలా పది రోజులుగా ముందస్తు చర్యలు చేపడుతు న్నారు. మరో మూడు రోజుల్లో కౌంటింగ్ జరగనుండ టంతో రాజకీయ నాయకులు, అభ్యర్థులు ఎవరికి వారు గెలుపుపై ధీమాగా ఉంటూ సంబరాలకు సిద్ధపడుతున్నారు. మద్యం నిల్వలపై దృష్టి సారిస్తున్నారు. భారీగా మద్యం తరలించేం దుకు ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు సమాచారం. ఈ క్రమంలో మద్యానికి డిమాండ్ పెరిగింది. ఇదిలా ఉండ గా ఓట్ల లెక్కింపు నేపథ్యంలో మూడు రోజులు మద్యం దుకాణాలు, బార్లు మూసేస్తారంటూ సోషల్‌మీడియాలో విస్తృతంగా ప్రచారం సాగుతోంది. దీంతో బెల్ట్ షాపుల నిర్వాహకులు ఆ మూడు రోజులకు సరిపడా మందును స్టాక్ చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. మొత్తం మీద కౌంటింగ్ రోజు కోసం మద్యాన్ని భారీగా డంప్ చేసే పనిలో అందరూ నిమగ్నమై ఉన్నారు. మరోవైపు ప్రభుత్వం మద్యం దుకాణాల పని వేళలను ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు కుదించారు. గతంలో కంటే గంట ముందే దుకాణాలు మూసేస్తున్నారు. బార్లకు మాత్రం ఎలాంటి నిబంధనలు విధించక పోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.



నిఘా కరువు

ఎన్నికల పోలింగ్ సందర్భంగా జిల్లాలో ప్రభుత్వ మద్యం దుకాణాలు, మాల్‌ల నుంచి నాయకుల చేతికి మద్యం అందిందని పోలీసులు నిర్ధారించారు. ఈ క్రమంలో పలువురిని అరెస్ట్ చేయడంతోపాటు, మద్యం దుకాణాల్లో విధులు నిర్వహించే వారిని విధుల నుంచి తొలగించిన విషయం తెలిసిందే. అయితే కౌంటింగ్ ప్రక్రియ సజావుగా సాగేలా అధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నప్పటికీ ప్రభుత్వ మద్యం దుకాణాలపై మాత్రం నిఘా కన్పించడం లేదనే విమర్శలున్నాయి.

ఎక్సైజ్ అధికారులు మద్యం సేల్స్ వరకే మా పరిధి, మిగిలింది అంతా సెబ్ వాళ్ల పనే అంటున్నారు. ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి ఇప్పటికే బెల్ట్ వ్యాపారుల చేతికి, స్థానిక రాజకీయ నాయకులకు అధిక సంఖ్యలో మద్యం కేసులు చేరినట్లు సమాచారం. ఇక ఎన్నికల్లో గెలిచే పార్టీని బట్టి బార్ల యాజమాన్యం 4వ తేదీ మధ్యాహ్నం తర్వాత మద్యం అందిస్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం. మరి సీల్ వేసిన బార్ల నుంచి తీసి ఇవ్వడం కుదరదు కాబట్టి ముందుగానే బార్ల యాజమాన్యం స్టాక్‌ను నిల్వ ఉంచుతారని అంచనా.

కన్నెత్తి చూడని సెబ్

ఎన్నికల ప్రక్రియ ప్రారంభం అయినప్పటి నుంచి జిల్లాలో సెబ్ అధికారుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతూనే ఉన్నాయి. పోలింగ్‌కు ముందు తనిఖీల్లో పదుల సంఖ్యలో బెల్ట్ దుకాణాల నుంచి మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు తప్ప డంప్‌ల జోలికి వెళ్లలేదన్న ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమంలోనే ఎన్నికల అధికారులకు అందిన ఫిర్యాదులతో జిల్లాలోని అనేక ప్రాంతాల్లో మద్యం డంప్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత విచారణ చేపట్టిన సెబ్ అధికారులు అసలు నేరస్థులు ఎవరన్నది బయట పెట్టకుండా కొందరిని అరెస్ట్ చేసి చేతులు దులుపుకు న్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇక పోలింగ్ ప్రక్రియ పూర్తయిన తర్వాత రాష్ట్రంలో అల్లర్లు చెలరేగుతున్న సమయంలోనూ జిల్లాలో మద్యం డంప్‌పై సెబ్ అధికారులు పెద్దగా దృష్టిగా సారిం చలేదని, అన్నీ మేమే చేయాలా?.. వారెందుకు ఇంక? అంటూ పోలీసు శాఖలో అధికారులు చర్చించుకున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో కౌంటింగ్ లోపు జిల్లాలో ఇంకెన్ని మద్యం డంప్‌లు బయటకు వస్తాయో చూడాలి.

సోమశిలలో నీటి నిల్వ

అనంత సాగరం, మే 31: సోమశిల జలాశయం పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 77.988 టీఎంసీలు. శుక్రవారానికి 7.415 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 200, ఉత్తర, దక్షిణ కాలువ లకు 10 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నట్లు వివరించారు. కాగా, డ్యాంలో నీటిమట్టం పడిపోతుండటంతో అన్నదాతలో ఆందోళన నెలకొంది.

రట్టవుతున్న పసిడి గుట్టు!

- పోలీసుల తనిఖీల్లో అక్రమ వ్యాపారం వెలుగులోకి
- బంగారు బిస్కెట్లు రవాణా చేస్తూ పట్టుబడుతున్న వైనం
- రెండు రోజుల్లోనే ఏడున్నర కిలోల స్వర్ణం స్వాధీనం



వెంకటాచలం వద్ద పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారు బిస్కెట్లు

కావలి/వెంకటాచలం, మే 31 : దొడ్డిదారిన జరుగుతున్న పసిడి వ్యాపారం గుట్టు రట్టవుతోంది. చెన్నైలోని నల్లబజారులో బంగారం కొనుగోలు చేస్తున్న రాష్ట్రంలో వివిధ ప్రాంతాలకు చెందిన వ్యాపారుల బాగోతం పోలీసుల తనిఖీల్లో వెలుగులోకి వస్తోంది. గురు, శుక్రవారాల్లో కావలి, వెంకటాచలం టోల్‌ప్లాజాల వద్ద సుమారు ఏడున్నర కిలోల బంగారు బిస్కెట్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నాలుగు కార్లతోపాటు రవాణా చేస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. తీగలాగితే డొంక కదిలినట్లు బంగారం అక్రమ వ్యాపారంపై ఎవరో ఇచ్చిన సమాచారం మేరకు తనిఖీలు చేపట్టగా అక్రమ వ్యాపారం చేసే వారి వివరాలన్నీ బయటపెట్టారు.

- చెన్నై నుంచి తెలంగాణలోని మిర్యాలగూడకు కారులో బంగారం అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారంతో కావలి రూరల్ ముసునూరు టోల్‌ప్లాజా వద్ద గురువారం తెల్లవారుజామున పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. మిర్యాలగూడకు చెందిన తిప్పన సుమతి, ఎర్రడ్ల తేజశ్రీ, షేక్ పర్వీన్, దూరి యాదమ్మ, బంటు శివమ్మ అనే మహిళలు చెన్నైలో బంగారం కొనుగోలుకు బస్సులో వెళుతూ రూ.1,61,49,500 నగదుతో పట్టుబడ్డారు. అలాగే ఒంగోలుకు చెందిన బిట్రా మోహన్, విజయవాడకు చెందిన పగిళ్ల ప్రభాకర్ ఓ కారులో చెన్నై నుంచి సుమారు రూ.కోటి విలువైన 1.497 కిలోల బంగారు బిస్కెట్లను మిర్యాలగూడకు తీసుకెళుతూ పోలీసులకు చిక్కారు.
- వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద సీఐ అంకమరావు తన సిబ్బందితో కలిసి బుధవారం రాత్రి వాహనాలు తనిఖీ చేస్తుండగా చెన్నై నుంచి వస్తున్న కారులో 1.658 కిలోల బంగారాన్ని బంగారాన్ని గుర్తించి, ఎలాంటి బిల్లులు లేకపోవడంతో సీజ్ చేశారు. తెలంగాణకు చెందిన వంశీ, రాజాను అదుపులోకి తీసుకున్నారు.

తాజాగా..

కావలి టోల్‌ప్లాజా వద్ద చెన్నై నుంచి అక్రమ రవాణా చేస్తున్న 3 కిలోల బంగారాన్ని పోలీసులు స్వాధీనం చేసుకు న్నారు. కావలి రూరల్ సీఐ కే.శ్రీనివాస రావు కథనం మేరకు.. బంగారం అక్రమ రవాణాపై సమాచారం అందడంతో ముసునూరు టోల్‌ప్లాజా వద్ద శుక్రవారం తెల్లవారుజామున సీఐ కే.శ్రీనివాసరావు తన సిబ్బందితో వాహనాలు తనిఖీ చేపట్టారు. ఓ కారును తనిఖీ చేయగా 2,948 గ్రాముల బంగారం బిస్కట్లను గుర్తించారు. చైన్నెకు చెందిన ఆశిష్‌కుమార్, కమలేష్‌లు విజయవాడకు ఆ బిస్కట్లను తరలిస్తున్నట్లు విచారణలో తేలింది. దీంతో వారిని అదుపులోకి తీసుకుని బంగారం బిస్కట్లను, కారును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

- తమిళనాడుకు చెందిన రాకేష్ కుమార్ జైన్, ఆయన భార్య లలితాజైన్‌లు చెన్నై నుంచి కారులో 1.5 కిలోల బంగారాన్ని తరలిస్తుండగా వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద పోలీసులు గుర్తించారు. ఎలాంటి బిల్లులు లేకపోవడంతో బంగారం, కారును స్వాధీనం చేసుకున్నారు. ఈ బంగారం విలువ రూ.1కోటి ఉంటుందని పోలీసులు అంచనా వేస్తున్నారు. దంపతులిద్దరినీ అదుపులోకి తీసుకుని, పోలీసులు కేసు నమోదు చేశారు.

'ఫ్రై'డే!

- మండుతున్న ఎండలకు వడగాడ్పుల తోడు
- ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలు



నెల్లూరు: పెన్నా బ్యారేజీ వద్ద డివైడర్‌పై ఎండిపోయిన మొక్కలు



నెల్లూరు : జాతీయ రహదారిపై ఎండమావులు



కోవూరు : నిత్యం రద్దీగా ఉండే బజారు సెంటర్ ఇలా..



రోహిణి కార్తెలో రోళ్లు పగులుతాయన్న సామెతను నిజం చేస్తూ ఎండలు మండిపోతున్నాయి. ప్రచండుడి భగభగలకు ప్రజలు విలవిల్లాడి పోతున్నారు. గత నాలుగు రోజులుగా ఎండల తీవ్రత పెరగడమే గాక ఎండలకు వడగాల్పులు తోడవడంతో ప్రజలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు.ఉదయం 8 గంటలకు వేడిగాలులు వీస్తుండటంతో ఇంట్లో నుంచి బయటకు రావాలంటే సాహసించాల్సి వస్తోంది. అత్యవసర పనుల కోసం తప్ప ఎవరూ బయటకు రాకపోవడంతో పది గంటలకే రహదారులు, బజార్లు, కూడళ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. మరోవైపు విద్యుత్ కోతలు, లోవోల్టేజీ సమస్యతో ఏసీలు కూడా పని చేయని పరిస్థితి ఏర్పడింది. ఇక ఎండల ధాటికి రోడ్డు డివైడర్ల మధ్యలో ఉన్న మొక్కలు ఎండిపోతున్నాయి. జలవనరుల్లో నీరు సైతం ఇంకిపోవడంతో దాహం తీర్చుకునేందుకు మూగ జీవాలు వెంపర్లాడుతున్నాయి. మరో నాలుగు రోజుల పాటు ఇదే వాతావరణం కొనసాగుతుందన్న అంచనాతో పాటు ప్రజలు భీతిల్లుతున్నారు.

- ఆంధ్రజ్యోతి బృందం



బుచ్చిరెడ్డిపాళెం : గొడుగులు, టోపీలు తప్పదు మరి..



భానుడి దెబ్బకు సీతారామపురంలో మూతపడిన దుకాణాలు

లెక్కింపునకు 4 గంటలే..

- 20రౌండ్లలో తేలనున్న ఆత్మకూరు ఫలితం
- మొదట మర్రిపాడు.. చివరిగా చేజర్ల మండల ఓట్ల లెక్కింపు
- ప్రధాన పార్టీల నాయకుల్లో నరాలు తెగే ఉత్కంఠ



ఆత్మకూరు నియోజకవర్గ చిత్రపటం

ఆత్మకూరు, మే 31: సార్వత్రిక ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల భవితవ్యం మరో మూడురోజుల్లో తేలనుంది. ఈ నెల 4వ తేదీ నిర్వహించే ఓట్ల లెక్కింపుకు అధికారయంత్రాంగం పూర్తి ఏర్పాట్లు పూర్తి చేసింది. ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలో 278పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ జరిగింది. ఇందుకు గాను 20రౌండ్లు కౌంటింగ్ నిర్వహించేందుకు 17కౌంటింగ్ టేబుల్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఆత్మకూరు నియోజకవర్గ ఎన్నికల లెక్కింపు ప్రక్రియ ఆరంభమైన మూడు, నాలుగు గంటల్లో ఫలితాలు కొలిక్కివస్తాయి. ఈ నేపథ్యంలో మూడురోజుల్లో జరగనున్న ఎన్నికల కౌంటింగ్ అ టు అభ్యర్థుల్లోను, ఇటు ప్రజల్లోను ఆసక్తి రేకెత్తి స్తుంది. ముఖ్యంగా ప్రధాన పార్టీల్లో నరాలుతెగే ఉత్కంఠత నెలకొని ఉంది.

● కౌంటింగ్ ప్రక్రియ ఇలా..:

ముందుగా కౌంటింగ్ ప్రక్రియలో మొదట పోస్టల్ బ్యాలెట్లు, ఆ తరువాత ఈవీఎంలను లెక్కించనున్నారు. నియోజకవర్గంలో మొత్తం 2,15,685 ఓట్లు ఉండగా అందులో 1,78,829ఓట్లు పోలయ్యాయి. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు మరో 2,611 ఉన్నాయి. మొత్తం మీద 1,82,440 ఓట్లును లెక్కించాల్సి ఉంది. మొదట మర్రిపాడు మండలంలోని 1 నుంచి43వ పోలింగ్ బూత్‌లలో పోలైన 28,921ఓట్లును లెక్కించనున్నారు. అనంతరం అనంతసాగరం మండలంలో 44 నుంచి 89 వరకు ఉన్న బూత్‌లలో పోలైన 29,752 ఓట్లును లెక్కిస్తారు. తదనంతరం ఆత్మకూరు రూరల్, మున్సిపాల్టీ పరిధిలోని 90ఉంచి 153 పోలింగ్ బూత్‌లలో పోలైన 42,394 ఓట్లు లెక్కిస్తారు. అనంతరం ఏఎస్‌పేట మండలంలోని 154 నుంచి 191 వరకు ఉన్న బూత్‌లలో పోలైన 23,374 ఓట్లు, సంగం మండలంలోని 192 నుంచి 238 బూత్ వరకు పోలైన 30,210ఓట్లు, చివరిగా చేజర్ల మండలంలోని 239 నుంచి 278 పోలింగ్ బూత్‌లలో పోలైన 24,672 ఓట్లను వరుసగా లెక్కిస్తారు. ఎన్నికల లెక్కింపు ప్రక్రియ ఆరంభమైన తరువాత మూడు నాలుగు గంటల్లో ఫలితాలు కొలిక్కి వస్తాయి. అభ్యర్థుల వారీ ఒక్కో రౌండ్‌లో పోలైన ఓట్లుకు సంబంధించి పత్రాలపై ఏజెంట్లు సంతకాలు తీసుకోవాల్సి ఉంటుంది. ఆయా టేబుల్‌లో ఒక్కోక్క ఈవీఎం లెక్కింపు తరువాత కూడా ఆర్ఓ నిర్ధారించాల్సి ఉన్నందున లెక్కింపు పూర్తయినప్పటికీ గెలుపు ఓటములను నిర్ధారించి ప్రకటించేందుకు మరింత సమయం పట్టే అవకాశం ఉంది.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

డొంక రోడ్లకు మోక్షమెప్పుడో?

- పొలాల్లోకి వెళ్లేందుకు రైతుల అవస్థ

వలేటివారిపాలెం, మే 31 : మండలంలోని పలు గ్రామాల్లో మాగాణి భూముల్లోకి రాకపోకలు సాగించేందుకు అనుకూలంగా ఉన్న డొంక రోడ్లు అభివృద్ధికి నోచుకోక అధ్వానంగా ఉన్నాయి. మాగాణి పొలాల్లో వ్యవసాయం సజావుగా సాగాలంటే నీటి వసతి తోపాటు రహదారి సౌకర్యం కూడా ఎంతో అవసరం. దుక్కులు దున్నుకోవడం మొదలు, పంట విత్తుకోవడం, కూలీలు, ఎరువులు సస్యరక్షణకు అవసరమైన పురుగు మందులను పొలాలలోకి చేరవేయడం వరకు.. అనంతరం పొలాల్లో పండిన వ్యవసాయ ఉత్పత్తులను బయటకు తరలించేందుకు రహదారి సౌకర్యం చాలా ముఖ్యం. ఈ వసతులు అస్తవ్యస్తంగా ఉంటే తిప్పలు తప్పవు. వలేటివారిపాలెం మండలంలోని వలేటివారిపాలెంతో పాటు పలు గ్రామాల్లో ఉన్న వేలాది ఎకరాల మాగాణి పొలాల్లోకి రాకపోకలు సాగించేందుకు వినియోగించే కిలో మీటర్ల దూరం ఉన్న డొంకరోడ్లు ఏళ్ల తరబడి నిర్లక్ష్యానికి గురి కావడంతో రైతులు పడుతున్న పాట్లు అన్నీ ఇన్నీ కావు. శ్రమతో పాటు ఖర్చు కూడా తడిసి మోపెడవుతోంది.

● వర్షాకాలం వస్తే..

ఖరీఫ్‌లో మాగాణి పొలాల వద్దకు వరినారు, కూలీలను చేరవేసేందుకు గతంలో మాదిరి ఎడ్లబండ్లను కాకుండా ట్రాక్టర్లు, ఆటోలు లాంటి వాహనాలను స్థానిక రైతులు వినియోగిస్తున్నారు. ఆ తరువాత ఎరువులు, సస్యరక్షణకు అవసరమైన పురుగుమందులు వాటిని పిచికారి చేసే పరికరాలను పొలాల వద్దకు తరలించేందుకు కూడా ఇవే ఆధారం. అంతేగాకుండా మాగాణి పొలాల్లో పండిన వ్యవసాయ ఉత్పత్తులను బయటకు తరలించేందుకు ట్రాక్టర్లు, లారీలే ఆధారం. లారీలతో పాటు ఈ మధ్య


వలేటివారిపాలెంలో చిల్లచెట్లతో మూసుకుపోయిన డొంకరోడ్డు

వచ్చిన నూర్పిడి యంత్రాలు పొలాల్లోకి ప్రవేశించాలంటే రహదారి సౌకర్యం తప్పనిసరి. గత కొన్నేళ్లుగా అధికారులు, ప్రజా ప్రతినిధులు డొంకరోడ్లను పట్టించుకోకపోవడంతో రాకపోకలు సాగించేందుకు వీలు లేనంత అస్తవ్యస్తంగా తయారయ్యాయి. వర్షాకాలం వచ్చిందంటే ద్విచక్ర వాహనాల సంగతి అటుంచితే కాలినడకన సైతం ఈ డొంకరోడ్లలో ప్రయాణించే అవకాశం లేకుండా పోతుందంటే వీటి పరిస్థితి ఎంత అధ్వానంగా ఉందో అర్థమవుతుంది. దీంతో కొన్ని గ్రామాలలో రైతులే వేలలో తమ సొంత నిధులతో కొంత మరమ్మతులు చేపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మాగాణి పొలాల్లోకి వెళ్లే డొంకరోడ్లకు మరమ్మతులు చేయాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

ప్రతి ఒక్కరికీ వ్యాక్సిన్ వేయాలి


రికార్డులు పరిశీలిస్తున్న కాన్సెప్ట్ నోడల్ అధికారి దయాకర్

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), మే 31: అర్హులైన ప్రతిఒక్కరికి అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ వేయించాలని జిల్లా ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ నోడల్ అధికారి పీఎల్ దయాకర్ తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి మందుల, డెలివరీ గదులు, రికార్డులను పరిశీలించారు. సిబ్బందికి తగు సూచనలిచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైద్యశాలలోని ఇద్దరు వైద్యుల్లో ఒకరు పీహెచ్‌సీ, మరొకరు ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌లో తప్పక హాజరు కావాలన్నారు. వైద్యశాలలో కాన్పుల సంఖ్య పెంచేందుకు ప్రతిఒక్కరు కృషి చేయాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వైద్యులు అయూబ్‌అప్సర్, పర్యవేక్షకులు ఖాజామొహిద్దీన్ పాల్గొన్నారు.

సోమిరెడ్డిని కలిసిన టీడీపీ నేతలు


సోమిరెడ్డితో అనంతసాగరం టీడీపీ నేతలు

అనంతసాగరం, మే 31: టీడీపీ మండలాధ్యక్షురాలు మునగపాటి సునీత, మాజీ ఎంపీపీ సుబ్బరాజు శుక్రవారం నెల్లూరు పట్టణంలో సర్వేపల్లి టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా తమ గెలుపు తథ్యమని, ఈ మారు రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది టీడీపీనే అని వారు ధీమా వ్యక్తం చేశారు. వారి వెంట సంగరాజు దశరథ, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా వేళల మార్పులు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), మే 31: నర్రవాడ విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మత్తుల దృష్ట్యా వ్యవసాయ విద్యుత్ సరఫరా వేళల్లో మార్పులు చేసినట్లు ట్రాన్స్‌కో ఏఈ వెంకటసుబ్బయ్య శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 1 నుంచి 9వ తేదీ వరకు ఈ ఫీడర్ పరిధిలో ఉదయం 9.45 నుంచి 4.45 గంటల వరకు, వెంగన్నపాళెం ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 1నుంచి సాయంత్ర 6గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. కావున వినియోగదారులు సహకరించాలని కోరారు.

నెర్రెలు బారిన రహదారి


వరికుంటపాడు సమీపంలో దెబ్బతిన్న రోడ్డు

వరికుంటపాడు, మే 31: మండలంలోని పలు గ్రామాల మీదుగా సాగే 565జాతీయ రహదారి ప్రమాదాలకు నిలయంగా మారి దర్శనమిస్తోంది. చాలాచోట్ల రోడ్డు నెర్రెలు బారి కుంగిపోయింది. ఈ రహదారి వెంట ప్రయాణాలు సాగించాలంటే వాహనదారులు హడలెత్తిపోతున్నారు. ప్రతినిత్యం రద్దీగా ఉండే రోడ్డులో ఆదమరిస్తే ఎదురుగా వచ్చే వాహనాలను ఢీకొనే ప్రమాదం ఉందని చెబుతున్నారు. రాత్రి సమయంలో పరిస్థితి మరీంత దారుణంగా ఉందని వాపోతున్నారు. ఏ సమయంలో ఎలాంటి ప్రమాదాలకు గురికావాల్సి వస్తుందోనని.. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి యుద్ధప్రాతిపదికన రోడ్డు మరమ్మతు పనులు చేపట్టాలని కోరుతున్నారు.

పొగాకుతో ప్రాణాంతక వ్యాధులు

వింజమూరు, మే 31: పొగాకు విరివిగా వాడుతున్న ప్రజల్లో టీబీ, నోటి కాన్సర్ వంటి ప్రాణాంతకమైన వ్యాధులు ప్రబలుతున్నాయని చిన్నపిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ మాసిలామణి అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక మాసిలామణి హాస్పిటల్‌లో ఆయన రోగులకు పొగాకుపై అవగాహన కల్పించారు. ప్రభుత్వాలు ప్రతి సిగరెట్ పైన, మందు ఉత్పత్తుల పైన ప్రాణాంతకమని రాసినా ప్రజలు నిత్యం ఉపయోగించడం విచారకరం అన్నారు. ఇందులో యువత పొగాకు ఉత్పత్తులకు బానిసై మధ్యలోనే ప్రాణాలు వదులుతున్నట్లు చెప్పారు. పొగాకు ఉత్పత్తులను నిలుపు చేయకుంటే రాబోవు రోజుల్లో యువత, చెడు మార్గాలకు గురికాక తప్పదని హెచ్చరించారు.



రోగులకు అవగాహన కల్పిస్తున్న మాసిలామణి

వీరాంజనేయస్వామి ఉత్సవాలు ప్రారంభం


తరుణవాయిలో గరుడ వాహనంపై ఊరేగుతున్న శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి


వెంకటంపేటలో ఆంజనేయస్వామి

దుత్తలూరు(ఉదయగిరి రూరల్): వెంకటంపేట రోడ్డుపై వెలసిన వీరాంజనేయస్వామి ఉత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వేదపండితులు స్వామికి గణపతి, కలశ, సహస్రనామ పూజలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు భారీగా తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

నేడు జయంతి వేడుకలు

ఆత్మకూరు: మున్సిపాలిటీ పరిధిలోని నెల్లూరు-ముంబాయి జాతీయ రహదారిలోని హనుమాన్ జంక్షన్‌లోని అభయాంజనేయస్వామి ఆలయంలో శనివారం హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. తెల్లవారుజామున 5గంటల నుంచి పంచామృతాభిషేకం, 6నుంచి సహస్రనామపూర్వక ఆకుపూజ, 7నుంచి హనుమంతచాలీసా పారాయణం, 10నుంచి స్వామి సమేత సువర్చలాదేవి కళ్యాణం ఘనంగా నిర్వహించనున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

వైభవంగా గరుడ వాహనసేవ

సంగం: తరుణవాయి చెన్నకేశవస్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా రెండోరోజు గరుడ వాహనంపై స్వామివారు ఊరేగారు. ఈ సందర్భంగా శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఉత్సవ విగ్రహాలను గజపూలమాలలో అలంకరించారు. గ్రామోత్సవానికి భక్తులు కర్పూర హారతులతో స్వాగతం పలికి మొక్కులు తీర్చుకున్నారు.

తీవ్రమైన వడగాలులు.. అనధికార కరెంటు కోతలు

- ఉక్కపోతతో అల్లాడిన జనం

సీతారామపురం, మే 31: మండలంలో మూడురోజులుగా వేసవి తీవ్రత పెరిగింది. మే నెల ముగిసిపోతున్న తరుణంలో ఇప్పటివరకు పెద్దగా ఎండల తీవ్రత లేదని ఊపిరి పీల్చుకుంటున్న ప్రజలకు శుక్రవారం సూర్యుడు పగలే చుక్కలు చూపించాడు. రోహిణికార్తె అంటేనే రోళ్లు పగిలిపోతాయనే సామెత నిజమేనిపించేలా భానుడు భగభగమంటూ మండిపోయాడు. ఎండకు తీవ్రమైన వడగాల్పులు తోడయ్యాయి. ఉదయం ఎనిమిది గంటల నుంచే ఉష్ణోగ్రత పెరగడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు వెనుకాడారు. గ్రామాల్లోని ప్రధాన కూడళ్లన్నీ జనాలు లేక నిర్మానుష్యంగా కన్పించాయి. అప్రకటిత కరెంట్ కోతలతో ఏసీలు సైతం మొరాయించాయి. ఫ్యాన్‌గాలి వేడిగా ఉండటంతో ఇళ్లలో ఉన్న ఉక్కపోతకు ఉక్కిరిబిక్కిరయ్యారు. తొలిసారిగా గురు, శుక్రవారాల్లో రికార్డుస్థాయిలో ఎండ తీవ్రత 43.5 డిగ్రిల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. వేడిమికి తోడు వాతావరణంలో తేమ పెరగడంతో ఉక్కపోత నెలకొంది. వడగాడ్పులు, ఉక్కపోతతో చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులు పడ్డారు. రాత్రుళ్లుకూడా 39డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

మధ్యాహ్న భోజన నిర్వాహకులకు శిక్షణ



అవగాహన కల్పిస్తున్న జిల్లా కోఆర్డినేటర్, శిక్షణలో మధ్యాహ్న భోజన నిర్వాహకులు

సంగం, మే 31: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని కాంప్లెక్స్ సమావేశంలో శుక్రవారం పాఠశాల మధ్యాహ్న భోజన నిర్వాహకులకు ఒక్కరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కో ఆర్డినేటర్ మాల్యాద్రి మాట్లాడారు. విద్యార్థులు మధ్యాహ్న భోజనం నూరుశాతం తినేటట్లు నాణ్యతగా తయారు చేయాలని సూచించారు. మెనూలో అన్ని పోషక పదార్థాలు ఉంటేటట్లు ప్రభుత్వం రూపకల్పన చేసిందన్నారు. ఏ పదార్థాల్లో ఏ పోషకాలు ఉన్నాయి. వాటితో విద్యార్థులకు చేకూరే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో ఎంఈవోలు జానికీరాం, మల్లయ్య, మండల రిసోర్స్ పర్సన్ మోహన్, మధ్యాహ్న భోజన నిర్వాహకులు పాల్గొన్నారు.

పట్టించుకునే వారేరీ..


చిన్న మసీదు సమీపంలోని డ్రైనేజీని శుభ్రం చేస్తున్న మసీదు నిర్వాహకుడు

ఉదయగిరి రూరల్, మే 31: స్థానిక చిన్నమసీదు వద్ద ఉన్న ప్రధాన రహదారిపై నిర్మించిన మురుగునీటి డ్రైనేజీ చెత్తాచెదారంతో నిండిపోయింది. మసీదు నుంచి వచ్చే మురుగునీరంతా డ్రైనేజీలో నుంచి వెళ్లక రోడ్డుపైనే పారుతోంది. వారంరోజులుగా ఈ సమస్య ఉన్నా సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఈ ప్రాంత ప్రజలు, పాదాచారులు వాపోతున్నారు. పంచాయతీ సిబ్బందికి సమాచారం ఇచ్చినా పట్టించుకోక పోవడంతో చేసేదిలేక శుక్రవారం మసీదు నిర్వాహకులు పైపులు, ఇనుప చువ్వలతో డ్రైయిన్‌లో ఇరుక్కుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి మురుగునీరు వెళ్లేలా చర్యలు తీసుకున్నారు.

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ కళాశాల



ప్రభుత్వ జూనియర్ కళాశాల

ఆత్మకూరు. మే 31: ప్రైవేట్ కళాశాలలకు దీటుగా మెరుగైన విద్య నందిస్తూ ఉత్తమ ఫలితాల సాధనలో ముందుకు దూసుకుపోతోంది ఆత్మకూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల. గ్రామీణప్రాంత విద్యార్థుల కోసం 1969లో ఇక్కడ ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేశారు. 55ఏళ్లు పూర్తి చేసుకున్న ఈ కళా శాలలో ఇప్పటివరకు వేలాది మంది విద్యార్థులకు బాసటగా నిలిచింది. ఈ ఏడాది ఒకేషనల్ కోర్సుల్లో మొదటి సంవత్సరం 70, ద్వితీయ సంవత్సరంతో 88శాతం ఉత్తీర్ణత సాధించారు. ఆత్మకూరు నియోజకవర్గంలో ఆత్మకూరు, కల్లూరులో మాత్రమే ప్రభుత్వ జూనియర్ కళాశాలలుండేవి. అలాంటి పరిస్థితుల్లో ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల పేదవిద్యార్థులకు వరంగా మా రింది. ప్రస్తుతం కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, హెచ్‌ఈసీ, సీఈసీ గ్రూపులున్నాయి. వాటితోపాటు ప్రత్యేకవృత్తి విద్యాకోర్సులైన డైరీ సైన్సు, అకౌంట్స్‌అండ్ టాక్సేషన్, కంప్యూటర్ సైన్స్, ఎంపీహెచ్‌డబ్ల్యు(ఎఫ్) కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఈ విద్యా సంవత్సరంలో మరిన్ని సౌకర్యాలు అందిపుచ్చుకుని మెరుగైన విద్యనందించేందుకు కళాశాల ప్రిన్సిపాల్ వాణి, అధ్యాపకులు కృషి చేస్తున్నారు.

డిప్యూటీ ఈవో ప్రసాదరావు బాధ్యతల స్వీకరణ


డిప్యూటీ ఈవో ప్రసాదరావును అభినందిస్తున్న బీటీఏ నాయకులు

కందుకూరు, మే 31: కందుకూరు డివిజన్ ఉప విద్యాశాఖాధికారిగా ఎంవీవీ ప్రసాదరావు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా శుక్రవారం పలువురు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయసంఘాల నాయకులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బీటీఏ నాయకులు కళ్లగుంట మోహన రావు, కట్టా రమేష్, షేక్ అబుల్లా, కొచ్చర్ల వెంకటేశ్వర్లు, కొప్పోలు శ్రీనివాసులు, చొప్పర కొండలరావు, వలేటి మాలకొండయ్య, శివన్నారాయణ తదితరులు డిప్యూటీ ఈవోను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు.

సహజ పానీయాలే శ్రేయస్కరం

కావలిటౌన్, మే 31: శీతల పానియాలకంటే సహజ పానియాలే ఆరోగ్యానికి శ్రేయస్కరమని జేవీవీ జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ బెజవాడ రవికుమార్ పేర్కొన్నారు. శుక్రవారం జేవీవీ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్ కూడలిలో ఉచిత మజ్జిగ చలివేంద్ర ఏర్పాటు చేశారు. జేవీవీ కావలి శాఖ అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జేవీవీ జిల్లా నాయకులు జానకిరామ్, సుబ్బరామశర్మ, కావలి శాఖ బాధ్యులు జీ హరనాథ్, కల్లయ్య, శ్రీకృష్ణ, వెంకయ్య, పీ పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడొద్దు


పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

కావలి రూరల్, మే 31: చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని రెండవ పట్టణ సీఐ కొండ వీటి శ్రీనివాసరావు పేర్కొన్నారు. కావలి పట్టణంలోని పెంకుల ఫ్యాక్టరీ గిరిజన కాలనీలో శుక్రవారం పోలీసులు కార్డిన్ సర్చ్ నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో పాటు జూన్ 4వ తేదీన ఎన్నికల కౌంటింగ్ ఉండటంతో 144 సెక్షన్ అమలులో ఉందని, ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం గిరిజన కాలనీలో వాహనాలు తనిఖీ చేశారు. పత్రాలు లేని 16 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందితో పెన్షన్ పంపిణీ చేయించాలి

కందుకూరు, మే 31: వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే పింఛనఖ నగదును సచివాలయ సిబ్బంది ద్వారా పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని సీపీఐ కందుకూరు నియోజకవర్గ కార్యదర్శి బి.సురేష్‌బాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పింఛన్ సొమ్మును బ్యాంకు ఖాతాలలో వేయటం వలన వృద్ధులు, వితంతువులు బ్యాంకుల చుట్టూ తిరగలేక ఇబ్బందులు పడుతుండటమే గాక అనేకమంది ఈకేవైసీ సమస్యలు, ఇతర సాంకేతిక సమస్యలతో అగచాట్లు పడుతున్నారని పేర్కొన్నారు. మరి కొందరికైతే ఏకంగా పింఛన్ డబ్బులు బ్యాంకుల్లో కట్ అయిపోతుందని పేర్కొన్నారు. నిప్పులగుండంను తలపించేలా ఎండలు మండిపోతున్న తరుణంలో బ్యాంకులకు వెళ్లాల్సివస్తే వృద్ధులు వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఈ క్రమంలో సచివాలయ ఉద్యోగులతో లబ్ధిదారులకు పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

హనుమజ్జయంతికి ఆలయాల ముస్తాబు

కొండాపురం, మే 31: హనుమజ్జయంతికి మండలంలోని పలుగ్రామాలలో ఉన్న ఆలయాలు ముస్తాబయ్యాయి. మర్రిగుంట, భీమవరప్పాడు తదితర గ్రామాలలో ఏర్పాటు చేసి ఉన్న విగ్రహాల వద్ద హనుమాన్ జయంతిని పురస్కరించుకొని శనివారం ప్రత్యేక పూజలు జరగనున్నాయి. ఎండ వేడిమి కారణంగా ఉదయం పూజలు నిర్వహించి అన్నసంతర్పణ కార్యక్రమా లు నిర్వహించేలా నిర్వాహకులు చర్యలు తీసుకుం టున్నారు.

ఘనంగా బీద గిరిధర్ జన్మదినం

అల్లూరు, మే 31 : టీడీపీ నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ జన్మదిన వేడుకలను మండల తెలుగు యువత ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని నార్తుఆములూరులో స్థానిక నాయకుడు దాసరి కరుణాకర్ నేతృత్వంలో భారీ కేక్‌ను బాలలతో కట్ చేయించారు. అనంతరం వారికి అల్పాహారం ఏర్పాటు చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. అల్లూరుపేట పీజీఎం యూత్ బాలలకు పండ్లు, మిఠాయిలు, పుస్తకాలు, పెన్నులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గుంజి రుద్రయ్య, దాసరి ప్రభాకర్, పెయ్యల భాస్కర్, చల్లా ఇంద్రసేన, ఒట్టూరు బాబు, చల్లా రమణయ్య, ఒట్టూరు మల్లి, ఒట్టూరు కామయ్య, దాసరి రామకృష్ణ, చల్లా శీనయ్య, చల్లా శంకరయ్య, పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై గళమెత్తిన సభ్యులు


మాట్లాడుతున్న ఎంపీపీ పెన్నా కృష్ణయ్య

లింగసముద్రం, మే 31 : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ పెన్నా కృష్ణయ్య అధ్యక్షతన జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో సభ్యులు పలు సమస్యలపై గళమెత్తారు. తిమ్మారెడ్డిపాలెం ఎంపీటీసీ దగ్గు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తమ గ్రామ సమీపంలోని పాత చెరువులో 10 ఏళ్ల నుంచి పెరిగిన చిల్లచెట్లను తొలగించేందు కు చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన ఇరిగేషన్ ఏఈ ప్రసాద్ మాట్లాడుతూ పంచాయతీ జనర ల్ ఫండ్ నిధులతో వాటిని తొలగించుకోవాలని చెప్పారు. అలాగే ఆర్ఆర్ పాలెంలో మంచినీటి పైపులైన్లు పగిలి నీరు కలుషితమై వస్తున్నాయని, ఈ పైపులను మరమ్మతులు చేయించేందుకు చర్యలు తీసుకోవాలని ఆ గ్రామ సర్పంచు అధికారులను కోరారు. మంచినీటి పథకం నిర్వాహకులతో మాట్లాడి మరమ్మతులు చేయిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ టీసాగర్ చెప్పారు. అలాగే కందుకూరు ఆర్టీసీ డిపో అధికారులు వలేటివారిపాలెం నుంచి మాలకొండరాయుని పాలెం, వీఆర్ కోట, అన్నెబోయినపల్లి, చినపవని, పెదపవని మీదుగా కావలికి బస్సు సౌకర్యం కల్పించాలని సర్పంచు వంటేల శ్రీనివాసులు కోరారు. దీనికి తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీపీ పెన్నా కృష్ణయ్య అధికారులను ఆదేశించారు. ఇంకా పలువురు ప్రజా ప్రతినిధులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో యశేషబాబు, పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో పోస్టులు పెడితే చర్యలు

ఉలవపాడు, మే 31 : ఎన్నికల ఫలితాల దృష్ట్యా సోషల్ మీడియాలో రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెడితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై బాజీరెడ్డి అన్నారు. శుక్రవారం ఉలవపాడు పోలీస్‌స్టేషన్‌లో సోషల్ మీడియా వారితో ఎస్సై సమావేశం నిర్వహించారు. జూన్ 6 వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని సోషల్ మీడియాలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు, దుష్ప్రచారం చేయవద్దని హెచ్చరించారు.

'టీఆర్ఆర్'లో అడ్మిషన్లు ప్రారంభం

కందుకూరు, మే 31: స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ప్రిన్సిపాల్ ఓరుగంటి వెంకటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఏడాది మొదటి సంవత్సరం ఎంపీసీలో కళాశాల విద్యార్థిని కుడుముల అఖిల 470కి 460 మార్కులు సాధించడంతో పాటు విద్యార్థులు మంచి ఉత్తీర్ణతాశాతం సాధించారని పేర్కొన్నారు. పదవ తరగతి పూర్తయిన పేద విద్యార్థులు స్వయంగా కళాశాలకు వచ్చి వసతులు, అకడమిక్స్ పరిస్థితి తెలుసుకుని ప్రవేశాలు పొందవచ్చునని పేర్కొన్నారు. జూన్ 1 నుంచి ద్వితీయ సంవత్సరం ఇంటర్మీడియట్ తరగతులు ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు.

కావలి రైల్వేస్టేషన్‌లో లిఫ్ట్ ఏర్పాటు చేయాలి


రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు

కావలిటౌన్, మే 31: కావలి రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం లిఫ్ట్ ఏర్పాటు చేయాలని కోరుతూ బీజేపీ నేతలు శుక్రవారం స్టేషన్ సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందజేశారు. నేతలు మాట్లాడుతూ రైల్వేస్టేషన్‌లో లిఫ్ట్ సౌకర్యం లేనందున వయోవృద్ధులు, రోగులు, వికలాంగులు, పిల్లలు మెట్లు ఎక్కలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. లిఫ్ట్ ఏర్పాటుకు అనేకసార్లు మొరపెట్టుకున్నా, నిధులు మంజూరైనప్పటికీ అధికారులు జాప్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లిఫ్ట్ ఏర్పాటుతోపాటు స్టేషన్ ఆవరణలో పారిశుధ్య పరిరక్షణకు ప్రాధాన్యత కల్పించాలని, రాత్రివేళల్లో విద్యుత్ లైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నేతలు బ్రహ్మానందం, మందా కిరణ్, సమీంద్ర, మురళీకృష్ణ పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్‌కు కావలి విద్యార్థిని ఎంపిక


మనశ్విత

కావలిటౌన్, మే 31: కావలిలోని శ్రీప్రజ్ఞ కోచింగ్ సెంటర్‌కు చెందిన విద్యార్థిని కొమరా మనశ్విత సైనిక్ స్కూల్‌కు ఎంపికయ్యింది. పోస్టల్ శాఖ ఉద్యోగి కొమరా మల్లికార్జునరావు కుమార్తె మనశ్విత ఏఐఎస్ఎస్ఈఈ పరీక్షల్లో ప్రతిభ కనబరిచి నేతాజీ సుభాష్ చంద్రబోస్ అకాడమీ (గుజరాత్ సైనిక్ స్కూల్)లో 6వ తరగతిలో ప్రవేశానికి అర్హత సాధించింది. అలాగే నవోదయ ప్రవేశ పరీక్ష రాసి జిల్లాలోనూ 5వ ర్యాంకు సాధించింది. దీంతో శుక్రవారం జనతాపేటలోని శ్రీప్రజ్ఞ కోచింగ్ సెంటర్‌లో కరస్పాండెంట్ దొడ్డవరపు శ్రీనివాసరావు మనశ్వితను, తండ్రి మల్లికార్జునరావును అభినందించారు.

భానుడి భగ భగలు

లింగసముద్రం, మే 31 : రోహిణి కార్తె తన ప్రభావాన్ని చూపుతుండడంతో ప్రజలు మండే ఎండలకు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. గడిచిన నాలుగైదు రోజుల నుంచి ఎండలు మండి పోతున్నాయి. భానుడు సెగలు కక్కుతుండడంతో ప్రజలు 10 గంటలకే ఇళ్లకు చేరుకుంటున్నారు. గురు, శుక్ర వారాల్లో 44 డిగ్రీల ఎండ కాయడంతో మండలంలోని ప్రజలు అలాడిపోయారు. లింగసముద్రం, పెదపవని గ్రామాలలో ఉకాణాలు, రోడ్లు 10 గంటలకే నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఉపాధిహామీ పనులు, ఇతర పనులకు వెళ్లేవారు కూడా ఎండల తీవ్రతకు ముందే ఇళ్లకు చేరుకుంటున్నారు. మండే ఎండలకు తోడు వడగాలులు, విద్యుత్ కోతలు కూడా తోడవడంతో ప్రజలు ఉక్కపోతతో అల్లాడి పోతున్నారు. ఈ ఎండలు మరో నాలుగు రోజులు ఇలాగే ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ చెబుతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు

వలేటివారిపాలెం, మే 31 : జూన్ 4వ తేది ఎన్నికల ఫలితాల సందర్భంగా గ్రామాల్లో అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ బాలమహేంద్రనాయక్ తెలిపారు. మండలంలోని చుండి, వలేటివారిపాలెంలో శుక్రవారం రాత్రి 7 గంటలకు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు.

మంచినీటి బావిలో క్లోరినేషన్

వలేటివారిపాలెం, మే 31 : మండలంలోని నేకునాంపురంలో శుక్రవారం పంచాయతీ సర్పంచు కొల్లూరి లక్ష్మమ్మ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి మాధవి మంచినీటి బావిని క్లోరినేషన్ చేయించారు. బావిలో బ్లీచింగ్ పౌడరుతో పంచాయతీ కార్మికులచే శుభ్రం చేయించారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ సుమంత్ కొల్లూరి గోవిందయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల గ్రామోత్సవం

వలేటివారిపాలెం, మే 31 : వలేటివారిపాలెంలో శుక్రవారం రాత్రి సీతారాముల గ్రామోత్సవం వైభవంగా జరిగింది. శనివారం హనుమజ్జయంతి సందర్భంగా ముందు రోజు సీతారాముల గ్రామోత్సవం నిర్వహించడం ఇక్కడి ఆనవాయితీ. ఈ సందర్భంగా రామాలయంను విద్యుత్ దీపాలతో కనువిందు చేసేలా అలంకరించారు. సీతారాములు, గరుత్మంతుడిని ప్రత్యేకంగా అలంకరించారు. మేళతాళాలు మంగళ వాయిద్యాలు వేదమంత్రాలతో సీతారాములు గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామస్థులు ఎంతో భక్తిశ్రద్ధలతో కొబ్బరికాయలు కొట్టి నీళ్లతో వారుపోసి పూజలు చేశారు.